పట్టణమున కనతిదూరంబున నిజామాలీ తన శిబిరమును రచించుకొని తన సైన్యమును పట్టణమును దోచుకొన నిచ్చెను. ధన మియ్యని వారి యిండ్లు క్రిందికి లాగఁబడి పరశురామప్రీతి చేయఁబడెను. అటుతరువాత నతఁడు పురంధరున కేగి యచటనుండి తూర్పున భీమనది పర్యంతమును దేశమును ధ్వంసము చేసెను. తరువాత వర్షకాలము తీక్ష్ణమైనందున బీడరు కేగి యచట సైన్యమునకు విశ్రాంతి నియ్యఁదలఁచెను కాని జానోజీభాంస్లే యతనిని ప్రోత్సాహపెట్టి ఔరంగబాదునకు వచ్చునట్లు చేసెను.

ఈమధ్య కాలములో రఘునాధరావు అతని నడకలను గమనింప తిరిగి వచ్చెను. హైదరాబాదుయొక్క చుట్టుగోడ దిట్టమై యతఁడు మొగలు పట్టణము నేమియు చేయుటకు వీలులేకుండునట్లు చేసెను. కాని యతఁడు మాత్రము పట్టణపు శివారులనుండి, 180,000 రూపాయిలు కప్పము వసూలు చేసెను. నిజామాలీ సైన్యములో నున్న మహారాష్ట్ర ప్రముఖులతో నతఁడు రాయభారములు సలిపెను. ఒక్క జానోజీభాంస్లే మాత్రము సమాధానమునకు చెవియొగ్గునట్లు కనుపడెను. అతఁడు మొగలులతోఁ జేరునప్పుడు కలిగిన దురాశలన్నియు, ప్రధాన మంత్రియగు రాజప్రతాపవంతుయొక్క టక్కరితనమును గూరిచి యనుమానమువలన, చల్లఁబడెను. నిజామాలీ రఘునాధరావునకు సాయము చేసినందుకు వాగ్దానము చేయఁబడిన దానిలో కొంతభాగమగు 32 లక్షలు వచ్చుదేశము నిచ్చు వాగ్దానము చేయఁగనే, జానోజీభాంస్లే తిరిగిపోయెదనని యొప్పుకొని, మంచి యాపత్సమయమును వెంటనే కనుఁగొనెను.

మొగలు సైన్యము ఔరంగబాదునకు మార్గముపట్టుచుండగా, వారి వెన్నంటి, రఘునాధరావును అరిగెను. గోదావరి నదిని చేరగనే, నిజామాలీ తనసైన్యములో కొంతభాగమును తీసికొని యేరుఁదాటుచు, తక్కిన భాగమును నదికి దక్షిణతీరమున, సామానులన్నియు జేరువఱకు నుండవలసినదని, దివాను క్రింద నుంచెను. ఈసమయములో, జానోజీ తనసైన్యమున కియ్యవలసిన జీతపు ధనము నియ్యలేదను మొంకపెట్టికొని దివాను నొక్కనీ వదలిపెట్టి తానుదూరముగ శిబిరముండెను. ఈయెత్తు రఘునాధరావునకు ఆనవాలయ్యెను. రఘునాధ

రావు తత్క్షణ మతి త్వరితగతిని నడచి మొగలులతో దొమ్మియుద్ధమునకు దొరకొని వారిని దుర్వార సంగరమున నపరిమిత రక్తపాతంబుతో నోడించెను. రాజాప్రతాపవంతుఁడు కూలెను. మొగలుల పక్షమున నెదిరింపు సుస్థిరమై యుండెను. రెండుదినము లట్టుల యుద్ధము జరిగెను. రఘునాథరావు సేనాముఖమున ప్రతిసంకుల సమరమునను తానె ముందంజవేయుచుండెను. ఒకానొక సమయమందు కేవల మొక్కఁడై, తన సైన్యమునుండి విడఁగొట్టఁబడెను. కానియతఁడు స్వబాహుపరాక్రమంబునను, స్నేహితుఁడగు శకారంహారీయొక్క శౌర్య సాహసంబులవలనను, తన యన్నకుమారుఁడు వచ్చి రక్షించు వఱకును రక్షించుకొన సమర్థుఁడాయెను. యుద్ధము పొడుగునను, మాధవరావు నిజబాహుబలసంపదవలనను సమయోచితంబుగ నొక్క పినతండ్రికే కాక సంకుల సమరంబు జరిగిన నెల్లదిక్కులకును తగుసాహాయ్యమును బంపుటవలన, ప్రసిద్ధి నొందెను. ఉభయపక్షములను జననష్ట మెక్కువయేగాని మొగలులయొక్క నష్టము 10,000 కంటె నెక్కువగా నుండెను.

నిజామాలీ మొట్టమొదట నది కావలితట్టుననుండి ఫిరంగి ప్రయోగమువలన దివానును రక్షింపఁ బ్రయత్నించెనుగాని వీలు కాకపోయెను. అట్లు తన సైన్యంబు నిస్సహాయమై నాశన మొందుచుండ కేవల ప్రేక్షకుండై యతఁడుండ వలసివచ్చెను. అటుతరువాత మహారాష్ట్రులు నదినిదాటి వత్తురేమోయని భయంపడి ఔరంగబాదు కోట గోడలలోని కతఁడు శరణు చొరవలసివచ్చెను. మహారాష్ట్రులును కొన్ని దినములకు నదిని దాటివచ్చి ఔరంగబాదును ముట్టడించిరి. తత్క్షణమే అద్భుతవిధమున ముఖవికాసములను ద్రిప్పఁగల నిజామాలీ రఘునాథరావును దర్శించి, తాను చేసిన తప్పులన్నిటిని గణించిన తన దివానున్ కారోపించి స్తోత్ర పాఠములఁ జదివి, యతని నుబ్బించి, చేసినదాని కంతకును తాను క్షమాపణము పొందుటయే గాక, వెనుక నతనికి కష్టకాలమునఁ దాను చేసిన యుపకారమునకుఁగాను ప్రతి ఫలముగా పాయిర్గాములో వాగ్దానము చేయఁబడిన 51 లక్షల రూపాయలు వచ్చునాస్తిలో జానోజీకిచ్చి వేయఁబడిన 32 లక్షలువచ్చుభాగము పోగా తక్కినది ఇచ్చునట్లుగా నొప్పించెను. రఘు

నాధరావుయొక్క మంత్రు లతఁడు దానిని పూర్ణముగ నెరవేర్చకుండ నతని నిరుత్సాహపఱచిరి. కావున మిగిలిన 19 లక్షలలో 10 లక్షలుమాత్రమే చివర కియ్యఁబడినది.

జానోజీ చేసిన ద్రోహమునకు ప్రతిఫలముగా నియ్యఁబడిన 32 లక్షల భూమికిని పత్రములను వ్రాసియిచ్చు సమయములో రెండుపక్షముల వారియెడల నతఁడు చేసిన ద్రోహమును మాధవరావు బహిరంగముగ దూషించుచు నతని తండ్రి తాతల వంశంబు నభివృద్ధికి తీసికొని వచ్చినట్టియు, హిందువులు ప్రస్తుతమనుభవించుచున్న యౌన్నత్యమునకు కారణభూతమైనట్టియు మాతృ రాజ్యమును పడఁద్రోయుట కతఁడు కారణంబగుటకు దుర్బోధసలిపిన నీతివిహీనంబును ననర్హంబునగు తుచ్ఛ బుద్ధులఁ దీక్ష్ణంబుగ ఖండించెను. మాధవరా వింకను పరాధీనుఁడైయున్నను నతఁడు చిన్నవయసున చూపించిన నిర్భయ పౌరుష యదార్థ వాదిత్వమెంతయు సుప్రసిద్ధమై వెలయుచున్నది. అతని యొక్క బుద్ధి సామర్థ్యములు క్రమక్రమముగఁ నతనిఁబట్టి యుంచిన పరాధీనత్వమును,త్రోసివేయుటకై తమ బలమునువిస్తరింపఁ జేయుచున్నవి.

నిజామాలీతో సంధి సాంతమైన సమయముననే, శైశవమున నుండిన భాస్కరరావు చనిపోయినందున మరల భవానీరావు (శ్రీనివాసగంగాధరుఁడు) ప్రతినిధిగాఁ జేయఁబడెను. మెరిచికోట గోపాలరావు పట్వర్ధనున కియ్యఁబడెను. మఱియు మోరోబా ఫద్నవీసు అతని వారసత్వపు ఉద్యోగమేదియు నియ్యఁబడక పోయినను, అతని పినతండ్రి కుమారుఁడగు బాలాజీ జనార్దనున కా ఫద్నవీసు ఉద్యోగమియ్యఁబడెను. ఈ బాలాజీ జనార్దనునే యింతటి నుండి యతని సుప్రసిద్ధమగు నానా ఫద్నవీసు అను పేరున వ్యవహరింతుము.

దక్కనులో మహారాష్ట్రులిట్లు పోరులఁ బడుచుండ మైసూరున జీర్ణ హిందూ రాజ్య వంశంబుపై నొక్క నూతన ప్రభుత్వము హైదరాలీఖాను అను
1764 నొక్క ప్రసిద్ధ సాహసాంకుని యధ్వర్యంబున ప్రబలుచుండెను. ఆ యధికారము స్వల్పకాలములో మహారాష్ట్ర రాజ్యమును స్వదేశహద్దులుదాటిరాకుండ నడ్డుకట్టునట్లు గానిపించెను. బసాలతుజంగు కర్ణాటకమున నింకను

స్వతంత్ర రాజ్యమును రచియింప నాశఁగలిగి, మహారాష్ట్రులు లేమింజేసి హైదరుతో సఖ్యంబు నెఱపి, యతనిని శేరానవాబుగ నియమించి, రాజ్యస్థాపాదన కిద్దరును దొరకొనిరి. బసాలజ్జంగు తన క్రొత్తస్నేహితునితో హొస్కోటా, శేరా, బూదాబాలాపూరు, 1761 వ సంవత్సరాంతమునకు వశము చేసికొనెను. బసాలజ్జంగు, సోదరుఁడగు నిజామాలీ వలన యుద్ధము పొసగునేమో యను భయమునఁ, దన ముఖ్యపట్టణమగు ఆదోనికి తిరిగివచ్చెను. కాని హైదరు తన విజయ యాత్ర నింకను, జఱుపుచునే యుండెను. 1762 వ సం॥ వత్సరములో రాయదుర్గ, హార్పనహల్లీ, చిత్తలదుర్గ మొదలైన స్థానిని జయించి, బెద్నూరు సూండాల కధిపతియై క్రమక్రమముగ, 1764 సం॥మునకు కృష్ణాతీరము వఱకును తన తాణాల నేర్పఱచెను.

హైదరాలీ యొక్క శీఘ్రప్రాబల్యమునకు మహారాష్ట్రు లుదాసీనప్రేక్షకులుగ నుండలేదు. వానిపై దండు వెడలుటకు పూనాయందు గొప్పసైన్యము కూడుచుండెను. ఈ సైన్యమును తాను నడిపింప నభిలాష కలదనియు, తనకు హాక్కు కలదనియు, మాధవరావు పట్టుపట్టి చెప్పుచు, పినతండ్రిని రాజ్యమేలుచు పూనా యందుండుమని చెప్పెను. ఈ సమయమున శుకారాంబాపూకూడ పీష్వాయొక్క యధికారము నే పాటించెను. రఘునాధరావు విధిలేకయందు కంగీకరించెను గాని కోపమున పూనాను మాత్రము వదలి నాసికయొద్దనున్న ఆనందవేలీ కరిగెను. ఈయేర్పాటునకు పూర్వమున జరిగినవివాదములవలన కొంతయాలస్యమాయెను. ఇందువూలమున ముందుగ కృష్ణానదిని దాటిన గోపాలరావు పట్వర్ధనుఁగు హైదరాలీయొక్క సర్దారుఁడగుఫజులుల్లాఖానుచే నోడింపఁబడెను. మే నెల ఆరంభములో మాధవరావు 30,000 అశ్వదళంబుతోడను, మఱి 30,000 పదాతులతోడను కర్ణాటకముఁజొచ్చెను. హైదరాలీ 20,000 గుఱ్ఱపు దళముతోడను, 40,000 కాల్బలముతోడను నొక దృఢమైనస్థానము నాశ్రయించి యుండెను.

మాధవరావు ఎక్కుడ గుఱ్ఱపుదళమును కలిగియుండుటవలన వర్తమానములను చక్కఁగఁ దెలిసికొనఁగలవాఁడై, శుకారాంబాపూయొక్క యనుభవ

సహాయములచే హైదరుతో నాస్థలియున పోరాడకుండుటకు నిశ్చయించుకొని వార్ధానది కుత్తరముననున్న పట్టణముల నుండియు గ్రామములనుండియు నతని కావలిసైన్యములను తఱిమివేయుటకు తన సైన్యములను నియోగించెను. ఇట్టి యాహవక్రియల వలన హైదరాలీ పెద్దయుద్ధ మొకటి ఘటపడుట కొక్క యుపాయమును చేయవలసివచ్చెను. హైదరాలీ 20,000 జనముతో బయలు వెడలి మహారాష్ట్రులతో స్వల్పయుద్ధంబునకు దొరకొని క్రమక్రమముగ పోరాడుచు వెనుకకు తగ్గి వారిని తనమూలబలంబున్నచోట కాకర్షింపవలెనని యుద్దేశించి యట్లుచేసెను. ఈమాత్రపు మాయ నాలోచించుటం దతఁడు శత్రుసామర్థ్యము నెంత స్వల్పముగ నెఱుఁగునో నిర్ధారణ చేయుచున్నది. మహారాష్ట్రులు తమ యెప్పటివాడుక ప్రకారము, ముందు కొలది మంది జనులను చూపించి చిన్న చిన్న భటనికాయములై పెనుగులాడుచు వెనుకకుపోవుచు, హైదరునే ముందుకు లాగుకొని వచ్చి, తమ మూకలు ఇంకను వెనుకకుఁ దగ్గ, క్రమముగ వృద్ధిపొంద, చిట్టచివఱకు దట్టమైన తురంగదళంబులను జూపించి నలు ప్రక్కలను జీమూత సంఘంబులవలె క్రమ్మివేసిరి. హైదరు క్రమక్రమముగ వెనుకకు తగ్గు కపటోపాయమును విడిచి యొక్కుమారుగ పలాయనంబు చేయవలసి వచ్చెను. చాల జననష్టముతో కాని యతఁడట్లు చేయలేకపోయెను. మరుదినమున హైదరాలీ సైన్యము ఆనావట్టి యొద్ద రణఘడ*శరణ్యమును పొందెను. వర్షాకాల మాసన్నమైనందున మాధవరావు తన ప్రధానస్థానమును వార్ధానది కుత్తరమున నరేంద్ర గ్రామమునొద్ద నేర్పఱచుకొని తన యశ్వసైన్యమును చుట్టుప్రక్కల 20 మైళ్లదూరములో నున్న గ్రామము లన్నిటిలోనికి పంపెను. హైదరాలీ యిట్లు ఓడిపోయిన తరువాత అబ్దుల్ మజీదుఖానుఁడును, గుత్తి మురారిరావు ఘోరేపురేయును పీష్వాయునుకలిసిరి. రామచంద్రజాధవుడు మరల నిజామాలీని కలిసినందున, ఘోరేపురే వంశజుఁడైన మురారిరావును సేనాపతి పదవికతఁడు మరల నియమించెను. రాజారాము కాలములో నన్యాయము

* సైన్యముల రక్షణకొఱకు వెనుక దాగియుండుటకు త్రవ్వఁబడిన నిడుపాటి గోతులు.

నకుఁ బాల్పడిన శౌర్యనిధియగు శాంతాజీ యొక్కవంశజునకు మరల సేనాపతిత్వము నిచ్చుట కేవలము ధర్మమని చెప్పి పీష్వా తనయొక్క యనన్య సద్గుణవిభవంబును తెలియపఱచెను.

తరువాత వర్షాకాలము కొంచెము కడచినతోడనే మాధవరావు ధార్వాడను ముట్టడించిపట్టుకొనెను. వార్ధానది కుత్తరమున నొక్క మాంకుగిరి తప్ప తక్కిన దేశమంతయు నతని స్వాధీనములో చేరెను. వర్షాకాలము బాగుగ తగ్గినతోడనే, యదియుముట్టడింపఁ బడిలోఁబఱచుకొనఁబడెను. యుద్ధము జయప్రదముగ సాంతమానవి గ్రహించి మాధవరావప్పుడు పినతండ్రిని వచ్చి సేనాపతిత్వమును స్వీకరింపుమని కోరెను. అట్టి నవయౌవన సేనానియొక్క కేవల స్నేహభావంబునందుండి రాజకుమారుని వివేకమునకంటె మానవసౌహార్దమున కర్హంబగు సుగుణ పుంజంబుయొక్క సౌరభవిభవంబు పొడసూపుచున్నది. ఆప్రకారము రఘునాథరావు నాసిక వెడలి సైన్యము వార్ధానదిని దాటనున్న సమయములో వచ్చికలిసికొనెను.

ఆనావట్టీకి చుట్టునున్న దట్టమైన పొదలనెల్ల కొట్టివేసి హైదరునకును బెద్నూరునకును మధ్యప్రవేశింప వలెనని మాధవరా వాలోచించెను. మహారా
1765 ష్ట్రులీపనిని ప్రారంభించినతోడనే హైదరు తత్క్షణమే శీఘ్రపలాయనంబు చేసె. దేశము దట్టమైన చెట్లపొదలచే నిండి యున్నందున మొదటిరెండు దినములును హైదరుసైన్యపు వెనుకభాగమును మాత్రమే మహారాష్ట్రులు బాధింపఁగలిగిరి. కాని మూఁడవదినమున దేశము చాల బయలుగ నున్నందున పీష్వాయొక్క సైన్యము హైదరునకును బెద్నూరునకును మధ్యఁ బ్రవేశించి యాతని యుద్ధమునకు నిలువఁబెట్టెను. అతని సైన్యము లతితీవ్రముగఁ దాకంబడినవి. హైదరు 2,500 గుఱ్ఱపు దళముతోడను 10,000 కాల్బలముతో మాత్రమే బెద్నూరు చేరఁగలిగెను. తక్కిన సైన్యము చెదరగొట్టఁ బడెను. అనేక వేలమంది హతులైరి. మహారాష్ట్రులు ముందుకు సాగివచ్చినకొలదిని కావలి సైన్యములన్నియు శీలుపు మాత్రన లోఁబడెను. ఒక్క అనంతపురము మాత్రము కొంతకాల మెదిర్చెను. ఇంతలో హైదరాలీ తన చెదరిన సైన్యములను

బాగు చేసికొని రఘునాధరావునకు సందేశములు పంపఁ దొడంగెను. సంధి నెల్ల నేర్పాటు చేయుట కధికారమంతయు రఘునాధరావున కొప్పగించఁబడెను. మురారిరావు ఘోరేపురేనుండి తీసికొనిన జిల్లాల నన్నిటినితిరిగి యిచ్చుటకును, సావనూరునుండు నబాబుపై నధికారముల నెల్ల వదులుకొనుటకును, పీష్వాకు 32 లక్షలరూపాయ లిచ్చుటకును హైదరాలీ యొప్పుకొనెను. ఈషరతులను మాధవరా వేమాత్రము నామోదింపలేదు. కాని యొకసారి పినతండ్రికి యీపదధికారము నిచ్చినందువలన నేయాక్షేపణయును లేక సమ్మతించెను. పీష్వా కర్ణాటకమును విడిచి ఫిబ్రవరి నెలలో కృష్ణానదిని మరల దాటెను.

మాధవరావు తనపినతండ్రి నెటులనైన సఖ్యపఱచుకొని యతని పదవి గౌరవమునకు రాష్ట్రము యెడల నతని విధ్యుక్త ధర్మమునకును సముచితం బగునంత యధికారము నిచ్చుట కొక వైపున నాతురతఁగలవాడై, రెండవ వైపున నుభయ పక్షములవారి యొక్క కుట్రలనుండి దప్పించుకొన వలసిన వాఁడై యుండెను. రఘునాధరావు భార్యయగు ఆనందీబాయి యొక్క దుడుకు వర్తనముచే సహజముగ నీర్ష్యావంతురాలైన పీష్వాతల్లి యగుగోపికాబాయి క్రోధావేశమును పొంది కుమారుని యాత్మరక్షణముకొఱకై పినతండ్రిని ఖైదునందుంచుమని పోరుపెట్టుచుండెను. మాధవరావు కఠిన చర్యలు లేకుండ చేయఁగల నను యాశ చాలదినముల నుండి కలిగి యుండెను. రఘునాధరావును, తఱుచుగ పట్టుదల స్వభావమువాఁడైనను, భార్య మాటలు చెవికెక్కియున్నప్పుడు తప్ప, తక్కిన సమయములం దంత మూర్ఖబుద్ధి కలవాఁడుకాఁడు. బహు మత్సరయుతురాలును, అతిసాహసురాలు నగు నాభార్య యతని ఆశాకోపములను బంతుల వలె నాడింపకున్న నతఁడు అన్న కుమారుని యొక్క యుద్దేశములతో నేకీభవించెడివాఁడే. రఘునాధరా విట్టి సమయములో నిజామాలీయొక్క గాని, జానోజీభోంస్లేయొక్కఁ గాని లేక అప్పటి స్థితిగతులనుఁ బట్టి బహుశః యిద్దఱి యొక్క గాని సహాయ్యమును పొందగలవాఁడని పీష్వా గ్రహించెను. ఏలయన నిజామాలీ, జానోజీ చేసిన ద్రోహమునకు ఖండిషడు చున్నను, పరస్పరలాభము కొఱకు తత్క్షణమే మిత్రత్వ మొనఁ గూడని భేదమేమియు వారి కంతవఱకు

కలిగి యుండలేదు. నిజామాలీ యీ సంవత్సరములో కృష్ణా నదికి దక్షిణమున నొక దండయాత్రఁ జేసి సోదరుఁడగు బసాలజ్జంగును లోఁబఱుచుకొనెను. హైదరాలీ యొక్క జయముల వలన కృష్ణానదికి దక్షిణ భాగమున నున్న దేశము వతఁడు స్వాధీన పఱచుకొనలేక యుండెను.

ఈస్థితిగతులలో మాధవరావు,నిజాము జానోజీలల్లో నొకరి స్నేహమును సంపాదించుట రాజనీతియని, యాలోచించెను. నిజామాలీ, హైదరుపై మహారాష్ట్రులను తరువాత నుపయోగింపవచ్చునను ఆశతో, జానోజీకి వ్యతిరేకముగ సఖ్యము చేసికొనుటకు సంసిద్ధుఁడగు నని మాధవరావు కని పెట్టెను.

ఈ యుద్దేశముతో సంధిజరిగెను. పీష్వానిజామాలీల సంయుక్తసైన్య
1766 ములు బీరారునకరిగి జానోజీభాంస్లేను తన ద్విగుణద్రోహముచే సంపా
దించిన జిల్లాలలో మూప్పాతికవంతు తిరిగియిచ్చునట్లు బలవంత పెట్టెను.
ఈ దేశములో $\frac{2}{3}$ వంతు అనగా, మొత్తము జానోజీకిచ్చిన 32లక్షలలోసగము
16 లక్షలు వచ్చుదేశము మొగలులకు 'స్థిరమైన శాంత స్నేహంబులకొఱ' కని
పూనా గవర్నమెంటుచే నిచ్చివేయఁబడెను. కర్ణాటకమునందు హైదరుపై
నిద్దఱును కలసి యుద్ధయాత్ర చేయుటకుఁగూడ నీసంధి ప్రశంసించి యుండె.

మహారాష్ట్రులు,శిక్షణావిధానము నవలంబించి తమరాజ్యమును రక్షించుకొనిరి. కేవల రక్షణావిధానమునే యవలంబించియున్నచో వారంత ప్రసిద్ధిలోనికి రాకపోవుటయేగాక క్రమక్రమముగ క్షయంబునొందెడివారని వేఱుగ చెప్ప నక్కఱలేదు. అదేవిధముగ ఈస్టిండియాకంపెనీవారును తమకున్నది కాపాడుకొనుటకుగాను అవలంబించిన శిక్షణావిధానమువలన క్రమక్రమముగ వారిచేతికంతయు దొరకుమార్గము కనఁబడెను. కాని వారివిజృంభణ నెమ్మదిగను స్థిరముగను చేయఁబడినది. ఇందుకు కారణము, లాభాపేక్షితులైనను, సాహసమునకు భయపడునట్టియు తాముగడంగిన ప్రతి క్రొత్తయుద్ధమువలనను ఉన్నది ఊడిపోవునేమోయన్ని జంకునట్టియు వర్తకసంఘముయొక్క జాగ్రత్తయై యున్నది.

ఇఁకమీఁద నిండియాయందు జరుగఁబోవు వివిధ రాచకార్యముల యొక్క నడువడిని తెలిసికొనుట కప్పటికి దేశమునందున్న వివిధ యధికారములయొక్క స్థితిగతులను గొంచెము విచారింపవలెను. యూరోపియను అధికారములలో పోర్చుగీసువారిని మహారాష్ట్రులీవఱకే యణచి వేసినట్లు మనము చూచియున్నాము. పరాసు (ఫ్రెంచి)వారు తమ మాత్ర రాజ్యము వారి వలన డూప్లే బుస్సీలు యుద్యమము లెవ్వియును నెఱవేఱకుండ నడ్డగింపఁబడిరి. ఇఁక నింగ్లీషువారు క్లైవుయొక్క తంత్రోపాయముల కెల్లఁ దోడ్పడి తమ రాజ్యమును బలపఱచుకొని యుండిరి. కావున వీరికి అదృష్టదేవత ప్రత్యక్షంబగుచు నుత్సాహపూరితులఁ జేయుచుండెను. స్వదేశ ప్రభుత్వములలో ఢిల్లీ చక్రవర్తి యఖండ సామ్రాజ్య పదవీచ్యుతుఁడై తన మహామందిరంబున జీవచ్ఛవంబై యనేక రాజ్యకాంక్షితులగు వారిచే చుట్టు కని పెట్టుకొనఁ బడి యుండెను. మహారాష్ట్రులు పూనానుండి కటకమువఱకును, ఉత్తరమున అటకునుండి దక్షిణమున కృష్ణానది వఱకును విజృంభించి విస్తార రాజ్యమును కలిగియుండి దేశము నంతను క్రమింగవలెనను నాశతో నుండిరి. నిజామాలీ భరతవర్షముయొక్క మధ్యదేశము నాక్రమించుకొని నలు ప్రక్కలను శత్రువులచే పరివృతుఁడై తన రాజ్యమును స్థిరపఱచుకొనుట కనేక మంత్ర మాయోపాయంబుల తంటాలుపడుచుండెను. ఇక మైసూరు నందు చతుర్విధోపాయంబుల హైదరాలీ తనకొక రాజ్యమును నిర్మించుకొన వలయునని పాటుపడుచు చాలవఱకు జయశీలుఁడగుచుండెను. ప్రాబల్యములో నున్నవి స్వదేశీయులలో నీ మూఁడు ప్రభుత్వములేయుండెను. ఇందు మహారాష్ట్రులే ఇంగ్లీషువారికి భయనిదానులుగ నుండిరి. ఇంగ్లీషువారు బంగాళమునందు సురాజద్దౌలా నుపాయంబున తొలగించి యధికారయుతులై యుండిరి. బొంబాయి దగ్గఱనున్న సాలసెట్టి, హాగుద్వీపము, కారంజా మొదలైన స్థలములను సంపాదింప బొంబాయి ప్రెసిడెన్సీ కంపెనీవారు దలంచుచుండిరి. మద్రాసు ప్రెసిడెన్సీవారు కర్ణాటక నవాబగు మహమ్మదాలీకి రక్షకులై కొంత యధికారమును సంపాదించియుండిరి. ఆకాలమునాటి కింకను మూఁడు ప్రెసిడెన్సీలు నొక్క

యధికారముక్రిందకు తీసికొనిరాఁబడలేదు. 1773 సం॥ములో రిగ్యులేటింగుఆక్టు వలనఁగాని అవికలకత్తా కౌన్సిలు అధికారము క్రిందకులోఁబడునట్లు చేయఁబడలేదు. అంతవఱకును మూఁడుప్రెసిడెన్సీలునుఒకదానికొక టెక్కువగాక మూఁడు సమానముగ ఇంగ్లాండునందు కోర్టుఆఫ్ డైరెక్టరులకు ప్రత్యేకము జవాబుదారిగనుండెను. కోర్టుఆఫ్ డైరెక్టరులు మహారాష్ట్రులు విజృంభణమడఁగింపఁబడఁగఁ జూచుటకు చాలకోరికతోనుండిరి. కాని స్వదేశీయరాజ్యములు వానిలోనవి కలహించి మహారాష్ట్రులను తక్కిన వారందఱును. కలిసి యణఁగఁగొట్టఁగఁ జూచుచుండుటకే సంతసింపఁదలచిరిగాని తామందైన ముఖ్యమైన భారమును వహించుటకు వారుభయపడుచుండిరి. ఇట్టి స్థితియందు జరిగినచరిత్రాంశములన్నియు నేనున్నవి యున్నట్లు వర్ణించెదనుకాని నాదేశీయులయెడలపక్షపాతముతోఁగాని పరదేశీయులయెడల ద్వేషభావముతోఁగాని నాకుపనిలేదు. అట్లుచేయుటయే చరిత్రకారునికి యుచితము.

ఇంగ్లీషుకంపెనీవారు ఉత్తర సర్కారులను సంపాదింపవలెనని యెన్నిదినములనుండియో యాశకలిగియుండిరి. నిజామాలీ యెంతధనమునకు తమకు దానిని గుత్తకిమ్మనినను ఇచ్చినవాఁడు కాఁడు. కావున నింగ్లీషువారు దానిని బలవంతముగ నాక్రమించుకొనిరి. అటుపైన తామాత్మ రక్షణకొఱకట్టి పనిని చేసితిమని యనేకవిధములైన మనవులను నిజామునకుఁ గావించుకొనిరి. నిజాము మహారాష్ట్రులతోఁ గూడ సఖ్యముగ నున్నవాఁడు కావున, నింగ్లీషువారిని నాశనము చేసెదనని, తెలియఁబఱచెను. మద్రాసు గవర్నమెంటు వారు భయపడి హైదరుతో సఖ్యమును కోరిరి. కాని పరదేశీయు లన్న పచ్చగడ్డి వేసిన భగ్గుమని మండు నాతఁడు వారి రాయభారికి దర్శన మిచ్చుట కొల్లకపోయెను. అటు తరువాత క్లైవుయొక్క యుపదేశమువలన మద్రాసు గవర్నమెంటు వారు నిజాముతోడనే సఖ్యముచేసికొని హైదరు నడచుటకును మహారాష్ట్రుల విజృంభణము నడఁచుటకును తోడ్పడుటకు అతనికి వాగ్దానముచేసిరి. ఈసంధి వలన వారు గంజాము, విశాఖపట్టణము, గోదావరి, కృష్ణయను నీ నాలుగు జిల్లాలకును సంవత్సరమునకు 7 లక్షల రూపాయి లిచ్చునట్లును, నిజామాలీకి రెండు

కాల్బలము పటాలములతోడను 6 ఫిరంగులతోడను సాయము చేయుటకును, సైన్యము యుద్ధరంగమున నవసరమైనయెడల నాయేడు లక్షలరూపాయిలును ఖర్చులక్రింద తీసికొనునట్లును ఏర్పాటు కాఁబడినది. మహారాష్ట్రదర్బారి సంధి
1767 యొక్క యుద్దేశమును గ్రహించెను. మాధవరావు, వెనుక తాను నిజా మాలీతో సంధి చేసికొనిన ప్రకారము, హైదరుపై దండెత్తుటకు, నిజామాలీ స్నేహితుఁడైనను, అతఁడు వచ్చునందాక కనిపెట్టుకొని యుండక తాను స్వయముగ నరిగి, హైదరు నోడించి యతనివద్దనుండి 30 లక్షలు కప్పముఁగొని, బెడ్నూరు రాణిని చెఱ వదలించి తన దేశమునకు తిరిగివచ్చెను. యుద్ధమైన తరువాత నిజామాలీయును ఇంగ్లీషువారును వచ్చి తమభాగము నిమ్మని యడిగిరి. యుద్ధమునందు పనియేమియును చేయక లోన రహస్యముగ తమపై కట్టుకట్టిన నీ భాగస్వాముల రాయభారులు మహారాష్ట్రులచే తిరస్కరింపఁబడిరి నిజామాలీ ఇంగ్లీషువారిని సాయము తెచ్చుకొని, యుద్ధమైన వెంటనే వారి సాహాయ్యముతో మహారాష్ట్రులను తనయిష్టము వచ్చినటుల నాజ్ఞాపింప నెంచెను. మాధవరావు తన శత్రువులయొక్క తంత్రములనెల్ల నంతకు పైయెత్తుచే భగ్నము చేయుటయం దధర్మమేమియునులేదు.

నిజామాలీ తరువాత హైదరుతో కలిసి యింగ్లీషువారి నెదిరింపఁ జూచుటయు, మరల ఇంగ్లీషువారితో కలిసి హైదరు నోడింపఁజూచుటయు మొదలైన తంత్రములతో మన చరిత్రకు సంబంధములేదు. నిజామును ఇంగ్లీషువారును కలిసి హైదరుతో యుద్ధము చేయుచున్నసమయమున పీష్వా ముభావముగ నూరకుండెను. ఇట్టిపద్ధతి నత డవలంబించుట కొంతవఱకు రాజనీతియొక్క యవలంబనము వలనను, ముఖ్యముగ తన రాజ్యమునందలి ఈక్రిందఁ జెప్పఁబడఁబోవు వృత్తాంతముల వలనను అయియున్నది.

రఘునాథరావు, వెనుకటి సంవత్సరమున, జానోజీపై దండయాత్రయైన తరువాత, ముల్హారిరావు హోల్కారును వెంటతీసికొని హిందూస్థానములోనికి దండువెడలెను. ఇదివఱకు మహారాష్ట్రుల వశములోనున్న యనేకస్థానములను లోఁబఱచుకొనుటకు, ముల్హారిరావుయొక్క కాలధర్మమువలన ద్వితీయవిఘ్నము

కలిగెను. అతని మనుమఁడును,ఖండీరావున కేక పుత్రుఁడునైన మాలీరావు శైశవమునందు, తాతగారి రాజ్యమునకువచ్చి, కొలదికాలములోనే చనిపోయెను. అందువలన దివానగు గంగాధర జస్వంతునకు, ఖండీరావు భార్యయగు అహల్యాబాయికిని వివాదముజరిగెను. దివాను,వితంతువగు స్త్రీ పరిపాలన కర్త్రారాలు కాదనియు, జ్ఞాతి నెవరినైన పెంచుకొన వలయుననియుఁ జెప్పెను. దివానుయొక్క ప్రస్తావనను రఘునాధరా వంగీకరించినను స్వగౌరవాభిమానియు, పరిపాలనా ధురంధరశాలియునగు నా సాధ్వీమణి సమ్మతింపక, మాధవరావు పీష్వా యొక్క సాయమువడసి, భక్తియుక్తులగు తనభటుల చేతను, జనవాక్యంబు చేతను, సాహాయ్యంబు నే నుంబడి, ముల్హారిరావుయొక్క ప్రియతిముండును, అనుభవశాలియునగు సిలేదారుఁడును, తమవంశమున కేమియుసంబంధములేని వాఁడునగు తుకాజీహోల్కారును సేనానాయకునిగఁ జేసి పరిపాలన నెల్ల తన స్వాధీనమందుంచుకొని రాజ్యమేలెను. ముల్హారిరావు హోల్కారు మరణకారణమున మహారాష్ట్రులీదండయాత్రయందు శౌర్యముతో పనిచేయఁజాలరైరి. జాటుకులీనుఁడైన యొకసామాన్యప్రముఖుఁడగు గోహదురాణాను రఘునాధరావు లోఁబఱుచుకొన లేకపోయెను. ఈరాణాయొక్క పినతండ్రి పీష్వాబాజీరావు కాలములో ఘనతకెక్కెను. మహారాష్ట్రులు పానిపట్టు యుద్ధమునం దోడిపోయిన తరువాత నితఁడు తిరుగఁబాటు చేసెను. రఘునాధరావు గోహదు పట్టణమును చాలకాలము ముట్టడించిన పిమ్మట నతనియొద్దనుండి 3 లక్షలుకప్పము నంగీకరించెను. దీని తరువాత కొద్ది దినములకు రఘునాధరావు ప్రయాణమై,పీష్వా కర్ణాటకమునుండి తిరిగివచ్చిన కొంతకాలముపిమ్మట ఆగస్టులో దక్కనుకు వచ్చిచేరెను. మాధవరావు పినతండ్రిని తోకాగ్రామములో వచ్చికలిసికొందునని తెలియపఱచగా, తనను పట్టుకొనుట కేదియో ప్రయత్నము జరుగుచున్నదని,యతఁడనుమానించెను. ఆనందీబాయి యొక్క దుర్బోధలవలన రఘునాధరావు మహారాష్ట్రరాజ్యమును రెండుగా చీలదీయనుద్దేశముకలవాఁడై యున్నటులఁ గాన్పించుచున్నది. అందువలన తానుచేయుచున్న ప్రయత్నము లేమైన తన యన్నకుమారునకుఁ దెలిసిన నేమోయని యతఁడు భయఁ



అహల్యాబాయి.

446

పడసాగెను. మాధవరావు తన పినతండ్రిని కడపటి పర్యాయము త్రోవలోనికి దీసికొని రావలయునని యుద్దేశించి, పరిపాలనలో కొంత ముఖ్యకార్య నిర్వాహణము నతనికిచ్చుటయో, లేక యతఁడు నివాసముగా నుండ నిచ్ఛగొనిన దేశభాగము నందిచ్చుటనైన యర్హమును పుష్కలము నైన జాగీరునిచ్చుటయో చేసి యతని నఖ్యపఱచుకొన వాంఛించెను. రఘునాధరావు యొక్క యనుమానములను మాపి, మాధవరావుతో కలిసికొని మాటలాడు నట్లు చేయుట, దుర్ఘటమయ్యెను. కాని చిట్టచివరకు గోవిందశివరాము యొక్క మధ్యవర్తిత్వము వలన సందర్శనము కలిగెను.

రఘునాధరావు మొట్టమొదట నెన్నియిచ్చినను నొల్లక తాను కాశీ కరిగెదనని నిశ్చయవాక్యములు చెప్పెను. మాధవరావు అట్టి తీర్మాన ముత్తమమైనదనియు, నిశ్చయముగ పరిపాలనలో తాను ప్రస్తావించిన భారమును వహించుటయో లేక పరిపాలనతోనే జోక్యమును కల్పించుకొన కుండుటయో నేదియోయొకటి చేయవలసియుండుననిగట్టిగా చెప్పెను. రఘునాధరావు తనయన్న కుమారుని యొక్క కృతనిశ్చయపు మాటలకు రోషమును పొంది తత్క్షణమే యామోదించి నటుల నటించి, అహమ్మదునగరము, శివనేరి, అశీరుఘరు, సతారా కోటల నాయకులైన తన యుద్యోగస్థుల నందఱిని మాధవరావు యొక్క అజ్ఞలను శిరసావహింప వలసినదని నుడివెను. అతఁడు, వైరాగ్యమును స్వీకరింపక పూర్వము, తన భటులయొక్క బాకీజీతముల నిచ్చుటయు, తనకుటుంబ యావచర సంరక్షణార్థము తగినయాధారము కలిగించుటయు, తనకోరిక యంతయు నైయున్నదని చెప్పెను. మాధవరావు మూఁడు నెలలలో సేనలకు గాను 25 లక్షల రూపాయిలు వాయిదాల ప్రకారమిచ్చెదననియు, గోదావరీ తీరమున సం॥ మునకు 12 లక్షలు జాగీరును త్రింబకు, జౌండా మొదలైన యాఱుకోటలను అతని స్వాధీనము చేసెదననియు చెప్పెను. కాని రఘునాధరావు తృప్తి పొందక "మహారాష్ట్ర" రాజ్యములో సగభాగమునకు తనహక్కును స్థాపించుటకు తెగివేచియుండెను.

ఈ కాలములో మాధవరావు యొక్క సఖ్యముకొఱకు, ఇంగ్లీషువారును మహమ్మదాలీయు నొక్కప్రక్కను, నిజామాలీ హైదరు లొకప్రక్కను ప్రయత్నము చేయుచు నాశ్రయించుచుండిరి. మాధవరావు తనకును పినతండ్రికిని
1768 గల కలహమువలన నిశ్చయముగ నేపక్షము చేరనదియు చెప్పక వీలు వెంబడి జరిగింతు నని మాత్రము చెప్పుచు వచ్చెను. వర్షకాల మంతమైనతోడనే రఘునాథరావు 15,000 సైన్యమును కూర్చుకొని, జానోజీభోంస్లేచే కలిసి కొనఁబడు నను ఆశతో మొదట గోదావరీ తీరమునను, తరువాత చందూరు నగములలో ధూరపు దగ్గఱ నొకకోటయందును శిబిరమును నిర్మించుకొని యుండెను. ఈకాలములోనే రఘునాథరావు మఱియొక కుమారుని సంతానము బడయునాశ లేనివాఁడై భూస్కోట వంశస్థుఁడగు నొక కొంకణ బ్రాహ్మణుని పుత్రుని, అమృతరావనువానిని దత్తత చేసికొనెను. ఇతని తరుగఁబాటునందు ముఖ్యమైన సాహాయ్యకులు, దమ్మాజీ గాయక్వాడొకఁడును, హోల్కారు దివానగు గంగాధర యస్వంతుఁడొకఁడునై యుండిరి. దమ్మాజీ గాయక్వాడు తన పెద్ద కుమారుఁడగు గోవిందరావు గాయక్వాడును సాహాయ్యముగఁ బంపెను. గంగాధర యస్వంతుఁడు, రఘునాథరావు పక్షమున నాసక్తి గలవాఁడగుటయేఁ గాక, పీష్వాయెడల స్వకీయమైన నొక్క రోష కారణము కలవాఁడై యుండెను. ఆసంగతియు చదువరుల యొక్క కుతూహలమున కర్హంబై యగును గాన నిచ్చట వివరించెద. రఘునాథరావు పరిపాలననుండి విముఖుడై యేగిన పిదప, నొకనాడు పూనాలో నిండు సభయందు, గంగాధర యస్వంతు నిందా గర్భముగా నిట్లు పల్కెను. 'ప్రస్తుత రాచకార్యములందు నా వృద్ధనయనంబులకు, శిశు నయనంబులతోఁ జూచువాని యొక్క చర్యలు గానిపించుచున్నవి'' అని అతఁడు ప్రసంగించెను. మాధవరావు, చూచువారలకెల్ల విస్మయం బగునటుల, సింహాసనంబునుండి డిగ్గనురికి తీక్ష్ణంబుగ నతని ముఖము మీఁద నొక గ్రుద్దు గ్రుద్దెను. ఎక్కువమర్యాదల కెల్ల నాలవాలంబగు బ్రాహ్మణ దర్బారునందు కోపకారణమున కలిగిన యసామాన్యమైన దృష్టాంత మిది యొకటి యని చెప్పవచ్చును.

మాధవరావు, తన పినతండ్రి యొక్క గొప్ప తిరుగఁబాటును విని వాఁడై జానోజీభాంస్లేవచ్చి యతనికి సాయము చేయక ముందే తత్క్షణము ధుమాపున కరిగి రఘునాధరావు నోడించి లోఁబఱచుకొని ఖైదీగ పూనాకు తీసికొని వచ్చి పీష్వాయొక్క భవనమునందు బద్ధునిఁ జేసెను.

జానోజీభాంస్లే యొక్క విరోధపు ఉద్దేశములు మాధరావునకు తెలిసి యున్నను,వర్ష కాలమువలన నప్పుడతఁడేమియుఁ జేయకయూరకుండెను.కాని నిజామాలీ తోడను హైదరుతోడను మాధవరావు రాయభారములు నలుపు చుండెను. ఇందు నతని యుద్దేశము మూఁడు విధములుగ నుండెను. అతని ముఖ్య యుద్దేశము జానోజీని శిక్షించుటయై యుండెను. దానికొఱకు నిజామాలీతో నతఁడు సఖ్యము చేయుచుండెను. రెండవది, హైదరు ఇంగ్లీషువారితో యుద్ధమున పనిపడి యుండి మహారాష్ట్రుల సాయము తనకు రాఁగలదను ఆశతో నజాగ్రత్తగ నుండి యుండును కాన మెరిచినుండి గోపాలరావు యొక్క సైన్యమును పంపకుండగనే మైసూరు నుండి కప్పమును వసూలు చేయుటయై యుండెను. మూఁడవది, మాధవరావు, హైదరు నిజామాలీల సాయముచే కోర మండల తీరమున,తమసైన్యములు బెంగాలునుండి బీరారునకు వచ్చి జానోజీతో కలియక పూర్వమే, వర్తకవ్యవహారములను నాశనము చేయునేమో యను భయమున,బహుఆతురతతో జానోజీ యడుగుచున్న సాహాయ్యమును బెంగాలు గవర్నమెంటు వారు చేయకుండ చేయుటకైయున్నది.

హైదరు మాధవరావు తనకు సాయపడ నిష్టముగల్గియున్న వాని వలె నటించి నందున ఆ బెట్టు మీఁద మద్రాసు గవర్నమెంటు వారు తనతో సఖ్యపడునట్లు చేసికొనెను. మహారాష్ట్రులయొక్కయు మొగలుల యొక్కయు కలిసిన సైన్యములు పీష్వాచేతను, రుకనుద్దౌలచేతను నడుపఁబడి జానోజీ భాంస్లేపై దాడి వెడలెను.

జానోజీ, యీదండయాత్రికులను పూర్వ మహారాష్ట్ర పద్ధతి ప్రకారము అడ్డగించుటకు,కేర్పాటుచేసి కొనెను. మాధవరావు అట్టి యుద్ధమునం దను భవముకలవాఁడు కాఁడు. ఫిరంగిదళము, అరబ్బులు, కొంత యురోపియను

శిక్షణొందిన శాల్బలము, అనేక గుడారములు, పీష్వా యొక్కయు, రుకన ద్దౌలాయొక్కయు శిబిరపు సామానులు, జానోజీ యవలంబించిన హానరయుద్ధ క్రియల కర్హము లైనవి కావు.

ఇట్లు కూడిన సైన్యములు బీదారు ప్రవేశించెను. జానోజీయొక్క సుభేదారుఁడగు నారూపంతు వారి నెదిరించెను కాని యుద్ధమునందు హతుఁడయ్యెను. అతని మేనల్లుఁడగు విఠలపంతు బల్లరు, నాగ్పూరునకు పాఱిపోయి, జానోజీ మూఢాజీ మొదలైన వారు తమ కుటుంబములతోఁగూడ శిబిర మున్న చోటికి పోయి కలిసికొనెను. పీష్వా ముందుకు వచ్చిన కొలదిని వారుపశ్చిమమున కరిగి తమ కుటుంబములను సామానులను గావలఘడకోటయం దుంచి, వీరూరుజనూరు నొద్ద సాబాజీ యొక్క గొప్పసైన్యముతో కలిసికొనిరి. మాధవరావు నాగ్పూరును కొల్లఁబెట్టెను. జానోజీ తనరాజధానిని రక్షించుకొనుట కేప్రయత్నమును చేయలేదు. అతఁడు రామటేకున కరిగి యచట నాలవసోదరుఁడగు బింబాజీతోఁగూడ కలిసి కొనఁబడెను. జానోజీ ఉత్తరమున నున్న పీష్వా యొక్క జిల్లాలపై నేగునట్లు నటించెను. మాధవరా వతనిని వెంబడింప నిచ్ఛగింపక, యనేక జిల్లాలలో ఠాణాల నేర్పరచి దేశమునందు రివిన్యూ వసూలు చేయుచు చాందా కోటను ముట్టడించెను. ఈమధ్యకాలములో జానోజీ గిరుక్కున పశ్చిమమునకు తిరిగి అహమదునగరముదాటి పూనా మార్గములో నున్న దేశమునంతయు కొల్లఁబెట్టఁదొడఁగెను. నిజామాలీ పూనా పట్టణమును కొల్లఁబెట్టిన తరువాత మాధవరా వొకప్పుడు చుట్టుగోడను కట్టించవలెనని యాలోచించెను. కాని యట్లు చేయుటవలన సింహగడ పురందరు దుర్గములలో సురక్షితముగ నుండుటకు వీలయిన తమ యాస్తిని జనులు చుట్టుగోడలను నమ్ముకొని యుండుటవలన, బొత్తుగ నష్టపడుదురేమో యని యతఁడా యుద్యమమును విడిచిపెట్టెను. జానోజీ దగ్గఱకు వచ్చుచున్నాఁడని తెలియఁగనే పట్టణస్థులు తమయాస్తి నెప్పటి యట్టుల దుర్గములకుఁ బంపివేసిరి. మాధవరావున కీ సంగతి తెలియఁగనే గోపాలరావు పట్వర్ధనుని, రామచంద్రగణేశుని, 30,000 గుఱ్ఱములతో నతని వెంబడింపఁ బంపెను. జానోజీ యింకను

పూనా సమీపమున కొల్లఁబెట్టుచునే యుండెను. గోపాలరావు పట్టవర్ధనుఁడు వానితో రహస్యముగఁ గూడియున్న వాఁడని నిందింపఁబడుటయుం దధర్మమే మియును లేదు. పీష్వాయును రకనుద్దౌలాయును చాందాకోట ముట్టడి నెత్తి వేసిరి. జానోజీ గోదావరి వైపునకు నడచి, గోపాలరావు లేనిసమయమునఁ బీష్వాతో ధర్మయుద్ధము చేయుటకు సిద్ధపడినటుల కనుబడెను. కాని యతనికి నిజముగ నట్టి యుద్దేశములేదు. అతఁడు మహాదాజునొద్ద పీష్వా సైన్యమును దాటిపోయి బాపూ కరంధియా యను వానిని కొంత సైన్యముతో ముట్టుకొనను పీష్వా సైన్యముపైఁ బంపెను. అతఁడును హఠాత్తుగ వచ్చి పైఁబడి పీష్వా యొక్క సామానులలో కొంతభాగమును ఎత్తుకొనిపోయెను. ఇట్లు ఒక దేశస్థులైనట్టివారు పరస్పర వినాశనము చేసికొనుచున్న వీరుభయులును యుద్ధము వలనఁ జాల యలసిరి. జానోజీ యింతవఱకు తానెదురుచూచినంత జయమును బొందినను, ఇఁక యుద్ధము నడచినయెడల తాను సంపూర్ణముగఁ గ్రుంగుననియతఁడు గ్రహించుకొనెను. ఇంతలో మాధవరావు వర్తమానములు విని సోదరుఁడగు మూడాజీ ప్రతిపక్షులఁ జేరెను. అందువలన నొకసంధి, (లేక సంధి వలన జానోజీయొక్క స్వాతంత్ర్యమును పీష్వాతో సమానమని అర్థమగునుఁ గాన పీష్వాయొక్క పరిభాషలో అంగీకారము) మార్చి 23వ తారీఖున అనఁగా హైదరాలీ తన యతిశయ యూహావ క్రియాసైపుణ్యమువలన, ఇంగ్లీషువారికి మద్రాసు పట్టణద్వారమున శాంతము ననుగ్రహించుటకు పూర్వము 11 దినములక్రింద, నేర్పాటు చేయఁబడెను. ఈ సంధియొక్క షరతులు 13 గలవు. అందు ముఖ్యమైనవి వెనుక జానోజీ రాఖిసుబోను దగ్గఱ మొగలులకుఁ జేసిన ద్రోహమునకై పీష్వానుండి పుచ్చుకొనిన దానిలో ఇదివఱకిచ్చిన భాగము పోగా తక్కిన నాలుగవ వంతు నిచ్చుటకును, సైన్యమును పీష్వా యిష్టములేక తగ్గించకుండను ఎక్కువ చేయకుండ నుండుటకును సమయమువచ్చినపుడు సహాయ్యము చేయుటకును పీష్వా సైన్యమునుండి తిరుగఁబాటు చేసి పాఱివచ్చిన వారి నెవ్వరిని రక్షింపకుండుటకును, ఢిల్లీ చక్రవర్తితోఁ గాని, దక్కను సుబేదారుతోఁగాని, ఇంగ్లీషువారితోఁగాని, రోహిలాలతోఁగాని, ఔడు నవాబు

తోఁ గాని రాజకీయ ఉత్తర ప్రత్యుత్తరములు జరుపకుండను, 5 లక్షల యావాయిలు అయిదు సంవత్సరపు వాయిదాలలో పీష్వా కిచ్చునటులను, జానోజీ ఒప్పుకొనెను. ఇందుకు పీష్వాయు, జానోజీ తన సోదరులయొక్క న్యాయమైన హక్కులు జరుగ నిచ్చినంత కాలము, వారిని గూర్చి ఱేజోక్యమును కలుగఁ జేసికొన కుండునట్లును, జానోజీ దేశములోని కెవరైన దండెత్తి వచ్చినయెడల సాయము చేయుటకును, ఒరిస్సాలో కష్టములు కలుగఁ జేయుచున్నారనిన యింగ్లీషువారిపై సైన్యమును జానోజీని పంపించుకొన నిచ్చుటకును, సమ్మతించెను.

మాధవరావు పొందిన లాభములలో, నిజామాలీ సంవత్సరమునకు మూఁడు లక్షల రివిన్యూ చొప్పునఁ బడసెను. ప్రధానియగు రుకనుద్దౌలా కొక లక్ష సంవత్సరపు రివిన్యూ యియ్యఁబడినది.

ఇట్లు బీరారు రాజుపై దండయాత్ర యంత్యమైన పిమ్మట, పీష్వా విశాజీ క్రిష్ణ బేనీవాలా యాధిపత్యము క్రింద నొక సైన్యమును, రామచంద్రగణేశును, తుకాజీ హోల్కారును, మహదాజీ సింధియాను తోడిచ్చి, మాల్వాలోనికిఁ బంపెను. వీరియొక్క చర్యలను విచారించుటకుపూర్వము సింధియాయొక్క కొన్ని స్థితిగతులును, పూనాలోని గృహవ్యవహారములును, కర్ణాటకములోని యాహవక్రియలును మన యవలోకనంబు నాకర్షించుచున్నవి.

మహదాజీ సింధియా, తన యన్నకుమారుఁడగు జంకోజీయొక్క మరణానంతరము, తాను దాసీ పుత్రుఁడై నందున కుటుంబ జాగీరునకు వారసు కాకపోయినను, తనయొక్క సేవలవలనను, సామర్థ్యముల వలనను హక్కుదారుఁడ నని చెప్పుకొనుటకు సాహసించెను. రానోజీ సింధియాకు మఱి యెవ్వరును వారసులు జీవించి యుండనందున నితని హక్కులను త్రోసివేయుట యంత యుచితముగఁ గాని రాజనీతి సమ్మతముగఁ గాని యుండదు. అతనియొక్క జన్మ మహారాష్ట్ర సిలేదారులలో నతని గౌరవమును తగ్గించెను. ఈకారణమువలననే అతఁడు తన సైన్యమునందు మహమ్మదీయులను రాజపుత్రులను ఎక్కువగఁ జేర్చుకొన నారంభించి సైన్యముయొక్క తత్త్వము నెల్ల పూర్ణముగ మార్చివేసెను. రఘునాథరావు, ఏ న్యాయమైన కారణము లేకుండ మహదాజీని యతనిస్వంత

యన్నయగు తుకాజీయొక్క కుమారుఁడగు, కేదార్జీ సింధియాను సంరక్షకుడుగా నుండ నియమింపఁ దలంచెను. పీష్వా యిందుకు సమ్మతింపలేదు. ఈ యభిప్రాయభేదమువలన మాధవరావునకును రఘునాధరావునకును విరోధ మెక్కువగుటయే గాక, మహాదాజీ సింధియా, పేరునకుమాత్రము కార్యకర్తలును నిజమునకు మంత్రులును అయిన నానాఫడ్నవీసు, హరిపంతు ఫడ్కే మొదలైన వారిపక్షమునకు తిరుగునట్లు తటస్థించెను.

పైఁ జెప్పఁబడిన దండయాత్రపై నరుగ మహాదాజీ సింధియా యాజ్ఞాపింపఁబడినపుడు, తక్కిన సేనాపతు లందఱును దర్శనము చేసికొని సెలవు పుచ్చుకొనినను, తాను మాత్రము పూనా సమీపమున తారుచుండెను. ఉద్యోగస్థుల విధేయత నెప్పుడును కఠినముగఁ గోరువాఁడైన మాధవరావు, వారు నదులన్నియు వఱదలువచ్చి పొంగియుండక పూర్వమే దాటవలయునని, ముఖ్యముగా చెప్పియుండెను. కాని తరువాత రెండుమూఁడు దినములకు మాధవరావు తన మనోహరగ్రామమగు ధీయూరుకు పోవుచుండగా సింధియా యింకను కదలవలయునని యుద్దేశముయొక్క లక్షణము లెవ్వియును లేక నిలచియుండగాఁ జూచెను. అతఁడు తత్క్షణమే యతని యవిధేయతకును, అహంభావమునకు నచ్చెరువగుచున్నదనియు, తాను ధీయూరునుండి తిరిగివచ్చునప్పటికి కొక్క గుడారము కాని భటుడుగాని కంటికి కగపడినయెడల నతని శిబిరమును కొల్లబెట్టించి యతని జాగీరును తీసివేయుదునని కఠినముగ వర్తమాన మంపెను. మహాదాజీ వెంటనే ప్రయాణ మయ్యెను. మాధవరావుయొక్క గుణలక్షణములను తెలియజేయు నీచిత్రకథ, తరువాత మహారాష్ట్ర రాజధానియందు మహాదాజీ సింధియాయొక్క భవిష్యదధికారముతో పోల్చిచూపిన మఱియు సుప్రసిద్ధమై వెలయును.

పీష్వా తన విశ్రాంతికాలమునంతను దేశముయొక్క సివిలు వ్యవహారములను చక్కఁబఱుచుటయందు వినియోగించుచుండెను. ప్రశస్తంబగు నిట్టికార్యనిర్వహణమందు అతఁడు తీవ్రమైన దురభిప్రాయములతోడను సర్వసామాన్యమగు (లంచముపుచ్చుకొనుట మొదలైన) దుర్వ్యాపారములతోడను పోరాడవలసివచ్చెను. కానియతఁడుచేసిన సంస్కారములవలని సత్ఫలములు ప్రజలచే

నిప్పుడు గ్రహింపఁబడెను. తనప్రజలను, సహేతుకధర్మపరిపాలన చేసి రక్షింప వలయునని యతని యథార్థ యుద్దేశ మతని ప్రభుత్వమున కెంతయు గౌరవ ప్రకాశ మొసంగెను. అతనియొక్క ప్రయత్నములకు నిష్కళంక కీర్తివంతుఁడగు రామశాస్త్రి తగు సాహాయ్య మొసంగెను. ఆకాలములో హిందూదేశములో నే దర్బారునందు చూచినను స్వార్థపరత్వమువలన ననేక కుట్రలకు దిగుచుండు రాజకీయ యుద్యోగస్థులుండ మహారాష్ట్ర దేశంబున అనుపమన్యాయగుణశీలుండగు రామశాస్త్రి యాస్వతంత్రరాజ్యంబున కలంకారముగ న్యాయాధీశుఁడై వెలసెను. ఈయన యింటిపేరు పర్వనీవారు. సతారాయొద్ద మహోలీ గ్రామ మాయన కాపురస్థలము. చిన్నతనమందే యితఁడు కాశికేగి యచట సంస్కృతవిద్య నభ్యసించి, 1759 సం॥మున బాలక్రిష్ణశాస్త్రి పరలోకగతుఁడైన పిమ్మట పూనాయందు దుద్యోగమున కెన్నుకొనఁబడెను. దర్బారులో శాస్త్రులందఱకును పెద్దగా నీయన నియమింపఁబడినపు డీయన యాయుద్యోగమును కోరను లేదు; ఇచ్చిన పిమ్మట వద్దనను లేదు. మాధవరావు అధికారమునం దధికుఁడైన కొలదిని రామశాస్త్రి యతనికి తాను చూచుచున్న వ్యవహారము నందేగాక, పరిపాలనా వ్యవహారమునందును సద్బోధనొసంగ నెక్కువ శ్రద్ధతీసికొనుచుండెడివాఁడు. మాధవరావు అనేక పండితులగు బ్రాహ్మణులతో గోష్ఠిసలుపుటవలన శాస్త్రులవారనేకులు బోధించిన స్మార్తకర్మలయందు ప్రొద్దుపుచ్చుచుండెడివాఁడు. రామశాస్త్రి, పీష్వాను, సామాన్యపు హేతువాదమువలన, నీయనుష్ఠానములనుమాన్పింపఁ బ్రయత్నించుటవలన, మాధవరావుతోఁగాని యతని స్నేహబృందముతోఁగాని మితిలేని యనవసర వాదమునకు కారణమగునని గ్రహించియుండెను. కాని యొక్కదినమున వ్యవహారముపొంటె పీష్వాయొక్క దర్శనార్థమై వచ్చి, యతఁడు హిందూవిరాగులకు నిర్ణయింపఁబడిన పెద్దజపమునందు మునిగి యుండగా తెలిసికొని, శాస్త్రి యింటికి వెడలిపోయెను. మఱునాడు తాను చేసికొనవలసిన కొద్దియేర్పాటులను జేసికొని, పీష్వా దగ్గఱకేగి, తనయుద్యోగమునకు రాజీనామాయిచ్చి, నయవినయంబులతో తాను కాశికేగెదనని మనవిచేసెను. మాధవరావు వెంటనే వెనుకటిదినమున తాను చేసిన యనర్హ కృత్యమున

కెంతయు మన్నన వేడుచు, అందుకు కారణము శ్లాఘాపాత్రంబయినదనియు, క్షమాపణీయం బనియును సమర్థించుకొనుచు పల్కెను. అందుకు రామశాస్త్రి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "తమరు లౌకిక కార్యములనెల్ల త్యజించినచో నది సత్యమే. బ్రాహ్మణులు తమ ధర్మమును త్యజించి రాజ ధర్మమును స్వీకరించినపుడు, అట్టి దురాక్రమణకు క్షమాపణ, తమ యధికారమును ప్రజాలాభము కొఱకు నుపయోగించుటయందే కలదు. తమ జనులయొక్కయు, పరిపాలనయొక్కయు క్షేమవిషయమున శ్రద్ధనుంచుటయే మీధర్మమైయున్నది; లేక ఈవిధాయక కృత్యములను తమరు సమ్మతింపలేరేని, సింహాసనంబువిడిచి, నాతో వచ్చి మనమతము బోధించు ధ్యానజపంబులయందు తమజీవితమునుగడుపుడు" మాధవరావు, శాస్త్రియొక్క వాదమునందలి సత్యమును నొప్పుకొని, అప్పటి నుండియు నట్టికాలయాపనలను మాని వేసెను.

రామశాస్త్రితనదేశీయుల కొనర్చిన మేలు, అతనియుదాహరణమువలననై యుండెను. అతనియభిప్రాయముల విలువయు సత్యస్వభావమును నతనికాలము వారెల్లరిచేతను నంగీకరింపఁబడియుండెను. అతనికాలమున పంచాయతీలతీర్పు లిప్పటివఱకు నుదాహరణంబులుగా పరిగణింపఁబడుచుండెను. అతనిసత్ప్రవర్తనయు అశ్రాంతయుత్సాహమును అన్నితరగతుల జనులను బాగుచేయుటయందు అద్భుతమగు కార్యకారియైయుండెను. సత్పురుషులందఱ కీతఁడాదర్శకుఁడుగనుండెను. మహాపురుషుఁడైనవాఁడుకూడ నక్రమము చేసినపుడు రామశాస్త్రియెదుట భయఁపడుచుండెడివాఁడు. ధనాధికులును, స్థితిపరులు ననేకపర్యాయము లతనిమోహపెట్టఁ బ్రయత్నించిరి గాని, ఎవరుగాని యట్టిపనిని మరల రెండవసారి ప్రయత్నముచేయుటకు సాహసింపఁజాలరైరి. అతని యదార్థస్వభావము నెవ్వరును ప్రశ్నింపనైనజాలరైరి. అతనియలవాటులు బహు సామాన్యమైనవి. ఒక్కదినము ఖర్చుకంటె నెక్కువ యెప్పుడు నింటియొద్ద నుంచుకొనకుండుట యతని నియమమైయుండెను.

మాధవరావు మొట్టమొదట చేసిన సంస్కారము, గ్రామస్థులను వెట్టిమూటలను బలవంతముగ మోయించువాడుకను తొలఁగించుటయైయున్నది. మన

దేశములో బహుసామాన్యమైన ఈయాచారము మొట్టమొదట మాధవరావుచేఁ దీసివేయఁబడినపుడు అధికారులలో నసంతృప్తి కలిగెను. అనేకులు రహస్యముగ నట్లు నిర్బంధసేవలను చేయించుకొనుచుండిరి. బేసీను సుభేదారుఁడైన విశాజీ పంతు కొన్ని విలువగల వస్తువుల నీవిధముగ పట్టించుకొని పోవుచుండ మాధవరావు తెలిసికొనినవాఁడై యావస్తువులనుపట్టుకొని సర్కారునకు జప్తుచేయించెను. వ్యవసాయపుపనులనుండి తీసికొనిపోఁబడిన గ్రామస్థులకుఁదగిన ప్రతిఫలమునిచ్చి, షరల క్రొత్తయుత్తరువులు చేయించెను. అతనియొక్క రహస్య వర్తమానపద్ధతి నెఱిఁగినవారెవ్వరు నతనియాజ్ఞలను ధిక్కరింప సాహసింపరైరి.

తరువాత వర్షకాలమైన పిమ్మట, మాధవరావు కర్ణాటక వ్యవహారవిషయమున మరల శ్రద్ధవహించెను. హైదరు ఇంగ్లీషువారితో సంధిచేసికొని, వారియొద్దనుండి సాహాయ్యముపొందుటకు వాగ్దానముఁగొని మహారాష్ట్రులతో యుద్ధముసేయుటకు భయములేకయుండెను. బాకీ కప్పమునిచ్చుటకు నిరాకరించుటయేగాక పీష్వాకు సామంతులైన పోలిగారులయొద్దనుండి యతఁడు కప్పములు వసూలుచేయుచుండెను. మాధవరావు దీనిని సహించువాఁడు కాఁడు.

1770 నవంబరులో గోపాలరావు పట్వర్ధను, ముల్హారిరావు రాస్తియా, గోపాలరావు పినతండ్రికుమారులైన పరశురామభావూ, నీలకంఠరావు పట్వర్ధను మొదలైనవారిక్రింద గొప్ప యాశ్వసైన్యమును బంపెను. మాధవరావు 35,000 సైన్యముతో వెనుక బయలుదేరెను. అతఁడు శీఘ్రముగ ననేకకోటలను, ప్రాకారరక్షితములైన గ్రామములనుపట్టుకొనెను. మాల్వాగల్ కోట ఘాట్గేవంశజులైన నిద్దరు వైరివారసులచే దొమ్మియుద్ధమున పట్టుకొనఁబడెను. వీరియొక్క వారసత్వపు తగాయిదాలు భామినీరాజ్యము కాలమునుండియు నుండెను. ఇందులో బుధుగ్రామమువారొకరు, హొల్లాలీగ్రామమువారొకరు. వీరియొక్క వివాదములు పీష్వాయొక్క శిబిరమున మరలమరల నుద్రేకమునకుఁ దేఁబడెను. పంచాయతీవలన నాగోజీరాజుపక్షమున తీర్మానమియ్యఁబడినను, రెండుపక్షములయొక్క ముఖ్యుడగు, బాజీఘాట్గే సంతుష్టిపొందనందున నుభయపక్షములవారును తమవివాదమును ద్వంద్వయుద్ధమున తమ కుటుంబాచారప్రకారము

తీర్చుకొందుమని మాధవరావును సెలవడిగిరి. మాధవరావందుకు సమ్మతింపలేదు. కాని యుద్ధము శత్రులతో సంప్రాప్తమైనపుడు వారిద్దఱిలో నెవరి జెండా జరీపతాకముకంటె ముందుగా శత్రువుకోట బురుజుపై కనుపడునో వాని వారసత్వపుహక్కులు స్థిరపఱుపఁబడునని ప్రస్తావన చేయఁబడెను. శాజీఘాట్గేయొక్క జెండాను తీసికొనిపోయిన నావంశస్థుఁడు యుద్ధమునందుఁ దెగెను. జరీపట్కాను తీసికొనిపోయిన దండరేయనువాఁడుకూడ రణనిహతుఁడయ్యెను. నాగోజీ యా జరీపట్కాను తానుతీసికొనిపోయి తన జెండాను తన చేతులతో ముందుగా బురుజుపైపాతి తరువాత జరీపట్కాను దానిపై నెక్కించెను. అతని శౌర్యకృత్యమునకు మహారాష్ట్రులెల్లరు తమ కరతాళధ్వనుల నుత్సాహంబుం దెలియఁబఱచిరి.

పీష్వాయొక్క దండయాత్ర కొంతవఱకు నిడ్జిఘులువద్ద అడ్డగింపఁబడినది. అచ్చట కోట బహుదృఢమైనదైయుండి మహారాష్ట్రులను రెండుసారులు లోపలఁ బ్రవేశింపకుండ నెదిరించినది. ఒకసారి పీష్వాయొక్క సోదరుఁడగు నారాయణరావునకు అరచేతిలో గుండుదెబ్బవలన కొంచెము గాయముతగిలినది. చిట్టచివఱకు చిత్తల్ దుర్గపాలిగానివలన నతని బెరూదుజాతివారి * సహాయముచే పట్టుకొనఁబడినది.

మహారాష్ట్రులు తూర్పుననుండి వచ్చుచున్న కొలదిని హైదరు పడమటివైపునకు తగ్గుచుండెను. అచ్చట దేశము గుట్టపెట్టలతోడను అరణ్యములతోడను చీకాకుగనుండుటచేత మహారాష్ట్ర యశ్వసైన్యము లంతగా పనిచేయఁజాలవు. హైదరు తనకాల్బలము మహారాష్ట్ర యశ్వసైన్యముతోఁ బెనంగలేదు కావున, మాధవరావుసైన్యమున కిరువదిక్రోసులలోపలికైన వచ్చుటకు సాహసింపలేదు. కాని గోపాలరావుక్రింద నతనినడకలను పరీక్షించుటకుఁ బంపఁబడిన కొద్దిసైన్యము, హైదరుచే, మార్చి 3, 4 తారీకులను, తఱుమఁగొట్టఁబడెను. ఇందువలన హైదరునకేమియు లాభముకలుగలేదు. మహారాష్ట్రులు అతనిదేశమును కొల్లఁబెట్టుచు నాశనము చేయుచున్నుండిరి. వర్షకాలము సమీపించిన

* బెరూదులు మహారాష్ట్రమునుండివచ్చిన రామూసీలుగా తెలియఁగనది.

పోడనే వారు కృష్ణానదికి ఉత్తరమునకు తగ్గిపోవుదురని హైదరు యెదురు చూచుచుండెను. కాని యతనియూహాప్రకారము జరుగలేదు. జానుజీ మాధవరావు దుర్గతవలన పూనా చేరవలసివచ్చెను. కాని అతఁడు తన కాల్బలమును, 20,000 గుఱ్ఱపుదళమును త్రింబకరావు మామాకిచ్చి యుద్ధమును సాగింపవలసినదని యాజ్ఞయిచ్చెను. హైదరు ఘాటునిచ్చెదనని యొప్పుకొనెనుగాని, పోలిగారుల నుండి వసూలుచేసిన సొమ్మునుమాత్ర మిచ్చుట కంగీకరింపలేదు. 1762 సం॥లో వారు తనయధికారమునకు లోఁబడినందున వారికప్పమునకు తానే యధికారినని యతఁడు చెప్పెను.

త్రింబకరావు, మరల వర్షాకాలమంతమైన పిమ్మట పీష్వా మరలరాక పూర్వమే చాలజయమునుపొంది గుఱ్ఱముకొండకోటను మఱి కొన్నిటిని వశపఱచుకొనెను.

మాధవరావు, కాలము తెలిపి యియ్యఁగనే, పూనానుండి బయలుదేరి త్రింబకరావును కలిసికొనవలెనని యుద్దేశించెను. కాని కొంతదూరము వచ్చిన తరువాత మరల జబ్బుపడి, పానిపట్టు యుద్ధమున వీరమరణమునొందిన బల్వంతరావు యొక్క కుమారుఁడగు అప్పాబల్వంతునకు సైన్యాధిపత్యము నప్పగించి తాను మరలిపోయెను. అప్పాబల్వంతుడు కలిసికొనిన తరువాత మహారాష్ట్ర సైన్యములు 40,000 గుఱ్ఱమును, 10,000 కాల్బలమును కొన్ని ఫిరంగులను కలిగియుండెను. హైదరుయొక్క సైన్యము 12,000 గుఱ్ఱమును, 15000 కాల్బలమును 40 క్షేత్ర ఫిరంగులును * కలిగియుండి యుద్ధమునకు డీకొనమొట్టమొదట సాహసింపఁజాలకపోయెను. అందువలన మహారాష్ట్రులు శ్రీరంగపట్టణమునకు ఉత్తరమున కొంత దూరముగ దండువిడిసిరి. త్రింబకరావు హైదరును అతని స్థానమునుండి వెలుపలకు రప్పించుటకు ఉత్తరపుదిక్కునకు కొంతదూరము తగ్గిపోయెను. హైదరు తప్పుడు వర్తమానమువలన మోసపోయి త్రింబకరావు సైన్యము చాలభాగము చీలఁదీయఁబడినదని విని యుద్ధమునకడంగెను. వెంటనే

* క్షేత్రఫిరంగులు. (Field-Pieces) రణక్షేత్రమున నుపయోగింపఁబడు పెద్దఫిరంగులు.

యతఁడు తానుపడినమోసమును తెలిసికొనెను. వెనుక మహారాష్ట్రులచే దెబ్బ తినియున్న జ్ఞాపకమువలననో లేక తన సైన్యమునందు నమ్మకములేకనో (మంచి సేనాపతియం దిట్టి యవస్థబహుఅరుదు) బ్రిటిషుసైన్యములను ఖండతుండెము లుగా నఱకిన యీవీరుఁడు యుద్ధమునకు సాహసింపలేక పటాపంచలైన సైన్యములతో భయంబుఁగదుర్గ పలాయనంబు నేసెను. అతని ఫిరంగులన్నియు మహారాష్ట్రులకుఁ జిక్కెను. వేలకొలది సైనికులును 1500 అశ్వదళమును నాశనమయ్యెను. 2 ఏనుఁగులు అనేక వేలగుఱ్ఱములును గ్యాడారపుసామానును మహారాష్ట్రులజయాంకము లయ్యెను.

ఈ జయము పిమ్మట, త్రింబకురావు శ్రీరంగపట్టణమును ముట్టడించెను. ఫిరంగులను ప్రయోగించునట్టి సమర్థులు త్రింబకురావునకు లేకపోవుటవలన ముట్టడితీవ్రముగ జరుగలేదు. మాధవరావు ముట్టడికి సమ్మతింపక బెదనూరు మండలాలను లోఁబఱచుకొనుమని యుత్తరువిచ్చెను. త్రింబకరావు అయిదు వారములు శ్రీరంగపట్టణమునొద్ద కాలయాపన చేసి బెల్లూరుదగ్గరబలమైనకావలి సైన్యమునుంచి ఏప్రిలునెలలో తరీకాయిరాయొద్ద శిబిరముండి యనేక దిక్కులనుండి కప్పములం గొనెను.

బాటలన్నియు పూర్తిగ నాక్రమింపఁబడక పూర్వమే హైదరు జూను మాసారంభమున బెదనూరినుండి శ్రీరంగపట్టణమునకు 20 ఫిరంగులను యుద్ధ సామగ్రియు తెప్పించుకొనుటకు ప్రయత్నము చేసెను. కాని యవి యన్నియు నడ్డగింపఁబడెను. హైదరుయొక్క హర్కారులు చివరకు కూర్గదేశములోనుండి మలబారుఘాటీలపై నుండి దిగి బెదనూరికి పోవలసివచ్చెను. అక్టోబరు 24-వ తారీఖున మహారాష్ట్రులు బెంగుళూరునకు వచ్చిరి. హైదరు అన్నివిధములగు సైన్యాంగములతోడను 20,000 భటులఁగలిగి శ్రీరంగపట్టణమునొద్ద దృఢమైన రణఘడను నిర్మించుకొని యుండెను. ఆకాలమునందంతను అతనికిఁగలిగిన కొంచెము జయమును కుమారుఁడగు టిప్పూవలన నయ్యెను. అతఁడు, మహారాష్ట్ర శిబిరమునకై పోవుచున్న గొప్పధాన్యపు సంభారము నడ్డగించి పట్టుకొనెను. హైదరుయొక్క యవస్థ గొప్పయాపదలో నున్న

ట్లు కనుబడెను. మద్రాసు గవర్నమెంటువకును మహారాష్ట్రులకును అతని రాజ్యమే అడ్డుగానుండెను. అందుచేత బొంబాయి కంపెనీ గవర్నమెంటువారు అతనికి సాహాయ్యము చేయ నాలోచించిరి. కాని హైదరు కంపెనీ వారినే యుద్ధములో ముఖ్యులుగఁ జేయ నాలోచించెను. వారిని పోయి సాలసెట్టిని ముట్టడింపుడని యతఁడు ప్రస్తావించెను. వా రంతపనికి సాహసింపఁ జాలకపోయిరి. అంతటితో నా రాయభారము లంత్యమయ్యెను. మదరాసు గవర్నమెంటువారు కూడ హైదరాలీకి సాహాయ్యము చేయుటవశ్యమని తలంచిరి. కాని మహమ్మదాలీయు, అతని దగ్గరనున్న యింగ్లీషు రాయభారి సర్ జాన్ లిన్‌డ్సేయు, హైదరుతో తాము చేసికొనిన సంధికి విరోధముగ మహారాష్ట్రులతో కలియుమని బోధించిరి. కాని పీష్వాయొక్క వ్యాధి యధికమై, మార్చి నెలలో నిఁక చికిత్సనీయము కాదని నిశ్చయింపఁబడి నందున, రాజధానికి దూరమున నున్న మహారాష్ట్ర సేనానాయకు లందఱును, ముఖ్యముగా కేవలము మాధవరావు ప్రాపకముచే నుద్యోగములో నున్నవారు భయపడఁ జొచ్చిరి. బెడ్నూరు సూండాలు లోఁబఱచుకొను నుద్యమము విడువఁబడినది. మహారాష్ట్ర సిలేదారు లింటికిపోవ తత్తఱపడుచున్న వారని, కారణముచెప్పి త్రింబకరావు హైదరు సమాధానముల నాకర్ణించెను. మహారాష్ట్రులు బెంగుళూరునకు సమీపమున నున్నపుడు ఏప్రిలు నెలలో రాయభారము లారంభమయ్యెను. జూను నెలలో సంధిజరిగి, మహారాష్ట్రులు శివాజీ తండ్రి కలిగి యున్న దేశభాగములను మఱియునంతపు పైన ముద్గిరిని, గుఱ్ఱము కొండను వశమునందుంచుకొను నట్లేర్పాటు జరిగెను. హైదరు, ఖర్చులక్రిందను ప్రాంతబాకీల క్రిందను 36 లక్షలురూపాయి లిచ్చునట్లును, ప్రతి సంవత్సరమును 14 లక్షలు కప్పమిచ్చునట్లును ఇఁక ముందునుండి దానిని క్రమముగ పంపునట్లును, ఒప్పుకొనెను. మహారాష్ట్రులకు రావలసిన సొమ్మున కంతకును నిది యాఖరు పరిష్కారముగ నెంచఁబడెను.

మాధవరావుయొక్క వ్యాధి క్షయ. కాని యతని యారోగ్యము తరువాత వర్షకాలమున కొంత స్వస్థపడి జీవితాశ మరలకలిగెను. హిందూస్థానమందతని సేనానాయకుల జయము లింతకంటె ముఖ్యమైనవిగ నుండెను.

1769 సం॥ ములో విశాజీ కృష్ణుని క్రింద నర్మదానదిని దాటిన సైన్యము మాల్వాలో కూడునప్పటికి 50,000 గుఱ్ఱపుదళ మయ్యెను. విశాజీకృష్ణుని క్రిందను, రామచంద్ర గణేశుని క్రిందను, పిండారీలుకాక 20,000 గుఱ్ఱములుండెను. అందు 15,000 పీష్వాయొక్క స్వంతము. మహాదాజీ సింధియాతో 15000 ను తుకాజీ హోల్కారుతో మఱి యంతయు నుండెను. ఇంతియుకాక చాల కాల్బలమును, హిందూస్థాను మాల్వాదేశీయులలో సకలవర్ణములవారితో నేర్పడిన ఫిరంగివేళము నుండెను. అరబ్బులు, అబ్సీనియనులు, సింధియనులు, కొలది భాగముగ నున్నను, వారు కొంచే, సూరతు రేవుస్థానములనుండి తీయఁబడి యుత్తమ భటులుగ నెంచఁబడుచుండెడువారు.

పానిపట్టు యుద్ధమైన పిమ్మట, కొంతకాలము వఱకు అంతఃకలహముల వలనను, నర్మదానదికి దక్షిణమున యుద్ధములవలనను, మహారాష్ట్రులు హిందుస్థానరాజకీయములతో సంబంధము కల్పించుకొన వ్యవధి లేనివారైరి. 1764సం॥ములో మల్హారిరావు హోల్కారు, ఒక సమయమున జాటులు డిల్లీపట్టణమును ముట్టడించినపుడు వారిని కలిసికొనెనుగాని, వెంటనే వారిని విడచి దక్కనున కరుదెంచెను.

బందలఖండు నుండియు మాల్వానుండియు మహారాష్ట్రులు కొందఱు షుజావుద్దౌలా 1765 సం॥ములో ఇంగ్లీషువారితో యుద్ధము చేసినపుడు అతని సేవలో ప్రవేశించిరి. పైన చెప్పఁబడినటుల, హోల్కారు డిల్లీకిపోయిన స్వల్పకాల మున్నదికాక, మహారాష్ట్రులు మఱి యెప్పుడును ఈ మధ్య 8 సంవత్సరముల దనుక చంబలు నదిని దాటి యుద్ధ యాత్ర వెడలి యుండలేదు. అబ్దాలీరాజు, తనగొప్ప జయమైన తరువాత మొగలు సింహాసనమును, న్యాయమైన వారసగు షాఅలమున కప్పగించెను కాని యాచక్రవర్తి, బెంగాలు నవాబులోడను, ఇంగ్లీషువారితోడను, షుజావుద్దౌలాతో కలిసియుద్ధమునకుఁ డొడరి యుండుట వలన, అతని కుమారుఁడగు జీవానుబక్తుడు తండ్రి వచ్చు పర్యంతము రాజచిహ్నములను ధరించి యుండెను. ఔదునవాబగుషుజావుద్దౌలా వజీరుగఁ జేయఁబడెను. రోహిలా నజీబుద్దౌలా అమీరులుమ్రావు పదవియందు మరల-

నెలకొల్పఁబడెను. ఈయేర్పాటులు చేసి అహమదుషా అబ్దాలి ఢిల్లీని విడిచి తన రాజ్యమున కేగెను.

నజీబుద్దౌలా, యువచక్రవర్తితో రాజధానియందుండెను. షుజావుద్దౌలా తన రాజ్యమున కరిగి యటుతరువాత దూఆబునందు రివిన్యూ వసూలు చేయుచున్న మహారాష్ట్ర కార్యకర్తల నెల్ల తఱిమివేసెను. అతఁడుతరువాత వార్నాశి కేగి యచట చక్రవర్తిని కలిసికొని, యిద్దఱును బందెలఖండునకు దాడి వెడలి, ఝాన్సీని పట్టుకొని, యచ్చట నుండి మహారాష్ట్రుల నందఱి నప్పుడు తఱిమి వేసెడివాఁడేమో కాని, యంతలో బెంగాలు నవాబగు మీరుఖాసిము ఇంగ్లీషు వారితో కయ్యము పెట్టుకొని యతనిని శరణుచొచ్చుట వలన నతఁడు వారితో యుద్ధమునకుఁ గడంగి 1764 సం॥ము అక్టోబరు 23వ తారీఖున బక్సారు యుద్ధమున నోడిపోవుట వలన చక్రవర్తియగు షా ఆలము ఇంగ్లీషువారి సంరక్షణ లోనికి పోయెను. ఆగస్టు 1765 సం॥మునజరిగిన సంధివలన షుజావుద్దౌలా మరల ఔదునవాబుగఁ జేయఁబడి చక్రవర్తి యొక్క వజీరుగ సంగీకరింపఁబడెను.

చక్రవర్తిక్రింద, పూర్వముండెడు ఫౌజుదారు లందఱును స్వతంత్రులుగ వ్యవహరించుకొను చుండిరి. భరతవర్షమునెల్ల చాలవఱ కేకచ్ఛత్రాధిపత్యముగ నేలిన మొగలులవంశజుండగు రెండవ షాఆలము, ఇంగ్లీషుకంపెనీవారి వలననుండి అలహాబాదు కోరా జిల్లాలయొక్క రివిన్యూను తనకు మనోవృత్తిగఁ గొని వారి సంరక్షణక్రింద ఘటయాత్ర సలుపుచుండెను. అతఁడు తన పూర్వికుల యొక్క సింహాసనముపై కూర్చుండఁబెట్టుటకు వారు సైన్యమును పంపుదురేమో యని యాశతో నుండెను. ప్రజాక్షేమము కొఱకుగాక తమ వైభోగమునకు సింహాసన మాక్రమించుకొనఁదలఁచినవారందఱను ఈశ్వరుడు కొంతకాలములో నచ్చటి నుండి తొలఁగించుచున్నటుల మనము చరిత్రయందుఁ జూచుచున్నాము.

యువ చక్రవర్తి మొగలు రాజధాని యందు సింహాసనమున విగ్రహము వలె కూర్చుండి యుండెను. నజీబుద్దౌలాయే పరిపాలన నంతను చేయుచుండె

ను. జాటురాజగు శూరజమల్లు తన యాధికారమును వ్యాపింపఁ జేసికొనుచుండె ను. దీని వలననజీబుద్దౌలా యతనితో యుద్ధమునకు దొరకొనవలసి వచ్చెను. శూరజమల్లు అకాత్తుగ యుద్ధారంభమున నే నిహతుఁడగుట వలన నజీబుద్దౌలా సులభముగ జయమునుఁ గాంచెను. కాని యతని కుమారుఁడు, 1764లో హోల్కారు ఢిల్లీకి వచ్చిన కాలములో నతని సహాయము వలన, ఢిల్లీనిముట్టడించె ను. నజీబుద్దౌలా హోల్కారుతోఁగల రహస్యస్నేహమువలన మహారాష్ట్రులను సఖ్యమువిడిచి నూల్వాకు పోవునటులఁ జేసెను.

1769 సం॥ములో పీష్వాసైన్యములు చంబలునదిని దాటునప్పటికిహిందూస్థానము యొక్క స్థితి యీ విధముగనున్నది. మొట్టమొదట యీదాడ్క్రియలు రాజపుత్రులపై జరుపఁబడెను. వారియొద్దనుండి 10 లక్షల రూపాయలు బాకీ

1770 కప్పము క్రింద వసూలు చేయఁబడెను. శూరజమల్లు కొడుకుల వివాదములతో వారు సంబంధముఁ గల్పించుకొని జాటుల దేశముచొచ్చి వారి యొద్దనుండి 65 లక్షలు రూపాయలు వాయిదాల మీఁద పుచ్చుకొనుట కేర్పాటు చేసికొనిరి. వారు భరతపురము దగ్గఱ జాటుల నోడించిన కరువాత ఢిల్లీదగ్గఱ శిబిరము నేర్పఱచుకొనిరి. రోహిలా ప్రముఖుఁడగు నజీబుద్దౌలా పూర్వము తమ జాతి వారిని మహారాష్ట్రులు దయతలఁచక వేటాడిన సంగతిని జ్ఞప్తికి తెచ్చుకొని భయఁపడి విశాజీ కృష్ణునికి సంధివచనములతో రాయభారము లంపెను. మహారాష్ట్రులు తరతరములవఱకు ఉపకారోపకారముల మఱచు వారుకారు కాని వారు విస్తారము క్రూరులును పగతీర్చుకొనువారును కాక పోవుటయే కాక రోషమే ప్రధానముగ నెంచుకొని లాభమును పోఁగొట్టుకొను వారునుకూడ కారు. విశాజీకృష్ణుడు, నజీబుద్దౌలాయొక్క విజ్ఞాపనములను సంతుష్టితో నంగీకరించెను. కాని రామచంద్రగణేశుఁడును, మహాదాజీ సింధియాయును రోహిలాలపై, నాఁడు పానిపట్టు యుద్ధముయొక్క క్రోధమునుతీర్చుకొనవలయు ననిరి. ఈయభిప్రాయ భేదమువలన పీష్వాకు దీని గూర్చి తెలియ పఱుపఁబడెను. పీష్వాయు నజీబుద్దౌలా మహారాష్ట్రుల కెన్నడును మిత్రుఁడు కాజాలఁడని సింధియా యుద్దేశములో నేకీభవించినను, చక్రవర్తిని ఇంగ్లీషువా

ర్తియొక్క సంరక్షణనుండి తప్పించి తమ స్వాధీనములోనికి తీసికొని వచ్చుటకు ప్రయత్నములు తాము చేయుచున్నందున, తద్విషయములో నజీబుద్దౌలాయొక్క సహాయమవసరమై యుండును కాన విశాజీకృష్ణునియొక్క పద్ధతిప్రకారమే తామంగీకరించితిమని తెలియబరచిరి. ఆప్రకారము నజీబుద్దౌలా కుమారుఁడగు జబీటాఖానుడు విశాజీకృష్ణుని కలిసికొనుటకు పంపఁబడెను. దీని తరువాత అక్టోబరు నెలలో నజీబుద్దౌలా చనిపోయెను. వెంటనే జబీటాఖానుడు రాజధానిలో తనతండ్రిపదవిని స్వీకరించెను.

మహారాష్ట్రులుతరువాతరోహిలుఖండుప్రవేశించిరి. రోహిలాప్రముఖులంద
1771 ఱును శౌర్యహీనులవలె వర్తించిరి. ఎటావాలోని బలమైన కోట మహా
రాష్ట్రులచేఁ జిక్కెను. ఫరూకాబాదు తప్ప దూయాబంతయు నడ్డములేక జయింపఁబడెను. జబీటాఖాను దేశముకూడ వారిచే నాశనము చేయఁబడెను. అదేవిధముగ కోరాలోనికి ప్రవేశించి షుజావుద్దౌలానుండి కప్పము తెమ్మనిరి. ఇంగ్లీషువారును భయఁపడి మహారాష్ట్రులదండయాత్ర నాచుకొనుటకు సన్నాహములు చేసికొన నారంభించిరి.

షుజావుద్దౌలా యీకాలమంతయును మహారాష్ట్రులతో రహస్యముగ నుత్తరప్రత్యుత్తరములు సలుపుచుండెను, మహారాష్ట్రులు రోహిలుఖండునుండి ఢిల్లీకితిరిగివచ్చి, లోపలకోటతప్పపట్టణమంతయునువశము చేసికొనిరి. కోటలోపల చక్రవర్తి కుమారుఁడగు జావానుభక్తుఁడున్నందున నతని మర్యాదగ గౌరవించిరి. జబీటాఖానుఁడు వారితోనే యుంచుకొనఁబడెడువాఁడుకాని, తుకాజీ హోల్కారు వానిని నజీబుఘురుకు పాఱిపోనిచ్చెను. చక్రవర్తి ఇదివఱకే మహారాష్ట్రుల శరణుచొచ్చెదనని చెప్పియుండెను. బెంగాలు ప్రెసిడెన్సీవారు, తమ యొద్దనున్నయెడల కలుగు లాభములును, పరులఁజేరిన వచ్చుపాట్లును బోధించిచెప్పిరి. అయినను అతఁడు తన యుద్దేశమును మార్చుకొనక యింగ్లీషు మిత్రులయొద్ద సెలవుపుచ్చుకొని మహారాష్ట్రశిబిరమునకు బయలుదేరివచ్చెను. మహాదాజీసింధియా యతని నెదుర్కొని విశాజీకృష్ణుని శిబిరమునకు తీసికొనివచ్చెను. విశాజీకృష్ణుఁడతని 1771 డిసెంబరులో సింహాసనాసీనుం జేసెను.

మహారాష్ట్రులిప్పుడు నజీబుద్దౌలా కుమారునిపై కసి తీర్చుకొనఁదలంచిరి. జబీటాఖాను యెడల విరోధముకల షాఆలం చక్రవర్తి యనుమతితోడనే యీయుద్యమము నిర్వహింపఁబడినది. కాని రామచంద్రగణేశుఁడు తనపైయధికారితో జగడమాడి పూనాకు బోయినందున, విశాజీకృష్ణునకి ముఖ్య సలహాకారుఁడగు మహాదాజీసింధియాయే దీనిని ముఖ్యముగ ప్రోత్సాహపెట్టెను. షుజావుద్దౌలా మహారాష్ట్రులధికారమున నున్నంతకాలము తానువచ్చి వజీరు పనికి స్వీకరించుట కియ్యకొనక పోయినను, వారితో మాత్రము ఉత్తరప్రత్యుత్తరములు జరుపుచుండెను. షుజావుద్దౌలా యొక్క ముఖ్యయుద్దేశము తండ్రికి వలెనే రోహిలఖండమును లోఁబఱుచుకొనుటయై యుండెను. నజీబుద్దౌలా మరణము కూడ నిందుకు అనుకూలమయ్యెను. కడపటకు రోహిలాల దేశము తనకు స్వాధీనమగు యెడల, మహారాష్ట్రులు వారిని గాసిలఁజేయుట,కతనికేమియు నాక్షేపములేదు. కాని రోహిలుఖండమును స్థిరముగ మహారాష్ట్రులు జయించినయెడల తన వినాశముకూడ దానివెంట ననుగమించునని యతఁడు గ్రహించియుండెను. రోహిలాలును అతని ద్రోహము నెఱిఁగి భయపడుచునే యుండిరి.

అనేక స్థానములు త్వరితముగ వశముచేసికొనఁబడెను. మహాదాజీ సింధియాయు, నజీపుఖానును, రోహిలాలు చూచుచుండగనే వారియొక్క పహారాలకు ప్రక్కనుండిపోవుచు, గంగానది కింకను ఎగువకుపోయినఁగాని దాట నుద్దేశింపనటుల నటించి వారజాగ్రత్తగ నుండునట్లుచేసి వెంటనే వెనుకకు తిరిగి ఒక్కపటుగున నదిని దాటి శత్రువులను నాశనముచేసెను. అందువలన రోహిలాలు సంపూర్ణముగ భయకంపితులైరి. జబీటాఖాను యొక్క రాజ్యమే నిరోధములేక పాదాక్రాంతమయ్యెను. బలమైన రణఘడలును, కోటలుసహితము అశ్వికుఁడు కంటఁబడక పూర్వమే పరిత్యజింపఁబడినవి. రోహిలాప్రముఖులు షుజావుద్దౌలాకు 40 లక్షలు రూపాయలిచ్చి మహారాష్ట్రులకు వ్యతిరేకముగ సఖ్యముచేసికొనిరి. కాని షుజావుద్దౌలా ఆ నలువది లక్షలతోడను తన రక్షణోపాధులను వృద్ధిచేసికొని రోహిలాలను మఱింత ధనహీనులగను బలహీనులగను చేసెను.

విశాజీ కృష్ణుడు జూను నెలలో కొంతకాలము డిల్లీకి వచ్చియుండెను. మహారాష్ట్రులయొక్క ప్రధాన సైన్యము వర్షాకాలములో దూయాబునందే యుండెను. షాఆలం కొద్దిదినములు మహారాష్ట్రులక్రింద నుండగనే తన పరాధీన వృత్తిని చూచుకొని యసంతుష్టిని జెంది తన వజీరగు నజీబుఖానును మహారాష్ట్రుల నెదిరింపవలసినదని చెప్పెను. విశాజీ కృష్ణుడు ఈసంగతిని తెలిసికొని, యెక్కుడు పోయి చక్రవర్తిని బాధింపవలెనని యుద్దేశములేనివాఁడు కావున, ఉత్తరువులకు పూనాకు తెలియపఱచెను. కాని వెనుక చాల నెలలక్రిందటే యెదురు చూడఁబడినంత యిప్పుడెదురుచూడఁబడక పోవుటవలన నకాత్తుగ నొక వృత్తాంతము జరిగెను. మాధవరావు పీష్వా పూనాకు తూర్పున 13 మైళ్లనున్న థీయూరుగ్రామమునొద్ద నవంబరు 18వ తేదీని, తన 28వ సంవత్సరములో స్వర్గస్థుఁడయ్యెను. అతనికి సంతానములేదు. అతనియెడల నత్యంత ప్రేమగల యాతని భార్య రమాబాయి భర్తతో సహగమనము చేసెను.

మాధవరావు మరణమువలన వెంటనే యే విధమైన గంద్రగోళమును చూపట్టలేదు. అతని క్షయరోగమువలెనే యా దుష్టఫలితములును వెంటనే గోచరము కాలేదు. శాఖలన్నియు చాలవఱకు తెగఁగొట్టఁబడిన యా మహారాష్ట్ర మహావృక్షంబునకు మరల జీవంబు నిచ్చుచున్న వేరొక్కటియు నరికి వేయఁబడి నట్లాయెను. పానిపట్టు క్షేత్రంబుకంటె మహారాష్ట్ర సామ్రాజ్యమునకీ సత్ప్రభువుయొక్క యకాల మరణమెక్కువ హానికరమయ్యె. మాధవరావుయొక్క యాహవ పరాక్రమ సామర్థ్యంబు లతిశయ శ్రేష్ఠంబులైన నైనను, యతని సత్పరిపాలనా దీక్షతయే, యతని పూర్వపు పీష్వాల పరిపాలనకంటె, గౌరవ నీయంబును వర్ణనీయంబునై విరాజిల్లుచున్నది. దుర్బలులను దుర్మదాంధులనుండియు, దరిద్రులను ధనాధికులనుండియు, సన్మార్గులను దుర్మార్గులనుండియు, రక్షించుటకతని భుజంబు వజ్రాయుధంబై, సంఘనిర్మాణమందవకాశమున్నంతవఱకు ధర్మంబు నందఱికి సమముగ పంచియిచ్చెను. మాధవరావు రాజ్యాంగనిర్మాణమందే క్రొత్తపద్ధతుల నేర్పఱుపలేదు. ఉన్న నిర్మాణమునే బాగుచేసి యందలి లోపములను చాలవఱకు తొలఁగింపఁబడచేసెను.

ప్ర. 17.] తుకారాంబాపూ ఉద్యోగమునుండి తొలగింపఁబడుట.

అతని పరిపాలనా దార్ఢ్యత ప్రథమమునందు తుకారాంబాపూయొక్క సామర్థ్యముబలమున మఱింతసంగడి పాటునొందెను. అప్పుడు మంత్రియొక్క ప్రఖ్యాతి యతని యౌవనయజమానుని సామర్థ్యముల నతిశయించి వాని ప్రకాశమును రాహుగ్రహముభలె మ్రింగివేయుచు వచ్చెను. ప్రజోపయోగమైన కార్యములన్నియు మంత్రి కారోపింపఁ బడుచువచ్చెను. ఇఁక నతఁడు చేయునది కారముతో నెడబాయుటకె కొందఱు జనులలోనైననుండు ప్రజావిరోధము స్వయానుభవ రాహిత్యము పాలఁబడఁజొచ్చెను. మాధవరావు యొక్క ముఖ్యలోపమగు పరవశంపు కోపదారితనం బాతని సద్గుణములను జాల మఱుగు పఱచెను. లంచములకులోఁబడు మంత్రియొక్క ప్రసిద్ధి, మాధవరావునకు నిజముగ నర్హమైన గౌరవమునడ్డగించెను. ఇందువలన నతనియుద్దేశము లెవ్వియును నెఱవేఱుట కాటంకముకల్గెను. రఘునాథరావు నిర్బంధింపఁబడు వఱకును మాధవరావు నెతని ప్రజ లెఱుఁగక నుండిరి. ఆశ్చర్యమైన పదప మాధవరా వొక్కనాడు తుకారాం బాపూను తన సముఖమునకు పిలిపించి "నా యాజ్ఞ లనేకములు నిర్లక్ష్యముగఁ జూడఁబడుచున్నవి. నా పరిపాలనయందు నేను శూన్యంబైతిని. అందుకు కారణము నాపక్షమున నశ్రద్ధయో, యసామర్థ్యమో, మఱియేదియో నేను స్వయముగా నిర్ధారణచేసికొనుటకు బహుశః సమర్థుఁడను కాను. కావున మీరు యథార్థముగ తత్కారణంబును చెప్పి, యందుకు ప్రతిక్రియనుకూడఁ దెలియఁజేయుటకు ప్రార్థించుచున్నా" నని నుడివెను. తుకారాం తత్క్షణమే "తమరు నన్ను ఉద్యోగమునుండి తొలఁగించినఁ గాని యేమియును జేయఁజాలరు. మోరోబా ఫడ్నవీసును తమ దివానుగఁ జేసికొనినయెడల తమకు తమరే మంత్రులు కాఁగలరు" అని ప్రత్యుత్తరమిచ్చెను.

తన యుద్దేశముల నిట్లు కుశాగ్రబుద్ధితో వీక్షించి నందు కతని మాధవరావు మెచ్చుకొని అతనిని జాగీరునందు స్థిరపఱచి, యతని యుపదేశ ప్రకారము ప్రవర్తించెను. మోరోబాను తన యాజ్ఞ లేక నెద్దియును అతఁడు చేయనిచ్చెడువాఁడు కాఁడు. అతఁడు రహస్య వర్తమాన పద్ధతి నేర్పఱచి అంతరంగ బహిరంగ వృత్తాంతముల నెల్ల నద్భుతముగ శీఘ్రముగను, విశ్వాస పాత్ర

మును సంపాదించుచు నాపదల కెల్ల సర్వసంసిద్ధుఁడై ప్రజల పాలించుచు ననేక చతురకథానాయకుఁడై విక్రమార్కునివలె నాచంద్రతారార్కకీర్తి సాంద్రుఁడై విలసిల్లె.

అతని సివిలు పరిపాలన ప్రభావమును తత్సంబంధమగు వ్యవహారక్రియల నుండి వేఱుపఱచి చెప్పిన యతని సుగుణంబు లంత తేటగ బోధపడవు. నవీన కాలమందు ప్రపంచమంతయు బుద్ధిజ్ఞానముల యభివృద్ధివలన పొందిన రాజ్యపాలనా పద్ధతులతో నుపమించి చూచుకొని యంతచక్కని ప్రభువగు హిందువు కూడ మనకుఁ దృప్తికరముగ పరిపాలనచేసి యుండలేదు కావున హిందువులకు స్వభావముగ పాలనా సామర్థ్యము కొఱతపడినదేయని యెవ్వరును మోహపడి యూహాపడుట న్యాయము కాదు. ఆ కాలమున నప్పుడున్న సంఘము యొక్క స్థితిలో తానొక్కతట్టున పితృవ్యుని కుతంత్రములచే పీడింపఁబడుచు, మఱియొకతట్టు పరరాజన్యసంగ్రామ పరంపరలచేఁ జిక్కువడుచు, తన రాజ్యము నందు దుష్టశిక్షణా శిష్టరక్షణా పరతంత్రుఁడై ప్రజలకు సురాజ్యమును కల్పించుట యందెట్టెట్టి ప్రయత్నములు చేసి యతఁడెంతవఱకు జయశీలుఁడయ్యెనో విచారించి, నవీనకాలము నందు హిందూ వంశముక్రింద మహారాష్ట్రదేశ మెట్టి యుత్కృష్టస్థితి ననుభవించెనో మనము తెలిసికొనవలెను.

ఇప్పటికిని, ఎంత విరూపము నొందినను, యెన్ని మార్పులఁజెందినను మాహీ నదీ తీరముననైనను చంబలు నదీ తీరముననైనను, కృష్ణా తుంగభద్రా తీరములందైనను, మహారాష్ట్రుల పద్ధతు లన్నిటికిని ప్రధాన మూలంబు మహాత్ముం డగు శివాజీయొక్క ప్రతిష్ఠాపన లందే కలదు.

శివాజీ అష్టప్రధాన పద్ధతి నేర్పఱచినట్లు మన మీవఱకు చూచి యుంటిమి. రాజు యొక్క యధికారము క్రమక్రమముగ శూన్యమై యది ముఖ్యప్రధాను నాశ్రయించి నపుడే తక్కినప్రధానులను, ప్రతినిధిని కూడ నది లోఁబఱచుకొనెను. వారి పదవి యొక్క గౌరవచిహ్నములు నిలిపియుంచఁబడెను. వారి వారసత్వపు జాగీరుల బలయుపాధుల నను సరించియు, జీతములు కొద్దివైనను, అభిమానములావై, నాగరిక దేశములలోనెల్ల తమప్రముఖుని తోడివె

కష్టసుఖంబులని కనిపెట్టుకొని యుండు మనోహరంబగు సేవకా యుత్సాహమును గర్వ పూరితులగు నుత్తమ భటనికాయంబుల సంఖ్య కనురూపంబుగను, రాష్ట్రము నందు వారివారి యొక్క ప్రాముఖ్యత లుండెను. ఇట్టి ముఖ్య పురుషులలో, మాధవరావు మరణ కాలము నాటికి, ఇది వఱకుఁ జెప్పఁబడిన కారణములను బట్టియు, వీరపురుషోచిత పరాక్రమంబును బట్టియు, ప్రతినిధియగు భవానీరావు గొప్ప వాఁడై యుండెను.

శివాజీక్రింద రాష్ట్రము యొక్క వివిధ రాజ్యాంగములలోను ప్రతి వేఱువేఱు ప్రతిష్ఠాపనయు పూర్తియైనపుడు ఎనమండ్రు ముఖ్య యుద్యోగస్థులను కలిగియుండెను. అట్టి యుద్యోగస్థు లందఱును, వారి పై యధికారులును, దారూకొ దారులనిపిలువఁబడుచుండిరి. వారు మొట్ట మొదట ప్రవేశపెట్టఁబడినపుడు, వారియుద్యోగములు వంశపారంపర్యములు కావని చెప్పఁబడినప్పటికిని, మన హిందువులలో నీరసకారణం బగు వంశపారంపర్య పద్ధతి ప్రకారము, కొడుకులకును, మనుమలకును వచ్చుచుండెడివి. దేశములో నరాజకము ప్రాప్తమైనపుడీ వారసత్వపు హక్కులు శూన్యమై, బలాధిక్యత ననుసరించి, అప్పటి స్థితిగతులను బట్టి చూడఁబడుచుండెడివి.

మాధవరావు క్రింద జిల్లాయధికారు లందఱును, పినతండ్రియగు సదాశివరావుభావూచే నియమింపఁబడినవారే యుండుచువచ్చిరి. నీరాగోదావరి నదుల మధ్యదేశమున ననేక గొప్ప సంస్కారములు చేసిన సర్ సుభేదారను మల్హర మాండువగుణే యనునతఁడు చనిపోయినపిమ్మట మఱియొక వారసు నాస్థానమున కాతఁ డేర్పాటు చేయలేదు. కొంకను, కర్ణాటకము, ఖాన్‌దేశము, గుజరాతు మొదలైన వానిలోని సర్ సుభేదారులు వెనుకటివారలే యుంచఁబడిరి. మామ్లతుదారు లొక్క సంవత్సరమున కనియే నియమింపఁబడుచు వచ్చెడు వాఁడుక. కాని సామాన్యముగ సత్ప్రవర్తనతో మెలంగిన తీసివేయఁబడుటలేదు. వారు జిల్లాల మీఁద వసూలు చేయున్నది కొంచె మెచ్చుతక్కువ సంవత్సరమునకు ౮ లక్షలు రివిన్యూ యుండెను. ఫసలీ ప్రారంభమున నతనికి ఒప్పగింత పెట్టఁబడు జిల్లా యొక్క రావలసిన రివిన్యూ మినహాయింపులు, ఖర్చులు, మఱి యితరవ్యవహార

త్రు విషయములను తెలియఁజేయు లెఖ్ఖ తయారుచేయఁబడి యుండిని. కయ్యఁబడును. ఖర్చులలో, జీతములు, భత్యములు, దుస్తులవెల మాత్రమే కాక, సర్కారు నౌకరు లందఱకును వారివారి పదవి గౌరవములకు తగినటుల సన్నియమ సేవములకును యవకాశములు కలవు. ఇట్లు గవర్నమెంటుచే నిర్ణయింపఁబడిన లాభములు కాక, మామూలు రివిన్యూకు పైన, మామ్లతదారు స్వంతమునకు నూటికి అయిదునకు మించకుండ పన్నువిధించి వసూలు చేసికొనినయెడల గవర్నమెంటువారు ఊరకుండెడువారు. ఇట్లు రహస్యముగ సేకరించుకొను పన్నువలన రయితున కసంతోషమును, మామ్లతదారునకు సంతోషము నగుచునని యెంచఁబడుచుండెను. అయినను ఈ దురాచారము పెచ్చుపెరుగకుండ నెక్కువ శ్రద్ధతో మాధవరావు పెనకనుగొను చుండెడివాఁడు. రయితుల మొఱలను తత్క్షణమే చెవియొగ్గి వినుచు మాధవరావు, పై యధికారులవలన కలిగిన వారి యిడుమలనుఁ, దీర్చుచుండెడివాడు. ఇఁక గ్రామాధికారుల విషయములో వారిలో నసంతుష్టులై యున్నవారి వలన తక్కినవారియొక్క దుష్కృత్యములు తెలియుచుండెడివి. కాని యొకానొకప్పుడు వారిలో వారికున్న యీర్ష్యలవలన నబద్ధములకూడ కల్పింపఁబడుచుండెను. కాన నట్టి దోషారోపణలను చేయువారి యొద్దనుండి ముందు జామీను పుచ్చుకొనఁబడిగాని విచారణ జరిగింపఁబడెడిది కాదు. లోపము లనేకము కలిగియుండ, దుర్నీతిద్వారము గవర్నమెంటుయొక్క యుదాసీనముచే తెఱువఁబడియుండ, అన్యాయమునకును, ప్రజాపీడనకును, దౌర్జన్యమునకును కొదువ యేమియుండునని యూహింతురేమోకాని యది యటులకాదు. సంభవించిన నష్టకష్టములు జనులపైకంటె రాష్ట్రము మీఁదనే యెక్కువ పడుచుండెను. ఆకాలమున మహారాష్ట్రదేశము తక్కిన దేశము లన్నిటికంటెను సౌఖ్యముగను పురోవృద్ధియుతముగను ఉండెను. అచ్చట అనుభవమువలన సంపాదించిన జ్ఞానమును, కష్టమువలన సంపాదించిన ధనమును, అచ్చటనే జనులు ఒకనాఁటికి కాకపోయిన మఱియొకనాఁడైన వినియోగింపవలసినవారైనందున దేశవృద్ధికి తోడై స్వరాజ్యమువలని ఫలంబుల నెల్ల నానందమున ననుభవించుచుండిరి.

మామ్లితుదారు, ఉద్యోగమైన తోడనే గవర్నమెంటుతో, ఖామాలె కట్టు చేర్పఱచి, ముందు రాఁబోవు రివిన్యూలో కొంత భాగమును అడ్వాన్సు గా నియ్యవలసి యుండెను. అట్లు ఇచ్చిన సొమ్ముమీఁద నూటికి రెండు రూపాయిల చొప్పున తఱుగును, వసూలు కావలసిన సమయము వఱకు నెల 1-కి 1 రూపాయి చొప్పున వడ్డియును మామ్లితదారు పొందెడి వాఁడు. గవర్నమెంటునకు క్షేమముగను, వ్యవహార సౌలభ్యముగను, ఉండెడి ఈ అడ్వాన్సులు తక్కిన ధనసంబంధమగు వ్యవహారము లన్నియ్యును, స్వదేశ బ్యాంకరులగు సాహుకారుల ద్వారా జరుగుచుండెడివి. అనేకులు ధనబలము కలవారు, ఇట్టి వ్యవహారములలో, తమ ధనము నుపయోగించి, కొంచెము మెలకువతో వ్యాపారము సలుపుకొని భాగ్యవంతు లగుచుండెడివారు. ఇట్లు భూమిశిస్తుపై తీసికొనఁబడిన అడ్వాన్సులు రాజ్యపరిపాలనకు కావలసినప్పుడు వెంటనే యుపయోగ పడుటకు, జాతీయ నిధులవలె నుండెడివి. ఇందువలన రాజ్యమునందు బాధ్యతకూడ వర్తకులకును ప్రజలకును ఎక్కువగ కలుగుట కవకాశ మయ్యెను.

ఫసలీ యాఖరు కాగానే మామ్లిత దారు లెక్కలన్నియును జిల్లాఫద్నవీసుచే పేష్వాదగ్గఱ ప్రధాన ఫద్నవీసు దగ్గఱకు కొనిపోఁబడి యచట తనిఖీ చేయఁబడి సరిచూడఁబడు చుండెను.

మాధవరావు మామ్లిత దారులను తమ వకీళ్లను పూనాయందుంచి, సాధ్యమైనంత మట్టుకు తమ జిల్లాలయం దుండుటకుఁ బ్రోత్సాహము చేయుచుండెను. అట్లు వీలు కానపుడు వారి జిల్లా వ్యవహారము లెక్కువ శ్రద్ధతో పరీక్షింపఁ బడుచుండెను.

రక్షక భటులపై పరామరికయు, సివిలు క్రిమినలు ధర్మాధర్మ విచారణయు చాలవఱకు మామ్లితదారుల చేతులలో నుంచఁబడు చుండెను. పోలీసు మేజస్ట్రేటులు, పటేలు, మామ్లితదారు అయియుండిరి. సర్ సుభేదారు పనియున్నచోట నతఁడు కూడ నట్టి న్యాయాధికారియైయుండెను. దేశముఖులును, దేశపాండ్యాలును వారివారి వారసత్వపు జాగీరుల ననుభవమున నుండ నియ్యఁ

బడిరి. కాని వారి పూర్వ యధికారములు రద్దు చేయఁబడెను. వారికి రావలసిన పన్నులను వారు వసూలు చేసికొన నియ్యఁబడి నప్పటికిని, తద్దేశపు ఆచారాదులను నిశ్చయ పఱచుకొన వలసివచ్చినప్పుడును, తగాయిదాలను మధ్యవర్తులుగ నుండి రాజీ చేయునప్పుడును తప్ప మఱియెప్పుడును వారు తలఁచుకొనఁబడెడివారు కారు. పోలీసు, పూనా పట్టణమందు మాత్రము, మంచి కట్టు దిట్టములతో నుండెను. తక్కిన చోటుల నొకవిధముగా నుండెను. అమలుచేయు నధికారము, మహారాష్ట్ర పరిపాలన యొక్క యుత్తమకాలములందు సహితము చాలకొలతపడి యుండుటను బట్టియు, దౌర్జన్యములకును, దోపిడులకును, అలవాటుపడిన అదుపులేని భటులనేకులయొక్క దురాచారముల యొక్క స్థితిని బట్టియు, విచారించి చూడ నీ కాలమున నుండి మన కన్నులకు శాంతపరులగు ప్రజలకు జీవధనంబులందు భద్రత యున్నదా యని యాశ్చర్యము కలుగును. కాని దేశమునం దంతటను యోధులు సరిసమానముగ వెదఁజల్లఁబడి యుండిరి. ప్రతిగ్రామమందును, ఇప్పటి కాలమువలెఁ గాక, యెచ్చటి జను లచట రక్షణ చేసికొనుటకును, కంటక జనుల యాక్రమణలను దండించుటకును సామర్థ్యము కలిగి యుండిరి. ఏ కులము వారి నైన నవమానించువారు, వారి కుటుంబ సంబధంములవలనను, తమ స్వలాభముల వలనను, గ్రామోద్యోగస్థుల యధికారము వలనను, అధర్మమున మితిమీరకుండ, కట్టువడి యుండెడివారు. వర్షకాలమున నందఱుయోధులును తమతమ యుద్ధములను చాలించి యింటికివచ్చు నాచారమువలన పైకట్టుబాటులన్నియు చెడిపోకుండ నుండెడివి. పరదేశ విజయములపై విస్తార మాశించిన రాజునకట్లు భటులిండ్లకు తిరిగి వచ్చుచుండు నాచారము ప్రతికూలమైనను, అంతరంగ శాంతనిరుపద్రవములను నిలుపుట కది యుపయుక్తం బయ్యెడిది. వతనులపైనున్న వారియభిమానమును పీష్వాలు చేసిన యుపయోగమును, వారసత్వపు హక్కులనుఁ గూర్చి గర్వపడిన వారికి ఉద్యోగాభివృద్ధి చేయుటయును. దేశాభిమానమును పురికొల్పుట కుత్తమరాజనీతిపద్ధతి యయ్యెను. అట్టిజాతీయభావములను స్వరాజ్యమునకై వినియోగించినటు లయ్యెను.

మహారాష్ట్ర దేశములో సామాన్య నేరములు, దొంగతనము, దార్లు గొట్టుట, హత్య, ఇండ్లు తగులఁబెట్టుటయై యుండెను. ఇందు మొదటి రెండును నీచజాతులవారగు రామూసీలు భిల్లులు ఎక్కువగఁ జేయుచుండెడివారు. మహారాష్ట్రులు అట్టివానియందు అరుదుగ ప్రవేశించు చుండువారు. అట్టి నేరములకు మరణదండనకాని అంగఖండనకాని శిక్ష వేయఁబడుచుండెడిది. పగతీర్చుకొనుటకు చేయఁబడిన హత్య మరణదండనార్హమైనదిగ నెంచఁబడెడిదికాదు. అందు ముఖ్యముగ నపాయముతోఁ గూడుకొనిన చర్యయైనచో శ్లాఘాపాత్రమైనదిగఁ జూడఁబడుచుండెడిది. అందు ముద్దాయి పేదవాఁడైన 350 రూపాయిల జరిమానాతో నది పరిష్కారము చేయఁబడును. ఏదైన నేరము చేసినవాఁడు ఒకరాజ్యమునుండియింకొక రాజ్యమునకు పాఱిపోవు చుండుటవలన పోలీసు కట్టుదిట్టములకు భంగము కలుగుచుండెడిది.

పెద్ద నేరములకు సర్సుభేదారుఁడు మరణదండన విధింప నధికారము కలిగియుండెడి వాఁడు. అట్టి విషయములలో మామ్లతదారుఁడు పీష్వాయొక్క యాజ్ఞను పుచ్చుకొనవలసి యుండెను. పెద్ద జాగీరుదారులు తమతమదేశభాగములలో మరణదండ నాధికారమును కలిగియుండిరి. బ్రాహ్మణు లెప్పుడును మరణదండన విధింపఁబడఁగూడదు. రాజద్రోహులు విషముచేతఁగాని, సగము పిండి సగము ఉప్పు కలిపిన ఆహారముచేకాని మఱియట్టియేదైన దుష్టాహారము ఇయ్యఁబడి కాని చంపఁబడుచుండెడివారు. స్త్రీలు నేరము చేసినయెడల అంగవిహీనలుగఁ జేయఁబడు చుండెడివారు. కాని యెన్నడును మరణదండన విధింపఁబడెడివారు కారు. విచారణకొక నిర్ణయమైన పద్ధతిలేదు. నేరముయొక్క ఒప్పుదలకు బాధపెట్టుట కలదు. మరణదండనకు ముద్దాయియొక్క ఒప్పుదల యవసరముగాఁ దలంపఁబడుచుండెను. అనుమానపు నేరముల విషయములలో ముఖ్యాధికారి తన యుద్యోగస్థుల యభిప్రాయము ను తీసికొనుచుండుట సామాన్యముగ నుండెడిది. *సతారా దేశభాగములో ప్రతినిధి క్రిందను పీష్వా క్రిందనుకూడ కొందఱు మామ్లతదారులు ముద్దాయిల

రెయొక్క దోష నిర్దోషత్వమును నిరూపించుటకు పంచాయితీలు ఏర్పఱచుచుండెడువారు.

సివిలు వ్యాజ్యములలో సాధారణముగ న్యాయస్థానములు పంచాయితీలే. రామశాస్త్రియొక్క ప్రవర్తనాయుదాహరణము వానిని చాల బాగుపఱచుచుండెను. రామశాస్త్రివంటి నిష్కళంక ప్రవర్తనగలవారు పైపరామరిక చేయు స్థలములందు తప్ప తక్కినచోటుల నాపద్ధతి పంచాయితీల దాయలకు ధనార్జనోపాధిగ నుండుచుండెను. కాని మొత్తముమీఁద పంచాయితీలు ప్రజారంజకముగ నుండెను. అట్టి ప్రతిష్ఠాపనలయందు మాత్రము లోపము లెవ్వియును లేవు కాని యందలివారు న్యాయపరులై యుండవలెను.

మాధవరావు యొక్క మరణకాలము నాటికి మహారాష్ట్ర రాజ్యమున కంతకును లెక్కకు 10 కోట్ల రూపాయల రివిన్యూయుండెను. కాని యీ మొత్తమంతయు వసూలు మాత్రమయి యుండుటలేదు. హోల్కారు, సింధియా, జానోజీ భాంస్లే, దమ్మాజీ గాయక్వాడుయొక్క జాగీరుల నన్నిటిని కలుపుకొని, కప్పములు, జరిమానాలు, కట్నములు, కానుకలు, మొదలైన పై బాపతులతో సహా, సుమారు 70 లక్షల పౌనులు (సవరసులు) ఉండెను. ఇందులో పీష్వా క్రిందకు సరాసరి వచ్చు రివిన్యూ ఆదాయము 28 లక్షల పౌనులుండెను. దీనిలో మాధవరావు స్వంతయెస్టేటు, రాజ్య సంబంధము లేకుండ నుండునది 30, 000 పౌనులై యుండెను. మరణ కాలము నాటికి మాధవరావునకు 24 లక్షల స్వంతయాస్తి యుండెను. దాని నంతయు నతఁడు రాష్ట్రమునకే యిచ్చివేసెను.

బాలాజీ రావుయొక్క విస్తార సంపాదనలను బట్టియు, అతని దుబారాను బట్టియు, అతఁడిచ్చిన యనేక గోకట గ్రామాద్యగ్రహారములను బట్టియు, అతఁడు తక్కిన పీష్వా లందఱికంటె నెక్కువ రివిన్యూను కలిగియుండెనని మహారాష్ట్ర దేశములో వాడుక కలదు. కాని యతని సైన్యములచే నప్పటికప్పుడు జయించిన యనేక దేశభాగములలో రివిన్యూను సరిగా వసూలు

చేయుట కెన్ని కవకాశములేకుండెను. సగటున సమానమైన సంవత్సరములను రెండిటి పరిపాలన లందును తీసికొని చూచినయెడల మాధవరావు కాలములో రివిన్యూ వసూలు ఎక్కువగ నుండెను. ఒక్క 1751-52 సం॥ యొక్క ఫసలీలో బాలాజీరావు, 36 లక్షల పౌనులు రివిన్యూ వసూలుచేసి, మాధవరావు బాగుగ నెక్కువ వసూలుచేసిన ఫసలీకంటె రెండులక్షల పౌను లెక్కువచేసి యుండెను. మాధవరావు సింహాసనాధిష్టుఁడగు నప్పటికి రాష్ట్రము ఋణగ్రస్తమై యుండెను. అతని మరణకాలము నాటికి నిలువబాకీలును, సామగ్రి సంగ్రహంబులును, తక్కిన చరాస్తి విలువ లెక్క చూచికొనినయెడల రాష్ట్రమునకు 60 లక్షల పౌనులస్థితి యుండెను. కాని యిది యంతయు వెంటనే యుపయోగమునకు వచ్చుస్థితియం దుండలేదు. ధనాగారము శూన్యముగానే యుండెను.

భాంస్లే, గాయక్వాడు, సింధియా, హోల్కారు మొదలైన వారియొక్క సైన్యములుకాక పీష్వాయొక్క స్వంతసైన్యము, 50,000 అశ్వదళముగ నుండెను. అతని కాల్బలమును, ఫిరంగిదళమును, విస్తారములేవు. ఇందులో కావలి సైన్యమునకు పోయినవారు పోగా యవసరమునకు కూడి వచ్చు సైన్యము 10,000 ఉండెను. ఇందు మూడువంతు అరబ్బులు, చాలమంది మహమ్మదీయులు నై యుండిరి. పీష్వా యుద్ధయాత్ర వెడలినపుడు కాల్బలము క్రొత్తగ విస్తారముగ కూర్పఁబడుచుండెను. యుద్ధయాత్రనుండి తిరిగివచ్చినతరువాత వారందఱును వదలివేయఁబడుచుండిరి. శివాజీకాలములోవలె, ఘాట్లమీఁద నున్న మావళీలను గాక, ఎక్కువగ కొంకణము నందలి హేత్కారీలను సైన్యములోనికి తీసికొనుట పీష్వాల కాలమునందు మామూలయ్యెను. ఏలయన బహుశః మావళీలు శివాజీ వంశమునం దెక్కువ ప్రీతిని కలిగియుండి రందువలన నని యూహింపవచ్చును. మాధవరావు సైన్యముయొక్క 449 యుద్యోగస్థులలోను, బ్రాహ్మణులు 98 గురు, రాజపుత్రులు 8 గురు, మహారాష్ట్రులు 308 మంది, మహమ్మదీయులు 40 గురు ఉండెడివారు.

గాయక్వాడు ఇయ్యవలసినఉపబల సైన్యము 10,000, భాంస్లే 15,000 ఇంక సింధియా హోల్కారుల సైన్యము అధమపక్షము 30,000, ధారుయొక్క పవారులనుండి 3000, స్వంతసైన్యముతో కలిసినయెడల రణరంగమున పిండారిలుకాక పీష్వా 100,000 ఉత్తమఅశ్వదళంబును మోహరింపఁ జేయఁగలవాఁడని తెలియుచున్నది.



పీష్వా నారాయణరావు.

4/8

ప్రకరణము. 18.

నారాయణరావు, రఘునాధరావు.

1772—1774

మాధవరావుయొక్క మరణమునకు పూర్వము కొంతకాలమునుండియు రఘునాధరావు న్నిర్బంధకాఠిన్యము చాలవఱకు సడలింపఁబడినది. అన్నకుమారునియారోగ్యము క్షీణించిన కొలదిని రఘునాధరావు సంపూర్ణస్వేచ్ఛనొంది తాను పీష్వాయగుటకు హైదరుతోడను, నిజామాలీతోడను కుట్రలు చేయఁ బ్రారంభించెను.

పీష్వా యొక్క యంత్యదినములలో మంత్రుల వలన నాయుత్తర ప్రత్యుత్తరము లడ్డగింపఁబడెను. అందు దోషులైన 19 గురు కొండకోటల నిర్బంధింపఁబడిరి. రఘునాధరావు నిర్బంధము నతి కఠిన మయ్యెడిదేకాని మాధవరావు తనమరణ మాసన్న మాటెఱింగి తన పినతండ్రి స్వేచ్ఛకొఱకు ప్రయత్నించుట అతనికి సహజమే యని మనస్సు సమాధానము చేసికొనెను. అతని యొక్క సహజవివేచనా సామర్థ్యములో, రఘునాధరావు దిట్టముగనిర్బంధింపఁబడుటయో, బలముగ సఖ్యపఱుపఁబడుటయో చేయఁబడినఁగాని తన సోదరుఁడు రాజ్యమేలఁజాలడని, యతఁడు కనిపెట్టెను. కావున నన్ని పక్షములను దీర్ఘముగ పరికించి చూచినయెడల సఖ్యమే యుచితం బనియు, వైమనస్యము ఉదయించినయెడల రాజ్యము తుత్తునియ లగుననియు నతఁడూహించెను. వెంటనే సఖారాంబాపూను మరలఁ బిలిపించి దివానుగఁ జేసెను. సఖారాం తక్క సమంత్రు లందఱికంటె రఘునాధరావుయెడల నెక్కువ పక్షము కలవాఁ

ష్టుం. రఘునాథరావు మంచి యోధుఁడన్న ఖ్యాతినిక గౌరవము కలదు. అందువలన రఘునాథరావితని యెడల విశ్వాసము కలిగియుండెను. నానాఫడ్నవీసు మాధవరావు క్రింద నింకను ప్రసిద్ధికిరాలేదు. అతని సామర్థ్యము లింకను పూర్ణప్రకాశమునకు రాలేదు. అప్పటికి శుకారాం బాపూ రాజ్యములో నున్న వారందఱిలోను సమర్థుఁడుగ పరిగణింపఁబడుచుండెను. మాధవరావు యొక్క ప్రస్తుత యేర్పాటులకు పూర్వమే నానా నకలులో ఫడ్నవీసుగను, అతని పెదతండ్రి కుమారుఁడగు మోరోబా సైనికస్థానమున ఫడ్నవీసుగను ఉండుటకు స్థిరపఱుపఁబడినది.

థీయూరు గ్రామమునకు రఘునాథరావు పిలిపింపఁబడెను. సభ్య మొనఁ గూర్పఁబడెను. మాధవరావు శుకారాంబాపూయొక్క సముఖములో తనతమ్ముని, పినతండ్రి రక్షణ కనేక విధంబుల మనసు కఱుగునట్లు బోధించి, యొప్పగించెను. అంతియుకాక అతఁడు పరలోకమున కేగక పూర్వము తమ్మునితోడను పినతండ్రి తోడను శాంతముగ రాచకార్యములను ముచ్చటించి పరస్పర క్షేమము కోఱుకును, రాజ్యరక్షణ కొఱకును, ఐకమత్య మవసరమని బోధించెను.

సోదరుని పరలోకక్రియలు సాంతమైనతోడనే, నారాయణరావు డిసెంబరు మాసారంభమున సతారాకు పోయి రాజావలన పీష్వా దుస్తులను బడసెను. శకారాం బాపూ, కార్బారీ నామమున, ప్రధాన మంత్రి యయ్యెను. బజాబా పురంధరే దివానుగ నుండెను. నానాఫడ్నవీసు అతని వారసత్వపు ఉద్యోగమునందు ఖాయపఱుపఁబడెను. క్రొత్త పరిపాలనయందు ప్రథమ కార్యము రాయగడ కోటను వశము చేసికొనుట యయ్యెను. ఈకోట హవల్దారు, మాధవరావు మరణమునకు పూర్వమే కొన్ని నెలల క్రిందనుండి, తిరుగబాటున నుండి కోటను సిద్దీ కియ్య నుద్యుక్తుఁడుగ నున్నటులఁ దెలియ వచ్చినది. కోటను వశము చేయవలసినదని యడుగఁబడినపుడా హవల్దారు తాను సతారా రాజు పక్షమున కోటను పట్టుకొని యుంటిననియు నా రాజు చెఱ విడువబడు వఱకు తాను దానిని పట్టుకొని యుందు ననియు బదులు చెప్పెను. నారాయణరావు

శామరాజానొద్దనుండి యుత్తరువు గైకొని 40,000 రూపాయ లిచ్చి మార్చి నెలలో శివాజీ యొక్క చరిత్ర ప్రసిద్ధమైన రాయగడ కోటను వశము చేసికొనెను.

క్రొత్త పీష్వాయు, పినతండ్రి యగు రఘునాథరావును, కొంత కాలము వఱకును పైకి విరోధంబులును లేకనే యుండిరి. కాని తోడికోడండ్రైన నారాయణరావు తల్లియొక్కయు, రఘునాథరావు భార్య యొక్కయు కయ్యాటమ్ములును, బ్రాహ్మణ మంత్రుల ఈర్ష్యలును నింతకంటె నెట్టి శాంత వివేకసంపన్నుల కైన భేదంబులు పుట్టింపఁగల వనుటకు సందేహములేదు. రఘునాథరావు, ఒక్క శుకారాం బాపూ తప్ప, తక్కిన అందఱు మంత్రుల సమ్మతితో, ఏప్రిలు 11-వ తేదీన మరల ఖైదీగ పట్టుకొనఁబడి పూనాయందు పీష్వా భవనమునం దొక్క భాగమునందే నిర్బంధింపఁబడెను. ఈచర్య యొక్కువ తీవ్రంబైనదని శుకారాంబాపూ చెప్పిను దీనిని వలదని సలహా యిచ్చెను.

యావనుఁడగు పీష్వాయొక్క మతంబున నానాఫడ్నవీసు గౌరవమును సంపాదించి యుండెను. బుజాబా పురంధరేయును హరిపంతుఫడ్కెయ్యును పీష్వాయొక్క అంతరంగికులై యుండిరి. రాచకార్యములు శుకారాం బాపూ చేతనే నిర్వహింపఁ బడుచుండెను. కాని పీష్వాయొక్క ప్రియతములు మంత్రి పరిపాలనయెడల నయిష్టులుగ నుండిరి. నారాయణరావు సంగర రంగసత్కీర్తి యం దత్యంతాభిలాష కలవాఁడై రాఁబోవు శీతకాలమునందు కర్ణాటక దండయాత్ర చేయ నిశ్చయించెను. దీనికొఱకు హిందూస్థానమునుండి సైన్యములు మరలివచ్చుట కాజ్ఞ యియ్యఁబడెను. ఇచ్చటిసైన్యములు సిద్ధముగ నుండుటకు సెలవియ్యఁబడెను. కాని మహారాష్ట్ర దేశములోనే వాని నుపయోగింప వలసి వచ్చునట్లు కొన్నివృత్తాంతములు జరిగెను.

మాధవరావు చనిపోవుకాలమునకు, జానోజీ భాంస్లేకూడ ధీయూరులో నుండెను. కాని అంతకు పూర్వమే తనసోదరులందఱిలో సంతానముకలిగిన ముదాజీయొక్క పెద్దకుమారుఁడగు రఘోజీ నీతఁడు దత్తస్వీకారము చేసికొనుటకు సెలవు బడసెను. జానోజీ దత్తత చేసికొనుటయేగాక ముదాజీని వాని

చిన్నతనమందు సంరక్షకునిగాఁకూడ చేసెను. జానోజీ మే నెలలో తుల్జాపుర మందు చనిపోయెను. మూడాజీయు, సాబాజీయు నిద్దఱును సంరక్షక హక్కుకై వాదులాడఁజొచ్చిరి. జానోజీ భార్యయగు దుర్గాబాయి యిద్దఱి హక్కుల నావలకుఁ ద్రోసి తాను రాజ్యపరిపాలన నవలంబించి, సాబాజీని తనకు సేనాపతిగను దివానుగను నియమించుకొనెను. దురదృష్ట వశంబున మూడాజీ యింతవఱకును రఘునాథరావుతో సంబంధము కలిగియుండెను. కావున నతనిహక్కులను నారాయణరావు మన్నింపనందున, సైన్యములను ప్రోగు చేసికొని ఆయుధబలంబునఁ దన హక్కులను స్థిరపఱచుకొనవలసి యుండెను. పీష్వా యెంత చెప్పినను అతఁడు వినలేదు. మూడాజీయొక్క పక్షము నీరస మయ్యెను. ముఖ్యమగు భటులు సేనాసాహేబు సుభేయొక్క జరీపతాకమును తీసికొనిపోయి సాబాజీని కలిసిరి. అయినను అతఁడు ధైర్యముదక్కక, తన సోదరుని కుంబారికడ (అంకోలాదగ్గఱ) తలపడి పరాజితుఁడై పాఱిపోయెను. పీష్వాయొక్క యుద్యోగస్థుఁడు చిట్టచివరకు వారిద్దఱను సమాధానపఱచెను. కాని సోదరు లిద్దఱును కలిసికొనినతోడనే దుర్గాబాయి, సాబాజీ సేనాసాహేబు సుభే యైనందువలన తనయధికారము తగ్గిపోయెనని, మరల నతని వదలిపెట్టి మూడాజీ పక్షము చేరెను. మూడాజీ మరల యుద్ధసన్నద్ధుఁడై ఎల్లిచుపూరుగవర్నరు ఇస్మాల్ ఖానుపఠానుయొక్క సాహాయ్యముం బడసి కలహ మారంభించెను. సాబాజీ, నిజాముసాహాయ్యమును, పీష్వాయొక్క సాయమునుకోరెను. రఘునాథరావు మూడాజీని పట్టువిడువ వలదని రహస్యముగ సందేశములు పంపుచుండెను. నిజాము సాబాజీని కూడెను. కాని యింతలో భరత వర్షంబెల్ల భ్రమాన్పడ నొక ఘోరకృత్యంబు జరిగెను. రాజకార్యములెల్ల నొక్కమారు స్తంభించిపోయెను. హిందూరాజ్య వినాశంబునకు అరిష్టసూచకంబైన దారుణ క్రూరకర్మ వదంతిగ వీనులసోఁకి యథార్థంబని తెలియ వచ్చెను. కుమారపీష్వా యగు నారాయణరావుయొక్క కోమల రక్తధారలు మాతృభూమి యుత్సంగమునం బడి యనేక యుత్పాతంబులకు కారణమయ్యె. అకటా! ప్రజల కెల్ల తేర్పడఁదగిన రాజ్య మక్రమంబుగ నొక్కమానవవ్యక్తిచేఁ గ్రాంతింపఁబడిన

యుపద్రవంబులేల వాటిల్లకుండు? భరతవర్ష చరిత్రయందు రక్తాక్షరంబులతో వ్రాయందగిన నారాయణరావు హత్యయొక్క కథాక్రమం బెట్టిదనిన.

ఆగస్టు 30-వ తేదీన నారాయణరావు పూనాకు దక్షిణపు దిక్కున కొండమీఁద నున్న పార్వతీ దేవాలయంబున కరిగి యటుతరువాత రఘోజీ
1773 ఆంగ్రియాకు దర్శనమిచ్చి, శనివార . భవనమునకు తిరిగి వచ్చెను. భోజనానంతరము అతఁడు మధ్యాహ్నవిశ్రాంతి కొఱకు అంతఃపురంబున శయనాగారంబునకుఁ బోయెను. ఆదుర్దినంబుయొక్క యుదయంబున పీష్వాయొక్క కాల్బలమున విపరీతమగు కలవరము గానవచ్చెను. రఘోజీ ఆంగ్రియానుచూచి తిరిగివచ్చునప్పు డానంగతి పీష్వాకు దృష్టిగోచరంబయ్యెను. అతఁడును భోజనమున కరుగుటకు పూర్వము హరిపంతు ఫడ్కేను పిలిపించి యతని కా వృత్తాంతమును తెలియఁబఱచి యేయల్లరియు జరుగకుండ జాగరూకత తీసికొన వలయునని యాజ్ఞయిచ్చెను. కాని కాలకర్మంబులు హరిపంతు ఫడ్కెయొక్క బుద్ధి మందగింపఁ జేసెను. అందువలన నతఁడు దానిని గూర్చి శ్రద్ధ వహింపలేదు. నారాయణరావు తన యంతిపుర మందిరంబున నిద్రాపరుఁడై యుండగా, రఘునాధరావు ఖిద్మద్గారుఁడును, పూర్వము నారాయణరావుచే బహిరంగముగ దెబ్బలశిక్ష వేయఁబడినందున మత్సరపూరితుండును, ఈద్రోహకృత్యమున ప్రధాననిర్వహణ భారము వహించినట్లు ముందు మనము చూడఁబోవునట్టి వాఁడును అయిన తుల్యాజీపవారు, సుభేదారు సుమేరుసింగునకును, మహమ్మదు యూసుఫ్కును లోనఁ బ్రవేశించుటకు సన్నలుచేసెను. వీరును, రెండువేల గార్దిలతో,(శిక్షితకాల్బలము) నారాయణరావు తన పైప్రేలుచున్న గొప్పయాపదను కొంచెమైన నెఱుఁగక మధ్యాహ్న విశ్రాంతిని హాయిగ ననుభవించుచున్న భవనంబులోనికి ప్రవేశించిరి. వారు మధ్యాహ్నము రెండుగంటల వేళ భవనంబులో కలకలంబుతో ప్రవేశించిరి. భవనమును కాపాడుచున్న ఖడకుసింగు స్వామిద్రోహియై యా విద్రోహులఁ గలిసెను. వారి ప్రవేశ మట్లు నిర్బాటంకమ్ముగాగ వారు నారాయణరావు శయ్యామందిరంబు నొక్క విసురునవచ్చి చేరుకొనిరి. ఆ ప్రక్క బుధసింగు జమాదారుచే



పీష్వా నారాయణరావు హత్య.

యూసూపును తమ క్రూరకరవాలంబుల నా యభాగ్యుఁడగు శాలునిపైఁ బఱపిరి. ఆసమయంబున నారాయణరావు విశ్వాస పాత్రుండగు పరిచారకుఁడు, చఘాలిలేకాను యీ భయానకరంగంబు ప్రవేశించినవాఁడై, నిరాయుధుఁడైనను ధైర్యముగ యజమానున కడ్డముపడి, తన శరీరముచే నతనిఁగప్పి యీ క్రూర ప్రహారణంబులను తాను తిని రక్షింప యత్నించెను. విరామంబులేక వ్రాలుచున్న యీ వ్రేట్లు లెల్ల తనదేహమును తుండెతుండెములుగా జీరుచున్నను, ఆ రాజభక్తుఁడు వెనుదీయక తనమేన నుసురు లున్నంతవఱకు యజమానుని విడువలేదు. అట్లు అరక్షకుండై, క్రూర శత్రువుల వ్రేటులకు లోఁబడి నిమిషమాత్రములో నాకుమార పీష్వా దారుణంబగు దుర్మరణము నొందెను. అట్లు పట్టపగలు, మధ్యాహ్నంబున, బహిరంగముగ, తన స్వంతభవనంబులో మందభాగ్యుఁడగు నారాయణరావు హత్య గావింపఁబడి యెల్లకాలమునకు నాశ్చర్యంబగు కథకు నాయకుండయ్యె.

ఇట్లు లోపల గంద్రగోళము జరుగుచుండ, భవనముయొక్క వెలుపలి ప్రాకారము విద్రోహుల యాధీనమయ్యెను. పట్టణజను లీకోలాహలము నెల్ల విని యచ్చట కనేకులు గుంపులు కూడుచువచ్చిరి. ఆయుధపాణులై కొందఱు వీధులఁ దిరుగాడఁ జొచ్చిరి. దుకాణములు కట్టివేయఁబడెను. పట్టణవాసులేమి జరిగినదని యడుగుచు భయవిస్మయంబులు మనంబులఁ బెనఁగొన నటు నిటు పఱువు లెత్తుచుండిరి. శుకారాంబాపూ కొత్వాలు చావడికి పరుగెత్తుకొని పోయెను. అచ్చట, రఘునాధరావు బ్రతికి యుండెననియే గాక జనుల కందఱకును అల్లరి అంతయు సద్దుమణిగెనని యభయంబు దెలిపి కొందఱిని లోపలికి రమ్మని పిలిచెనని కూడ నతనికి తెలియవచ్చెను. దానిమీద శుకారాం హరిపంతుఫడ్కేను తన పేరుతో నుత్తరము వ్రాయవలసినదని యాజ్ఞాపించెను. రఘునాధరావు స్వదస్తూరీతో, తన యన్నకుమారుఁడు గార్దులవలన చంపఁబడెనని ప్రత్యుత్తర మిచ్చెను. హరిపంతుఫడ్కే, యంత తాను రఘునాధరావు పైఁబడిన యనుమానములు స్థిరపడెనని నొక్కి వక్కాణించి, తనకేమి యాపద రాఁగలదో యని భయపడి తక్షణమే బారామతికి పాఱిపోయెను. శుకా

ర్హాంబాపూ జనుల మనంబుల శాంతపఱచి యందఱిని గృహములకుఁబోయి భద్రముగ నుండవచ్చునని బోధించెను. ఆ రాత్రి బుజాబా పురంధరేయును, మాలోజీ ఘోరేపురేయును రఘునాథరావు దర్శనము చేసిరి. త్రింబకరావు మామా దురదృష్టవంతుఁడగు నా పీష్వా కళేబరమును గొనిపోయి దహనాది సంస్కారముల నొనర్చెను.

భవనములోనికి అనేకమంది పరామర్శ నొనర్చుటకు వచ్చిరి. ఇంగ్లీషు రాయభారి మోయిస్టైనును, అనేక యితర వకీల్లును వచ్చి రఘునాథరావు దర్శనము చేసిరి. రఘునాథరావు తానువిద్రోహులవలన చౌకీజీతములకు జామీనుగ నింకను నిర్బంధమునం దుంచబడినటుల నటించెను. రఘునాథరావీదుష్కృత్య కర్తగ కారకుండని యందఱు ననుమానించు చుండిరి. కాని నిశ్చయమైన రుజు వింతవఱకు లేదు. అతనికి అన్నకుమారుని యెడల ప్రేమకలదని ప్రసిద్ధియుండెను. అట్టి యాపత్సమయమున, అరాజక సమయమున, లౌక్య బుద్ధిపరులై తమలో తమకెట్టి వైషమ్యము లున్నను, న్యాయమైనను అన్యాయమైనను రాజ్య రక్షణార్థమై మంత్రులందఱును కలిసి రఘోబాను పీష్వాను చేయుటకు సమకట్టుట యెంతయు బాగుగఁదగియున్నది. అనుమానమునకు కొంచెమైన నవకాశ మున్నంతవఱకు రఘునాథరావునే పీష్వాను చేయుట వివేకమని వారంద ఱభిప్రాయపడిరి. ఇందుకు రామశాస్త్రి నడుమ గానతఁడుకూడ సమ్మతించెనుగాని యా నేరముయొక్క విచారణ పూర్తిగఁ జేసెదనని చెప్పెను. ఆటుతరువాత నాలువారములకు రామశాస్త్రి రఘునాథరావుపై నేరస్థాపన చేయుటకు తగిన యాధారములను కనుఁగొనినందున, అతని దగ్గఱకుఁ బోయి యా కృత్యమును జేయుటకు సుమేరసింగునకును, మహమ్మదు యూసుఫునకును ఆజ్ఞ నిచ్చినటుల నతనిపై దోషారోపణ చేసి చెప్పెను. రఘునాథరావు, నారాయణరావును పట్టుకొనవలసినదని యాజ్ఞ నిచ్చితినిగాని, చంపుమని యనుజ్ఞ నియ్యలేదని రామశాస్త్రితో నొప్పుకొనెను. ఈ యొప్పుదల కొంతవఱకు నిజమైనటుల కనుపడుచున్నది. ఏలయన; రామశాస్త్రిచే తరువాత సంపాదింపఁబడిన అసలు ఆజ్ఞాపత్రమునందు ధరావే (పట్టుకొనుట) యన్నమాట మారావే (చంపిత

యుట) యని దిద్దఁబడినది. ఈ మార్పు దురాత్మురాలగు ఆనందబాయిచే చేయఁబడినట్లుల నెల్లరిచే నమ్మఁబడుచున్నది. ఆపద్వ్యాప్తినున్న చిన్నకుమారుని, తన ప్రాణాపాయమైన నోడక, రక్షింపక నూరకున్న రఘునాథరావుయొక్క ప్రవర్తన యనుమానమునకుఁ జాల యవకాశమున్నను మహారాష్ట్ర దేశమున సామాన్య యభిప్రాయ మతఁడు నారాయణరావును చంపుట కుద్దేశించలేదని యై యున్నది. అతఁడు నిర్బంధమువలన క్రోధానల దందహ్యమానుండై, భార్యయొక్క దుర్మంత్రంబులకు చెవియొగ్గి యట్టి పాతకమున కొడికట్టెను. తుల్యాజీ పవారునకు తనకు పీష్వాయెడల, బహిరంగముగ కొరడాదెబ్బలఁ గొట్టించి నందుకు, కోపముండుటయే గాక అతఁడు మత్సరపూరితురా లగు ఆనందబాయిచే మఱింత ప్రోత్సాహము చేయఁబడెను.

రఘునాథరావు తన యన్నకుమారుని దుర్మరణమందు తానెంతవఱకు దోషియో యొప్పుకొనిన తరువాత తనకేమి ప్రాయశ్చిత్తమని రామశాస్త్రినడిగెను. ఆ పుణ్యశ్లోకుండును, ఉత్తమగుణుండును, ధీరుండు నైన రామశాస్త్రి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "మీ ప్రాణ మర్పింపవలెను. ఇఁక మీజీవితము పశ్చాత్తాపంబునఁ గుదురుపడదు. మీరుగాని మీరాజ్యము గాని ఇఁక నభివృద్ధి పొందఁజాలదు. నామట్టుకు నేను ఉద్యోగము నంగీకరింపను. మీరు పరిపాలన వహించి నంతకాలము నేను పూనాలోనైన కాలుబెట్టను" ఆమహామహుఁడు తన ప్రతిజ్ఞను చెల్లించుకొనెను. అతఁడు వాయీదగ్గఱనున్న నొక పల్లెకుపోయి నివసించియుండెను.

ఈ మధ్యకాలములో బాకీజీతము లన్నియు తీర్పఁబడెను. రఘునాథరావు నిర్బంధవిముక్తుం డయ్యెను. అతని దత్తపుత్రుఁడు, అమృతరావు బూజాబాపురంధరేతోఁగూడ పీష్వాయొక్క పట్టాభిషేకదుస్తులు తెచ్చుటకు సతారాకు పంపఁబడెను. అవి వచ్చినతరువాత రఘునాథరావు పీష్వాగా ప్రకటింపఁబడెను. సుకారాంబాపూ కార్భారీగా స్థిరపఱుపఁబడెను. చింతావిఠలును, రామచంద్రబాబాశన్వీ శేమాయ్కడైన సదాశివ రామచంద్రుఁడును, క్రొత్తపీష్వాయొక్క అంతరంగికులు.

నారాయణరావునుగూర్చి విశేషముచెప్ప నవసరములేదు. అతఁడు పదు నైనిమిదవ సంవత్సరమున చంపఁబడెను. అతని లోపములు బాలునివిగాని యంత కంటె నధికమైనవిగావు. కాని యతని ప్రతిపక్షులు వానిని ఘనముగ పెంచి ఘోరపాపములుగ వర్ణించిరి. అతఁడు బంధువులయెడల ననురాగవంతుఁడును, పరిచారకుల యెడ దయావంతుఁడును, అయి యుండెను. అతని శత్రువులు తప్ప అందఱు నతనియెడల ప్రేమఁగలవారై యుండిరి. అతనిఁగూర్చి ప్రసిద్ధి కెక్కిన పూనాకథ యొకటియుండెను. ఈకథ తఱచుగ మాధవరావును గూర్చి చెప్పఁబడినను, మాధవరావుమాత్రము దానిని తనతమ్ముఁడు మంచిసాహ సవంతుఁడగు యోధుఁడగు నని చెప్పుచుండెడువాఁడు. పూనాపట్టణ బాహ్యం తరసీమ గుల్‌టేక్రీయను నొక చిన్ననగముయొక్క ప్రాంతమున నొక నాఁడు మదగజయూథముల పోరాటమునకుఁ బ్రేక్షకులై యుండఁగ నందొక్కజంతువు క్రోధావేశయై యన్నదమ్ములిద్దఱునుకూర్చుండి యున్న తావునకువిసురుగ పఱు వెత్తివచ్చెను. పరిచారకు లనేకులును, ముఖ్యులును, జనులునుభయంబుగదుర, పీష్వా దైఁచిలకింపక నలుదిక్కులపాఱఁ దొడంగిరి. నారాయణరావు తక్కినవారితో పఱువెత్తి తనస్థానంబు నుండి దుమికెను. అంత మాధవరావు తమ్ముని చేయిఁబ ట్టుకొని 'సోదరా! అక్బారులు (పత్రికలు) నిన్నుఁగూర్చి యేమనిచెప్పును?, అనినుడివెను. అతఁడు తత్క్షణమే శాంతముతోఁ గూర్చుండెను. అట్లు పైఁ బడవచ్చిన యుపాయము, అప్పాజీరావు ఘాటంకారు అను సిలేదారుని యద్భు తసాహసముచేఁ దొలఁగింపఁబడెను. అతఁడు తన చురియంగొని పీష్వాకడ్డంబుగ నిల్చి యేనుఁగును తొండముపైఁ బొడిచి మరలించెను.

పీష్వాయొక్క సైన్యము హిందూస్థానమునుండి విశాజీకృష్ణుని యాధిప త్యముక్రింద రఘునాథరావు సింహాసనాసీనుండైన పిదప తిరిగివచ్చెను. ఈ మ ధ్యకాలములో విశాజీకృష్ణుఁడు, తమ యధికారాక్రమణ నెదిరించుటకు చక్ర వర్తిని సన్నాహములు చేసికొనుటకు వదలిపెట్టి యుండెను. మహాదాజీ సింధియా, జబీటాఖానునియెడల విరోధమును ప్రకాశముగఁ గలిగి యున్నందు నను, మహారాష్ట్రసఖ్యమున కయిష్టుఁడుగ నున్నందునను, అతఁడు జాటురాజ

పుత్ర రాష్ట్రములనుండి కప్పములను వసూలుచేయుటకు పశ్చిమదిక్కునకు బంపిన నియమింపఁబడెను. విశాజీకృష్ణుఁడును తుకాజీహోల్కారును 30,000గుఱ్ఱపు దళముతో రోహిలారాజ్యమునం దుండిరి. వారు రాజధానియం దుండక పోవుటవలన చక్రవర్తి వారి నెదిరించుటకు, సన్నాహములు చేసికొనుటకు మంచి యవకాశము కలిగెను. మహారాష్ట్రు లెదురు చూచినదానికంటె అతని ప్రయత్నము లధికమయ్యెను. కావున విశాజీ యతని నయభయముల వలన సంధికి లోఁబడునట్లు చేయ నన్ని విధములఁ బ్రయత్నించెను. ఏజీరగు నజీపు ఖానుని దృఢబోధలు లేనియెడల విశాజీయొక్క ప్రయత్నములు సఫలము లయ్యెడివే. ఢిల్లీ పరిసరప్రదేశమందు 1772 డిసెంబరు 19-వ తేదీన యుద్ధము జరిగెను. అందు మహారాష్ట్రులు ప్రబల సంకులసమరంబు పిమ్మట జయంబు నొందిరి. మొగలు అశ్వము, నజీపుఖానునిచే ధృత్యుత్సాహముతో నడుపంబడెను గాని శౌర్యంబుఁదక్క వర్తింపదయ్యెను. చక్రవర్తి కాల్బలము మేడాకను పరాసువానిక్రింద నడుపఁబడి శౌర్యంబుఁ గనుపఱచెను గాని నిరర్థక మయ్యెను. ఈ సమయమున మహారాష్ట్రులు కోరిన షరతులు చాల కఠినముగ నున్నవి. వారు పీష్వాను చక్రవర్తి యొక్క బక్షీగ (సేనాపతి) పేరు పెట్ట వలసిన దనియు, జబీటాఖానుని పీష్వాయొక్క డిప్యూటీగ నియమింప వలసిన దనియు, క్రొత్తఁగ జాటులవలన పట్టుకొనఁబడిన శరంపూరునియ్యవలసినదనియు, కోరా, కరా, యను రెండు జిల్లాల నిచ్చివేయవలయు ననియు, చక్రవర్తిని బలవంత పెట్టిరి. యమునా నదికి తూర్పున నున్న ఈ చివరి రెండు జిల్లాలును బెంగాలు గవర్నమెంటువారు రెండవ షాఅలము చక్రవర్తి తమసంరక్షణ క్రింద నున్నంతకాలమును, షుజాఉద్దౌలా నతని కిచ్చునట్లు చేసిరట. కాని చక్రవర్తి తనంతట తాను వారియొక్క స్నేహలాభమును వదలుకొని మహారాష్ట్రులశరణు చేరెను. గాన నాజిల్లాలను తాము తమ యిష్టము వచ్చినటులఁ జేయుట కాలోచించిరి. కావున వాని నాక్రమించుటకు మహారాష్ట్రులు వచ్చిన యెడల తటి మివేయుటకు నిశ్చయించుకొనిరి. మహారాష్ట్రులు ఔద్ధునోనికి దండయాత్రచే

యొంటె కుద్దేశించిరని తలంచఁబడి షుజావుద్దౌలాకు కూడ సాహాయ్యము జేయుటకు ఇంగ్లీషువారు ఆలోచించుకొనిరట. కాని యప్పుడా చర్యలు జరిగినట్టులుండెడిదో కాని మహారాష్ట్రులు ఈవఱకుఁ జెప్పఁబడినటుల నారాయణరావుచే పిలువఁబడి మే నెలలో హిందూస్థానమును వదలి దక్కనుకు వచ్చిరి. వర్షాకాలము చాల యంత మగు వఱకు విశ్వాజీకృష్ణుఁడు పూనాకు చేరుకొనలేదు.

హైదరాలీ మహారాష్ట్రుల దండయాత్రనుఁ గూర్చి యెంత భయఁపడుచుండెనో, వారి రాష్ట్రములో జరిగిన విప్లవము వలన కలిగిన కలవరము తనకనుకూలముగఁ జేసికొనుట కంత సిద్ధముగ నుండెను. నడచిన యుద్ధము నందు మహారాష్ట్రులు జయించిన దేశమును తిరిగి వశము చేసికొనుట, కతఁడు కుమారుఁడుగ టిప్పూను బలమైన సైన్యముతోఁ బంపెను. నిజామాలీయుం దన కుటుంబకలహము లప్పుడు మహారాష్ట్రు లెట్లు విజృంభించిరో, తానును వారి వైషమ్యముల వలన లాభము పొందవలెనని సిద్ధమగుచుండెను.

మూదాజీభాంస్లే, తనకుమారునితోడను, జానోజీయొక్క భార్యతోడను రఘునాధరావుతో కలిసికొనెను. ఆసమయమున రఘోజీ భాంస్లే, జానోజీయొక్క దత్తపుత్రుఁడుగ, సేనాసాహెబు సుభేగాఁ జేయఁబడెను. సాబాజీ యింకను బలవంతుఁడగు ప్రతిపక్షిగ నుండుటవలన, మూదాజీ పీష్వాయొద్దనే యుండెను. రఘోజీయుఁ దుర్గాబాయియు బీరారునకుపోయిరి. రఘునాధరావు మొట్టమొదట నిజామాలీ నెదిరించి యతని యధికారము నణచివేయవలయునని నిశ్చయము చేసికొనెను. అటుకాక నతఁడు, కృష్ణానదిని దాటినచో నిజాము సాబాజీ భాంస్లేల దాడులకు తనదేశమును విడిచిన వాఁడగును.

ఈ యాపత్సమయమున, రఘునాధరావు తనసైన్యములతో ప్రయాణమగుటకు సిద్ధముగ నున్నపుడే, రామశాస్త్రి పైఁజెప్పిన విధమున నతని కలిసికొని సంభాషించెను. తక్కిన మంత్రులంత యథార్థవాదులు కారు. కాని రఘునాధరావు తనరాజ్యమును నిలుపఁగల సమర్థులగు వారియెల్లరియెడలను అనుమానముగ నుండెను. అందువలన వారును అతని సభనుండి తొలఁగిపోయిరి. సదా

శివ రామచంద్రుడు, చింతామణిరలు, ఆబాజీ మహాదేవు, తుకారాంహరి మొదలైనవారు. వారిస్థానముల కెన్నుకొనఁబడిరిగాని అందుకు సమర్థులుగారు. నవంబరు మాసములో పీష్వా సైన్యము, నిజామాలీసైన్యము సిద్ధముకాకముందే, దానిపైఁ బడెను. నిజామాలీ యందులకు తాళలేక బీదరుకోటలోన శరణుజొచ్చెను. మూఁడువారములు ప్రతిదినమును స్వల్పకలహములు జరుగుచువచ్చెను. అందు మహారాష్ట్రులు సామాన్యముగ జయమునొందుచు వచ్చిరి. మొగలులు దిట్టముగ తఱుమఁ గొట్టఁబడినవారై తమ కోటగోడలపై నున్న ఫిరంగుల రక్షణక్రింద [illegible]కఁ బోవలసినవా రగుచుండిరి. మహారాష్ట్రులును తమ ఫిరంగుల చే నప్పు డప్పుడు గోళవర్షంబు కురిపించుచున్నను, బీదరుకు దగ్గఱలోనున్న నూతులన్నియు కోటగోడల మీఁదనుండి ఫిరంగిప్రేటు దూరమున నున్నందు వలనఁ బ్రతిదినమును ఉదకమునకు మంజిరానది యొడ్డుననున్న తమ శిబిరమునకు పోవలసినవా రగుచుండిరి.

ఇట్లు స్వల్పకలహములు జరిగి పర్యవసానము తేలకుండ కాలము గడచినందున, రఘోబా యోడిపోయె ననియు, గాయపడెననియు, చావుకు సిద్ధముగాన్యె ననియు ననేకవదంతులు పుట్టుచువచ్చెను. అయినను మొగలు సైన్యములు కొంతవడికి దైన్యంబు నొందెను. నిజామాలీ మహారాష్ట్రులతో బహిరంగకయ్యంబు సలిపిగాని సామగ్రులను తెచ్చుకొనఁ జాలకపోయెను. కావున నతఁడు
డిసెంబరు 9 సంధికై ప్రార్థించెను. 20లక్షల రూపాయిలువచ్చు దేశము నతఁ డిచ్చెద ననెను. మహారాష్ట్రనాయకుల కీదేశమును జాగ్రత్తగ పంచిపెట్టినయెడల రఘునాధరావు రాష్ట్రమునందు తన యాధిక్యతను నిలుపుకొనెడివాఁడు. కాని యంతయు నేర్పాటైనతరువాత, నిజామాలీ బహు నిష్కపటస్నేహభావమును నటించుచు, రఘునాథరావు దర్శనముచేసి, తమ పూర్వసఖ్యమునుగూర్చి జ్ఞాపకము చేసి, రఘునాధ రావప్పు డున్నస్థితి నెఱింగినవాఁడు కావున, ఇఁక ముందు అన్నిసమయములందును తాను స్థిరసఖుండై యుండెదనని చెప్పి, అతని పరిపాలనముఁ గూర్చి స్తోత్రపాఠంబుల చదివి యుబ్బించి, మహాపరాక్రమవంతుఁడగు రఘునాధరావునకు లోఁబడినందుకు తాను గర్వము

కూడ పడుచున్నట్టుల నటించి, అతని ఔదార్యమునందు తనకు పూర్ణపూర్వ విశ్వాసము కలదని చెప్పుచు తన మొహరు లాయన చేతులలోఁ బెట్టి యాయన కర్తవ్యమని తోఁచినంత దేశమును దీసికొనుమని నుడివెను.

రఘునాథరావు, ఆపాత్రంబగు నౌదార్యంబును పూని, నిజామాలీయొక్క మాయలోఁబడి, తన మహారాష్ట్ర ప్రతిపక్షులెల్ల సంతసమొంద, తన కియ్యఁబడిన దేశమంతయు తిరిగి యిచ్చివేసెను. ఇంతటి తేటతెల్లముగ మాయా ప్రసిద్ధుండగు నిజామాలీచే మోసము చేయఁబడు టెంతయు హాస్యాస్పదంబని వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. కాని యతఁడు దుష్టాత్ముండైన దానికంటె దుర్బలాత్ముండని తెలియఁజేయు ప్రమాణములలో నిది యొకటి. రాజ్యము పోఁగొట్టుకొనుటకు ఆపాత్రంబగు నౌదార్య మొక కారణమని మనము బలిచక్రవర్తికాలమునుండియు పురాణచరిత్రలలోఁ జూచుచున్నాము.

రఘునాథరావు, మొగలులతో సంధియైన తరువాత, కల్బర్గాయందు కొంతకాలము శిబిరముండి, ఔరంగబాదు సమీపములో కయ్యమునకై కాలుద్రవ్వుచున్న సాబాజీ భాంస్లేయొక్క నడకలను కని పెట్టుటకు త్రింబకు రావు మామాను కొంత సైన్యముతోఁ బంపెను. రఘునాథరావు యొక్క ప్రతిపక్షులీ యేర్పాటునే కోరియుండిరి. అంతియకాక ఇదివఱకు మహారాష్ట్ర లజిల్లాల నాక్రమించిన హైదరు నచ్చటినుండి తఱిమివేయుటకును, తంజావూరును వశముచేసికొనిన మహమ్మదాలీని, అతని మిత్రులగు నింగ్లీషువారిని శిక్షించుటకును కర్ణాటక దండయాత్రను చేయ నుద్యోగించుచు నతని మనస్సు పరధ్యానముగ నుండెనని అతని ప్రతిపక్షులందఱును లోలోన రహస్యముగ సంతోషించుచుండిరి. ఈయుద్దేశముతో నతఁడు కృష్ణానదివైపునకుఁ బ్రయాణమై పోయెను. ఈమధ్య కాలములో నతనికి వ్యతిరేకముగ మంత్రిమండలము కూడు చుండెను. అందువలన నతని ప్రయాణము కొంత యైనతరువాత ఆగిపోయెను.

శకారాంబాపూయును, నానాపడ్నవీసుయు వివిధవ్యాజముల మీఁద రఘునాథరావు సైన్యమునుండి వెడలిపోయి పూనాకు వచ్చిరి. వారి వెంట గణపతిరావు రాస్తియాయు, పిమ్మట భాలాజీనాయకం బారామతికారును, ఇంక

వనేకప్రముఖులును పూనా కరుదెంచిరి. చివరకు నానా ఫడ్నవీసును, బుజాబా పురంధరేయును వచ్చి చేరుకొనిరి.

రఘోబాకును, అతని దగ్గఱనున్న వారికిని తప్ప, యెల్లరకును ఏదో యేర్పాటు ఆందోళనయం దున్నదని తెలియును. ఈ సమయమున నేర్పడిన పూనా మంత్రిమండలి యందలి ముఖ్యులెవ్వరనిన:—సఖారాంబాపూ, త్రింబకురావు మామా, నానాయు, మోరోబాయు (ఇద్దరు ఫడ్నవీసులు) బుజాబా పురంధరే, ఆనందరావు జీవాజీ, హరిపంతు ఫడ్కే. వీరందఱును బ్రాహ్మణులు. ప్రస్తుత పీష్వావశమునందే నున్నతికి దీసికొని రాఁబడిరి. ఇందు, ఆనందరావు జీవాజీ పీష్వాయొక్క స్వంతపనులను చూచుచుండెడివాఁడు, కావున ఖాస్గీవాలాయని సామాన్యముగ పిలువంబడు చుండెడివాఁడు. హరిపంతు ఫడ్కే పూనాలో త్రింబకురావు దీక్షితు అనునొక సాహుకారునింట సామాన్యపరిచారకుఁడుగ నుండి వృద్ధి లోనికి వచ్చెను. ఈమంత్రి మండలి యందు 12 గురు మంత్రులుండి రాజ్యమును పరిపాలింప నుంకించిరి. వీరి ప్రభుత్వము బారాభాయి ప్రభుత్వమని పరరాజ్యములయందు తరువాత హాస్యముగఁ జెప్పుకొనుచుండెడివారు. *

మహారాష్ట్ర దేశములో జరుగనున్న విప్లవమేమియో యని యనేకు లనేకవిధముల నూహించి సంభాషించుచుండిరి. కొందఱు మంత్రులందఱును కలిసి రాజును విడుదల చేయవలయునని యాలోచించుచున్నారని చెప్పుకొనసాగిరి. మఱికొందఱు సదాశివరావు భావూనని దొంగపేరు పెట్టుకొని, పట్టుపడి యిదివఱకు అహమ్మదు నగరము నందు నిర్బంధింపఁబడిన మనుష్యుఁడు చెఱ విడిపింపఁబడి రఘునాధరావునకు బదులుగ సింహాసనాసీనుఁడుగఁ జేయఁబడునని సుద్దులు చెప్పదొడంగిరి. సదాశివరావులేక చనువున సదాబాయని పిల్వఁబడు నితఁడు హిందుస్థానమందలి కనూజి బ్రాహ్మణుఁడు, తాను పానిపట్టు యుద్ధములో చనిపోయిన భావూనని పేరుపెట్టుకొని యొక తిరుగఁబాటును కల్పించెను కాని యతఁడు పట్టుకొనఁబడి ఖైదుచేయఁబడెను. అతని యనుచరుల

---

* ఈమంత్రిమండలికిని అష్టప్రధానులకును ఏమియు సంబంధము లేదు. వీరు అష్టప్రధానులలో నొకఁడైన పీష్వా నేర్పడిన మంత్రులు.

తరుమఁగొట్టఁబడిరి. సామాన్యప్రజలలో నిట్టి విపరీతపు వదంతులు సులభముగ నమ్మఁబడుట మనము చూచుచునే యున్నారము. ఆకాలములో మూర్ఖప్రజలు నిజమైన భావుసాహేబు, కొన్ని రాష్ట్రసంబంధ కారణముల వలన, ఖైదు నం దుంచఁ బడెననియు, అతఁడు మంత్రిమండలిచే ప్రజావిరోధియగు దాదా సాహేబునకు ప్రతిపక్షముగ వదలిపెట్టఁబడునని వింతవింతఁగతులఁ జెప్పుకొను చుండిరి.

అయినను మంత్రిమండలివారియొక్క యుద్యమము వెంటనే సిద్ధిపొందెను
1774 గాన నిఁక యూహల కవకాశము లేకపోయెను. నారాయణరావు
యొక్క భార్య గంగాబాయి మగఁడు చనిపోయినప్పటికి గర్భవతియై యున్నటులఁ గనుఁగొనఁబడినందున, ఆమెను సురక్షితమైన స్థలమునకుఁ దీసికొనిపోవు మిషమీద పురంధరుకోటకుఁ దీసికొని పోఁబడుటకు నిశ్చయింపఁబడెను. కాని నిజమైన యుద్దేశ మొకవేళ నామెకడుపున స్త్రీశిశువుకలిగినయెడల నాశిశువును రహస్యముగ మార్చివేయుటకని సామాన్యముగ నమ్మఁబడుచున్నది. దీనికొఱకుఁగాను సమానగర్భవతులగు ననేకబ్రాహ్మణస్త్రీలు కోటకుదీసికొని పోఁబడిరని తెలియవచ్చుచున్నది. జనేవరి 30వ తేదిన గంగాబాయి నానాఫడ్నవీసు చేతను, హరిఫంతుఫడ్కే చేతను సురక్షితముగ పూనానుండి తీసికొనిపోఁబడెను. ఆమెను తీసికొనిపోవుటకు కారణము బహిరంగముగఁ జెప్పఁబడినది. బహుజనసమ్మాన్యమైనసదాశివరావుభార్య యగుపార్వతీబాయి ఆమెవెంట వచ్చెను. మంత్రిమండలి వారందఱును, గంగాబాయిక్రింద సంరక్షకసంఘముగ నేర్పడి యామె పేరున రాజ్యమేల నారంభించిరి. రఘునాథరావుయొక్క పక్షము వారందఱును నిర్బంధింపఁబడిరి. నిజామాలీతోడను సాబాజీభాంస్లేతోడను రాయభారములు నడుపఁబడెను. వారిద్దఱును నారాయణరావు భార్య పక్షమువలంబింతుమని యొప్పుకొనిరి. రఘునాథరావు శిబిరములో కృష్ణరావు

---

*రగోబాయనియు, దాదాహేబనియు రఘునాథరావున కెట్టిచనువు పేరులుకలవో, సదాబాయనియు భావుసాహేబనియు సదాశివరావునకు చనువు పేరులు కలవు.



హరిపంతు ఫడ్కే.

బల్యంతుడవలన కష్టటలు కల్పింపఁబడి, పూనాయొద్ద రాజకార్యనిర్వాహకుల, నన్నుయిర్ధ్యఁబడినతోడనే, తిరుగబాటులోనికి విస్ఫోటం బగుటకు సిద్ధముగ నుండెను.

ఇంతలో రఘునాధరావు బళ్లారివఱకుపోయి హైదరుతో స్నేహితులతో సమాధానమున కొప్పుకొనెను. అతనికి ఖర్చులకు ధన మవసరమైనందున, హైదరు కొన్ని లక్షలరూపాయలిచ్చి,మఱి 25 లక్షలు మొత్తమగుటకు తక్కిన ధనమునుకూడ నిచ్చెదనని వాగ్దానము చేసినమీఁదట రగోబా మహారాష్ట్రజిల్లాలు మూడింటిపైకియావత్తువాక్కును వదలుకొనునట్లు వ్రాసియిచ్చెను. హైదరును, తక్కినజిల్లాలును తన [illegible]తిలో త్వరగా పడఁగలవని తెలిసికొనెను. పూనాలో జరిగిన వృత్తాంతమెల్ల వినినవాఁడై అర్కాడునవాబునొద్దనుండి కప్పము పుచ్చుకొను నుద్దేశమును విడిచి, హైదరుతో కళ్యాణదుర్గ దగ్గఱ సంధిచేసికొని, యతఁడు తనను పీష్వాగా నంగీకరించునట్లును, సంవత్సరమునకు తన కారులక్షలు కప్పముకట్టునట్లులును ఒప్పించెను.

రఘునాధరావు, తన శిబిరములో నింక నెవ్వరికిని తెలియకమునుపే పూనాలో జరిగిన విప్లవమును గూర్చి వర్తమానమును బడసినవాఁడై, అతని సర్దారులవలన నుండి ముఖ్యముగా ప్రతినిధియగు భవానీరావునుండి జాగ్రత్తగనుండుటకు బోధింపఁబడెను. వివేక మెందుకును పనికిరాని యిట్టిసమయమునందు రఘునాధరావేమి చేయుటకును పాలుపోనివాఁడై భవానీరావును, అతని జాగీరునకు నిర్ణయింపఁబడిన 300 అశ్వదళమునకు బదులుగా4000 సైన్యము నేల కలిగి యున్నాడని సమాధానము చెప్పఁగోరెను.అట్లు అకాత్తుగ నడిగినప్రశ్నకుఁ బ్రత్యుత్తర మిచ్చుటకు భవానీరా వంగీకరింపలేదు. అందుపైన రఘునాధరావు కోపోద్దీపిత మానసుఁడై యతని శిక్షించెదనని బెదరించి, సేనాపతి మురారిరావు ఘోరేపురేను ప్రతినిధి సైన్యమును కొల్లఁబెట్టుటకు అజ్ఞాపించెను. ఘోరేపురే, కొష్ట్రి విరోధులను జెనకంగా నియ్యకొందును కాని యిది గృహకలహము కావున నిందు జోక్యము పుచ్చుకొన ననియు, తనమింటి వలెనె తననియ్యఁ ప్రత్యుత్తరమిచ్చెను, వామనరావు గోవింద పట్వర్ధనుఁడును

ముఖ్యముఖ్యులగు సేనాపతులు వదేవిధముగ ప్రత్యుత్తరమిచ్చిరి. అందుపైన నతఁడు తన స్వంత సిబ్బందిని ఆజ్ఞాపించి, ఫిరంగుల నెక్కుపెట్టి భవానీరావు తగినసమాధాన మియ్యని యెడల అగ్నివర్షంబు కురిపింప సిద్ధముచేసెను. కాని ప్రతినిధి యీ బెదిరింపులకు ఝడియకనిశ్చలుఁడై యుండుటకనుంగొని మాను యార్లాతీరమునుండి వచ్చిన యతని యనుచరు లందఱును ఐకకంఠ్యంబుగ నతని తోడ పోరు నందు చత్తుమని చెప్పినందున, రఘునాథరావు స్వయముగ భవానీరావు కడ కరిగి దర్శనంబుఁగోరెను. అతనికి గౌరవముగ స్వాగతం బీయ్య బడెను. కాని యిద్దఱును సంభాషింప కూర్చుండి యున్నయెడ భవానీరావు తమయిద్దఱి మధ్యను తన ఖడ్గము నుంచెను. పీష్వా యట్టి జాగరూకత కేమి యవసరమని యడ్గగ భవానీరావు 'పంతుప్రధాను, తాను ప్రతినిధితో సంభాషించుచున్న సంగతిని మరచునేమో యని యట్లు చేసితి' నని చెప్పెను. దానిమీఁద నుభయ పక్షములవారును ఒండొరులతో నిశ్చయవాక్యములు పలుకుకొనిన తరువాత, రఘునాథరావు ప్రతినిధికి కొంత ధనమును ముందుగ నిచ్చునటుల నంగీకరించెను. అశాంబలాత్కార మంతటితో సాంతమయ్యెను.

రఘునాథరా విప్పుడు పూనాకు ప్రయాణమయ్యెను. ప్రతినిధియు మురారిరావు ఘోరెపడేయు నతని తోడనే యుండిరి. బహిరంగముగ మంత్రిమండలి పక్షమునకు తిరిగిపోయిన వారందఱి తోడను వామనరావు సైన్యమునుండి విడిపోయెను. ఏ నెప్పుడును రఘునాథరావు సైన్యమునకు కుడి వైపున నొక మజిలీ దూరమున నుండి అకాత్తుగ ముట్టడింపఁ బడకుండ తగినజాగ్రత్త తీసికొనుచు, మూడుదిక్కులనుండియు నెదురు వచ్చుచున్న సైన్యములు పైఁబడగనే తామును వెనుక నుండి యుద్ధమునకుఁ దలపడుటకు సిద్ధముగానుండిరి. త్రింబకరావు మామాయు, సాబాజీ భాంస్లేయు పురందరానుండి వచ్చుచుండిరి. నారిపంతు ఫడ్కే పూనానుండి వచ్చుచుండెను. నిజమాలీ యింకను రఘునాథరావుకు స్నేహితుని వలె నటించుచు, సైనముండి వచ్చుచున్న యే సైన్యముతోం దు కలిసి కొనిన, దానితో కలిసి రఘోబాతో పోరుసల్పుటకు వచ్చుచుండెను. త్రింబకరావు మామా, రఘునాథరావు యోధుడను ప్రసిద్ధి వహించినవాఁడైనందున,

వాని నోడించి గౌరవమును పొందవలెనని యాశచే, సాబాజీ యతని స్వంత కారణములచే మందగామియైయుంటఁ జూచి, తాను ముందుగ వేగిరపడి పంధర పురముదగ్గర మార్చి 4వ తేదీన భీమనదిని దాటివచ్చెను. రఘునాధరావు తత్సమీపము నేయున్నవాఁడై కాశీగామునకును పంధరపురమునకును మధ్యనొక్క విశాలక్షేత్రమున నకస్మాత్తుగ నతనిపైఁబడి 20 నిమిషములలో శత్రు సైన్యము కంటె బలహీన సైన్యముతోడనే సంపూర్ణ జయము నొందెను. త్రింబకురావు మామా ప్రాణాపాయంబగు గాయమును తిని ఖైదీగపట్టుకొనఁబడెను.

రఘునాధరావు ఒక్క తన స్వంత సిబ్బందియగు 10,000 గుఱ్ఱపుదళముచేతనే సహాయము చేయఁబడి శత్రువు పైబడి వచ్చి యుద్ధముచేసెను. త్రింబకురావు యొక్క సైన్యములో సహాయ సేనాపతి యగు గంగాధరరాస్తియా గాయపడెను గాని తప్పించుకొనిపోయెను. ప్రతినిధిగాని, మురారిరావు ఘోర్పురేగాని, యిద్దఱును రఘునాధరావు సైన్యము నందున్నను, యుద్ధమునందు పనిచేయలేదు. ఇందు ప్రతినిధి తరువాత చీలిపోయి కొంతకాలము పిమ్మట హరిపంతు ఫడ్కేను చేరెను. మురారిరావు యీ కల్లోలమును సహింపక త్వరలో తన రాజ్యమునకుఁ బోయి తిరిగి యెన్నడును కృష్ణానదిని దాటి రాలేదు. హరిపంతు ఫడ్కే. వెంటనే సాబాజీ భోంస్లే తోడను, నిజాముతోడను కలిసికొనెను కాని యందెవ్వరును యుద్ధమును వెంటనే సమాప్తమునకుఁ దీసికొని వచ్చుటకు తొందర పడలేదు.

రఘునాధరావుచే నట్లు సంపాదింపఁబడిన విజయము ప్రాణావశిష్టంబగు నతని యుద్యమమునకు తాత్కాలిక సత్వమునొసంగెను. అతఁడు పంధరపురములో, కొంతవఱకు కానుకలవలనను, విశాజీ కృష్ణుఁడు హిందూస్థానమ్ము నుండి వచ్చినపుడు తెచ్చియిచ్చిన విలువఁగల నగలను తాకట్టు పెట్టుటవలనను చాలాధనమును ప్రోగుచేసెను.

పూనాలో పెద్దకలవరము పుట్టెను. అట్టి సమయములందు సాధారణముగ నాచారమైన ప్రకారము ప్రజలు శత్రువులకును మిత్రులకునుకూడ భయఁ

పడి, తమతమ యాస్తి నెల్ల మూటకట్టుకొని, కోటలకుం గాని
ప్రిలు. చిన్న కుగ్రామములకుంగాని పాఱిపోవుట క్షేమమని యట్లు
చేయంజొచ్చిరి. రగోబా కేతనముక్రింద సైన్యములు కూడం జొ
చ్చెను. అతఁడు కొన్ని దినములు పూనాకుం బ్రయాణమై బయలుదేరెను. కాని అట్లు నలువది వేల వఱకుం గూడిన సైన్యమునకు ఖర్చులకు ధనము చాలనివాండై, వారి భక్తియెడల ననుమానంబుకలిగి, ఇంతకంటె సింధియా హోల్కారుల నుండియు, ఇంకను ఇంగ్లీషువారినుండియు సాహాయ్యమును బొందంగల నని యాశవొడము, వెంటనే బరహాంపురమునకు మార్గముపట్టెను. మంత్రిమండలిలో వారిలోవారు మనస్పర్ధలు కలిగి రగోబాయొక్క కోపానలంబునకు భీతిపడి, సాబాజీ భోంస్లేయొక్క యుద్దేశములను గూర్చియు నిజామును గూర్చియు ననుమాన చేతస్కులై, అదివఱకు అసంతుష్టులై ముభావముగ నున్న మహారాష్ట్ర యోధులకు సాహాయ్యముగ రప్పించుటకు, సతారారాజును బంధవిముక్తుని చేయ నుద్యోగించి యున్నసమయమున, రఘునాధరావు వెనుకకు మరలెను. రగోబా వెనుకకు తగ్గగానే మంత్రిమండలివారిపక్షమునకు బలము వచ్చెనే. పైయుద్యమమును వారు మానుకొనిరి. హరిపంతు ఫడ్కేయు, నిజామును, సాబాజీభోంస్లేయు, 50,000 సైన్యముతో నతనివెంట నంటిరి. కాని రగోబా యెడల చేసిన ద్రోహమునకు మంత్రిమండలిచే వాగ్దానము చేయంబడిన కొంత దేశమును పుచ్చుకొనుటకుంగాను నిజామాలీ బుద్ధి పూర్వకముగ నాతఱుముట నాలస్యపఱచెను. అందువలన పలాయనుం డగు పేష్వా కానుకలనుం జేర్చుకొనుటకు కావలసిన యవధి కలిగిన వాఁడయ్యెను. అయినను ఆపత్కాలము గడచి పోయెను. రఘునాధరావు తన కార్యములను చక్కంబఱచుకొను సమయమును పోఁగొట్టుకొనెను. ఏప్రిలు 18వ తారీఖున గంగాబాయికి మాధవరావు నారాయణుం డుదయించినతఁడు పేష్వాయగు నాశకు సంపూర్ణ విఘాతమును కల్గించెను. అతని జన్మవిషయములో దేశమునెల్లం గనుమాయ వారు చేసిన యేర్పాటులను గూర్చియనుమానములు చాలఁగలిగినను, అశిశువు నారాయణరావు పుత్రుండైనందు కేమియును సందేహములేదు.

గంగాబాయి, తన కుమారుని పక్షమున పీష్వాయొక్క యభిషేకపు దుస్తులను గైకొనుటకు, తుకారాంబాపును, నానా ఫడ్నవీసును నియోగించెను. ఆ దుస్తులను, మాధవరావు నీలకంఠ పురంధరే ద్వారా, రాజా సతారా నుండి పంపించెను. ఆశిశువు 40 దినముల వయస్సున పీష్వాగా నభిషేకింపఁబడెను. క్రొత్తగవర్నమెంటు వారి ప్రథమచర్య, జానోజీభోంస్లే దత్తపుత్రుఁడైన రఘోజీని సేనాసాహెబుసుభే పదవి నుండి తొలఁగించి, తమ మిత్రుఁడగు సాబాజీ కిచ్చుటయై యుండెను.

రఘునాధరావు, హోల్కారు సింధియాలవలన కలిసికొనఁబడెద నను నాశచే బర్హాంపురములో కొంతకాలముండెను. కాని చివరకు కొందఱు స్నేహితుల హితోపదేశములకు వ్యతిరేకముగ నతఁడు నర్మదా నదిని దాటెను. అంత మూడాజీ భోంస్లేయు, 7000 మంది తప్ప, తక్కిన యతని యనుచరులందఱును విడిచిపోయిరి. అతఁడు ఇందూరు చేరునప్పటికి సింధియా హోల్కారులు కలిసికొని మిక్కిలి గౌరవించిరి. ఈ యిద్దఱు ప్రముఖులు నతనికి సాహాయ్యము చేయంగలరని సామాన్యముగ నెల్లరును నమ్మియుండిరి. అంతియకాక అప్పుడు గుజరాతు కొఱకై వివాదపడుచున్న గోవిందరావు గాయక్వాడును, ఫత్తేసింగు గాయక్వాడును తమ తగాయిదాను పరిష్కారమునకు హోల్కారు సింధియాల యెదుటఁబెట్టి, తాముగూడ వారితోపాటు రఘునాదరావును సాహాయ్యము చేసెదమని చెప్పియుండిరి.

ఈపదంతులవలన నిజామాలీ నిర్ఘాంతపోయి, తనకు వాగ్దానము చేయఁబడిన దేశభాగములను పొందుటకు ఆశాభంగము నొందినవాఁడై, తన కోరికల నెవ్వరియ్యఁ గలిగిన వారికి తన సాహాయ్యము నమ్ముకొన మనోనిశ్చయము చేసి, కాని వర్షాకాలమున బాసం నొద్ద తన సైన్యమునకు విశ్రాంతి నిచ్చియుండెను. హరిపంతు ఫడ్కే బర్హాంపుర సమీపమున దండు విడిసియుండెను.

శీఘ్రకాలములో మంత్రులందఱును ఒకరి యెడల నొకరీర్ష్యాపరులైరి. శైశవపరిపాలనయందు నానాఫడ్నవీసు ముఖ్య నిర్వాహణమును తన పైన వేసికొనకుండ జాగ్రత్తగనుండెను. విప్లవమువలన నధికులైన మహాపురుషులందఱి

గారి నే. మొదట న్యాగస్థానములందు కనబడక అతఁడు ప్రజలందఱిలోను గౌరవ్యమును ప్రాముఖ్యతను కలిగియుండఁదగిన సఖారాం బాపూను తాను సాహాయ్యము చేయుచుండెను. ఇట్లు కేవలము బుద్ధిపూర్వకముగఁ గాక కొంతవఱకు అధైర్యమును చేతఁగూడ చేసెను. సఖారాం బాపూ, వృద్ధుఁడును, వివేక మహితుండును, సమయ సేవకుండును, అయి! యున్నను, నానాఫడ్నవీసుకంటె ధైర్యసారము కలవాఁడు. ఇతఁడు కార్యనిర్వాహణమందు తనకు ద్వితీయుండై, వినయ విధేయతలను పూర్వముగఁ జూపించుచున్న నానా ఫడ్నవీసు తనకు ముందు భవిష్యదైరియు బలశత్రువు కానని యెఱుంగ లేక పోయెను. సఖారాం బాపూ మంత్రిమండలినుండి తొలఁగిపోయిన పిమ్మట వారి యుద్యమము సాగిన మగుననుటకు సందియము లేదు. నానా యిందుకొఱకై తలఁచుచు భయపడుచుండెడివాఁడు. నానా తన యధికారమును వృద్ధిచేసికొనుట కుపయోగించిన పద్ధతి యితఁడు సంరక్షకురాలగు గంగాబాయి మనస్సుపై సంపాదించిన యాకర్షణయై యుండెను. ఈవిషయము మొదట బహారవాన్యమైనప్పటికిని ఆ బాల వితంతువు నానా ఫడ్నవీసుయెడల గాఢానురాగయై యతనిచే నా వృద్ధ మంత్రి నెట్లునడిపింపవలెనో ఆపద్ధతు లన్నియు నేర్పఁబడెను.

నానా యొక్క పెదతండ్రి కుమారుఁడగు మోరోబా వెనుక మాధవరావుయొక్క కార్యాలోచన యందు ముఖ్యుఁడై యుండెనని మనము చూచి యున్నాము. ఇప్పుడతఁడు నాలోచనల కేమియు లక్ష్యము చూపఁబడక పోవుట నతఁడు కనుంగొని యసంతుష్టుఁడై యుండెను. ఇతఁడు రఘునాధ రావు పక్షమునకు క్షేమముగ చేరి యచట తనభవిష్యదధికారమును స్థిరపఱచుకొనుటకు వీ లున్న యెడల నట్లు చేయుట కుద్యుక్తుఁడై యుండెను. ఇంకను సఖారాం నానాలయొక్క యధికారమునకు లోఁబడుట కిష్టములు గాని యితర మంత్రులును సామాన్యమగు నసంతుష్టిని కలవారై యుండిరి. ఇట్లు మంత్రి మండలి రెండు కక్షలుగఁ జీలెను. వీరి వైషమ్యము, మోరోబా, బజాబా, బాబాజీ నాయకు మొదలైనవారు రఘునాధ రావుతోఁ జేయుచున్న రహస్యోత్తర ప్రత్యుత్తరములు పట్టుపడుటచే మఱింత లోకప్రసిద్ధ మయ్యెను. పై ముగ్గురును,

తుకారాంబాపూను, నానాఫడ్నవీసును, గంగాబాయిని, ఆమె పుత్రుని పట్టి యిచ్చుటకాలోచన చేయుచున్నటుల హరిపంతు ఫడ్కే అడ్డము గొట్టిన యుత్తరముల వలనఁ దెలియవచ్చెను. పురంధరు కోట యందు శీతకాలము నందు బహుచలిగా నుండుట వలన తుకారాం బాపూ మొదలైన పైవారం దఱును అచ్చోటు విడిచి దగ్గఱ నున్న సాశ్వడు గ్రామమునందు కాపుర ముండవచ్చిన సమయములో పైఁ జెప్పిన ప్రయత్నము చేయఁబడినది. కాని యీ కుట్రనుగూర్చి జూను 30-వ తేదీన వర్తమానము తెలియగనే వారు తక్షణము భయఁపడి పురంధర కోటలోనికి పాఱిపోయిరి.

హరిపంతు ఫడ్కే బర్హాంపురమున కొంత సైన్యభాగమును విడిచి పురంధరుకై ప్రయాణమాయెను. నిజామలీతో నున్న మంత్రిమండలివారి తొందరటు, 13 లక్షల జాగీరు నిచ్చునటుల చేసి, యింకనువాగ్దానము చేసి, అతని తమ యుద్యమమునకుఁ దోడుపడుటకు, ఔరంగబాదునకు కదలునట్లు చేసెను. రఘునాథరావు పక్షపుమంత్రులయొక్క కుట్రబయటపడినందున వారిప్రయత్నము లెల్లవ్యర్థములయ్యెను. హరిపంతుఫడ్కే అజంటాఘాటునొద్దనే వాగియుండుట కాజ్ఞయియ్యఁబడెను.

హైదరాలీ, మహారాష్ట్రరాజ్యములో నీకల్లోలములను జూచినతోడనే తుంగభద్రానది దక్షిణముననున్న మహారాష్ట్రజిల్లాల నన్నిటిని జయించుటకు సమయము స్వీకరించెను. అతఁడు శేరాను స్వయముగ పట్టుకొనెను. అతని కుమారుఁడు టిప్పూ గుత్తికొండను ముట్టడించెను. ఆసమయముననే బసాలజ్జంగు ఆదోనినుండి మహారాష్ట్రదేశము నందు ప్రవేశించి హత్నీ, మొరిచి గ్రామముల వఱకు కానుకలను సంగ్రహించెను. శేరా గుత్తికొండలను రక్షించుటకే ప్రయత్నమును జేయజాలలేక పోయెను. కావున నవి రెండును లోఁబడెను. కాని వామన రావు గోవింద పట్వర్ధనుఁడును, ఆనందరావు రాస్తియాయును తమ తమ జిల్లాలను రక్షించుకొనుటకై పంపింపఁబడిరి. వీరి వలన బసాలజ్జంగు సేనకు తఱిమివేయఁ బడెను. ఈప్రముఖు లిద్దఱును తిరిగి వెంటనే రాజధానికి రావలసినదని యాజ్ఞాపింపఁబడిరి. భావుజోస్వంతు ఫాడ్నీసు, రామ చంద్ర

సకారాముఁడును, విఠాజీ కృష్ణుఁడును, భవానీరావు ప్రతినిధియు, జిల్లాలన్నిటియందును భటుల్లను పోగుచేసికొని దసరాకు పూనాకు రావలసినదని యాజ్ఞాపింపఁబడిరి. దేశము నందంతటను రగోబాయొక్క దుష్కృత్యములను వెల్లడిచేయుచు మంత్రిమండలివారి యుద్యమముయొక్క ధర్మమును ప్రకటింప నేజంట్లు నియమింపఁబడిరి. మంత్రులందఱును మరల నొక్కటియై యైకకంఠ్యముగ రగోబా లోఁబడ వలసినదని కోరిరి. వారు యుద్ధమునకు కావలసిన సన్నాహంబులను చేయుటఁజూడ, శాంతిని నిశ్చయంబుగ ప్రతిష్ఠాపించుటకు అవసరమైన పద్ధతి నెఱింగి నటుల కనుపడుచుండిరి.

ఈ మధ్యకాలములో రఘునాథరావు, సింధియాహోల్కారుల సైన్యముతో చాలవఱకు కలిసి యున్న సైన్యము సుమారు 30,000 సంఖ్యవఱకు కలిగియుండి ఇండూరునుండి తపతీనదీతీరమునకు పోయి యచట మూఁధాజీ తోడను గోవిందరావు గాయక్వాడుతోడను కలిసి కొనుటకై యెదురుచూచుచుండెను. ఈ స్థితిలో రఘునాథరావు బొంబాయిలోనియింగ్లీషు గవర్నమెంటును సాహాయ్యము కోరెను.

ప్రథమసంపుటము సమాప్తము.

ఆంధ్ర భాషాభివర్ధనీ సంఘము.

(లిమిటెడ్) బందరు.

ఆంధ్రభాషయందు, సనాతనాధునికేతిహాసములు, ప్రకృతిశాస్త్రములు, అన్యదేశదార్శనిక గ్రంథములు, మహాపురుషుల జీవితములు, గణితశాస్త్రములు, రాజనీతిశాస్త్రములు, ఆర్థికశాస్త్రములు, వృత్తులను, పరిశ్రమలను, వాణిజ్యమును నడుపువిధమును దెల్పు గ్రంథములు, నవలలు, లేనిలోపమును నివారింపనెంచి రు. 10000-0-0 మూలధనముతో, నీకంపెనీ స్థాపింపబడినది.

విక్రయమునకు సిద్ధమయిన గ్రంథములు.

1. భారతధర్మదర్శనము:—(ద్వితీయముద్రణము,) మనోహరాలంకారశోభయొదవఁ జెవులకు తీయనిపలుకులం జదువరుల నమందానందపయోనిధి నిమగ్నచేతస్కులం గావించుచుండును. నిర్మలదేశానురాగమును ప్రబోధించు పద్యకావ్యము. వెల రు. 0-2-0 చందాదారులకు రు. 0-1-6.

2. పీష్వా నారాయణరావు:—(ద్వితీయముద్రణము) శోకకరుణాదిరసపూరితంబై చదువరులమనసు గరఁగునట్లు చక్కఁగ వ్రాయఁబడిన వచనకావ్యము. వెల రు 0-2-0 చందాదారులకు రు. 0-1-6.

3. అక్బరుచరిత్ర:——సర్వసద్గుణాలంకారుఁడయి సుకవిజనవర్ణనీయుండై, సర్వజనసమత్వంబుగలిగి విమలకీర్తింగాంచిన చక్రవర్తియొక్క పుణ్యచరిత్రము. ఆకాలపు హిందూదేశపు స్థితియంతయు నీపొత్తమునఁ గన్నులఁగట్టినట్లు మిగుల నిపుణముగ వర్ణింపఁబడియున్నది. వెల రు. 0-7-0 చందాదారులకు రు. 0-5-0.

4. వివేకానందస్వామి జీవితము:——మనోహర వాగమృతధారలం గురిపించి యమెరికాఖండవాసులంగూడ వశీకృతులంజేసికొని భరతవర్షంబు వారింతటి మహనీయులే! బళే! యని పాశ్చాత్యులు దలంచుచున్నట్లొనర్చిన మహాయోగి జీవితము 152 పుటలుగల గ్రంథము పటములతో వెల రు. 0-10-0 చందాదారులకు రు. 0-6-0.

5. సిక్కులచరిత్ర:—(పునర్ముద్రణము) అచ్చులోనున్నది.

6. విద్యాసాగరుని చరిత్ర:—నిర్మలజ్ఞాన విశారదుండును అనిర్వచనీయ కళ్యాణగుణాకరుండును ఆర్తజనసంత్రాణపరాయణుండగు నిట్టి మహనీయుండు త్రికాలంబులం గలుగఁడంచు విబుధప్రపంచంబు సంభావింపఁ జొప్పారిన పుణ్యపురుషుని చారిత్రంబు. ఆంధ్రభాషఁ జదువనేర్చినందు కీపాత్రమొక్కటి సంపూర్ణప్రతిఫలం బొసంగుటకుం జాలియుండు. 150 పుటలగ్రంథము బటములతో వెల రూ. 0-9-0 చందాదారులకు రూ. 0-6-0.

7. రామమోహనరాయలచరిత్ర:—నిర్మల బ్రహ్మజ్ఞాన ప్రభాకరోదయంబుఁ గావించి, అనాథలగు యువతులనుబట్టి బలవంతముగ గాల్చివేయు సతి యను భయంకరాచారంబు నడంచి తనమాతృభూమియగు భరతవర్షంబునుద్ధరింపఁ దత్పూర్వమెన్నఁడు హిందువు లెవ్వరును వెళ్లుటకుత్సాహించని ఖండాంతరమ్మున కనేకమాసములు మహార్ణవముపైఁ బయనమొనర్చి యచట మనకొఱ కనేకయుపన్యాసములనిచ్చి కార్యవిజయము గాంచుకొఱకు పాటుపడుచుండిన మహాపురుషుని పూజ్యచారిత్రము. 150 పుటలుగల గ్రంథము. పటములతో వెల రూ. 0 - 9 - 0 చందాదారులకు రూ. 0-6-0.

(8) స్వాతంత్ర్యదర్శనము:— ఇంగ్లాండునందు రాజకీయతత్వశాస్త్రజ్ఞుడని, ఘనతకెక్కిన, జాన్ స్టూవర్టు మిల్లుగారిచే రచింపబడిన (John Stuart Mill) గ్రంథమునకు సరియగు తెలుగు వెల రూ. 0-12-0 శాశ్వత చందాదారులకు రూ. 0-7-0.

9. మహారాష్ట్రచరిత్ర:—ప్రథమభాగము వెల రూ. 1-14-0 శాశ్వత చందాదారులకు రూ. 1-4-0.

ముద్రణయందు ఉన్న గ్రంథములు.

10. ఆంగ్లేయచరిత్ర 11 అక్బరుచరిత్ర. 12 ఆరోగ్యశాస్త్రము 13 చీనాచరిత్ర. 14 ఔరంగజేబు 15 పశుశాస్త్రము. 16 ఆంధ్రచరిత్ర.

మా శాశ్వత చందాదారులకు 100 పుటలగ్రంథము రూ. 0-4-0లకు నిచ్చుచుందుము. దరఖాస్తులు చేయువారు, వివరముగ విలాసము వ్రాయవలయును.

మేనేజరు,
ఆంధ్రభాషాభివర్ధనీసంఘము,
మచిలీపట్టణము.

ఆంగ్లేయ వైద్యచింతామణి.

డెమీ ౮ వ సైజు ౩౮౬ పుటలు : వెల రు 6-0-0.

౫ చిత్రపటములు.

(మంచిదళమగు కాగితములపై జక్కగ ముద్రింపబడినది.)

ఆంగ్లేయ వైద్యశాస్త్రమంతయు అనుభవజ్ఞానము ననుసరించియు, ఎక్కువ శోధనల వలని ఫలితములను బట్టియు, వ్రాయబడియున్నది. ఆంగ్లేయ వైద్యశాస్త్రసంబంధమగు గ్రంథమేమియు ఆంధ్రభాషయందు లేకుండుటచే, నీ కొఱతను దీర్ప యత్నించుచు, నీగ్రంథము బ్రకటించియున్నారము. ఈగ్రంథమునందు ఆంగ్లేయ వైద్యశాస్త్రసంబంధమగు ప్రమాణగ్రంథములయందలి అంశములు, విపులముగను సర్వసాధారణులకు యర్థమగునటులను, తేటతెలుగులో వ్రాయబడియున్నవి. ఈ గ్రంథమును బరిశీలనగా జదువుటవలన ప్రతివారును, వైద్యవిషయమయి యిదివఱకేమియు దెలిసినవారు కాకున్నను దమంతట దామే రోగికి జాలవఱకు జికిత్స జేయగలిగియుందురని దృఢముగ జెప్పగలము. ప్రతివ్యాధికిని, నిర్వచనమును, ఉత్పత్తియును, కారణములును, లక్షణములును, చికిత్సయును, స్పష్టముగను, చక్కగను, వ్రాయబడియున్నవి. ఒక్కొక వ్యాధికి యేయేమందులు వాడనగునో అట్టి వాటి జాబితా చేర్పబడియున్నది. విష ప్రయోగములకు విరుగుళ్లు చెప్పబడియున్నవి. గుండెకాయను, శ్వాసకోశములను, బరీక్షించువిధమును, మూత్రమును బరీక్షించువిధమును, స్పష్టముగ వ్రాయబడియున్నవి. వ్యాధియందు జేయదగు దేహపరిశోధన విధానముయొక్క క్రమమంతయు జెప్పబడియున్నది. ముఖ్యములగు ఔషధయోగములును యిందు చేర్పబడియున్నవి. ఆంగ్లేయభాషయందు పరిచయముగలవారైనను మిగుల వెలగల పెద్దపుస్తకముల దెప్పించి యోపికతో జదివి అందలి సారాంశములను గ్రహించుట దుస్తరముగనుక, నట్టివారును యీ గ్రంథమును బఠింపదగియున్నది. ఆంగ్లేయ వైద్యశాస్త్రమునందలి రహస్యములను గ్రహింపకయుండుటచే, కలరా, టైఫాయిడ్, చలిజ్వరము, న్యుమోనియా, మొదలగు తీక్షణవ్యాధులవలన మనదేశమందలి అనేక ప్రాణములను గోల్పోవుచున్నామని చెప్పుటకు సందియములేదు. ఈ గ్రంథముయొక్క క్రమ ఉపయోగమువలన నాంధ్రదేశమందలి యీ దురవస్థ చాలవఱకు దప్పింప గలిగి యుండునని ధైర్యముగ జెప్పగలము.

సేతు బ్రదర్సు, మచిలీపట్నము.

పులిందాసు శీలము.